ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ప్రకాశం 5

జిల్లా వార్తలు

మంగళవారం 30, జనవరి 2024

అధికార వైసీపీలో అభ్యర్థుల రగడ కొనసాగుతూనే ఉంది. గిద్దలూరులో ఎమ్మెల్యే అన్నా రాంబాబు కేంద్రంగా ద్వితీయస్థాయి నాయకుల్లో జగడం ప్రారంభం కాగా నియోజకవర్గాన్ని వీడేందుకు మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి సిద్ధం కాలేదు. కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ మరోచోట అవకాశం కోసం సోమవారం కూడా సీఎంవో చుట్టూ ప్రదక్షిణలు చేశారు. విజయసాయి నుంచి వచ్చిన సమాచారంతో జిల్లాలో ఆపార్టీ ముఖ్యనేత, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సోమవారం సాయంత్రానికి తాడేపల్లి చేరారు. అప్పటికే అటు జగన్, ఇటు విజయసాయిలు వేరే కార్యక్రమాలకు వెళ్లడంతో వెనుదిరిగారు. మంగళవారం ఉమ్మడి జిల్లాలోని ఒంగోలు లోక్‌సభ, గిద్దలూరు, మార్కాపురం, కందుకూరు, పర్చూరు అసెంబ్లీ స్థానాలపై అధిష్ఠానం చర్చించి తుది నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.



రాంబాబుకు మద్దతుగా బేస్తవారపేటలో ప్రదర్శన చేస్తున్న ఆయన మద్దతుదారులు

రోజుకో రగడ

- గిద్దలూరులో రాంబాబు రచ్చ
- ఆయనకు మద్దతుగా అనుచరుల కార్యక్రమాలు
- కొమరోలులో సమావేశం, బేస్తవారపేటలో ర్యాలీ
- తాడేపల్లి చేరిన బాలినేని
- నేడు మిగిలిన స్థానాల విషయం కొలిక్కి వచ్చే అవకాశం
- మళ్లీ సీఎంవోకు వెళ్లిన బుర్రా
- పర్చూరు నుంచి పోటీకి భరత్ సిద్ధం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గిద్దలూరు నియోజకవర్గ అధికార పార్టీలో అభ్యర్థి రచ్చ నెలకొంది. స్థానికేతర నాయకులను పంపవద్దు అంటూనే మాజీ మంత్రి బాలినేనిని పంపితే మాకు ఓకే అని ఆ నియోజకవర్గంలోని కొందరు వైసీపీ ప్రజాప్రతిని ధులు ప్రకటించిన నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే అన్నా రాంబాబు అనుచరులు బహిర్గతమయ్యారు. 'రాంబాబుని స్థానికేతరుడని ఆ నాయకులు ఎలా అంటారు, ఆయన స్థానికుడే. ఆయనకే టికెట్ ఇవ్వాలి' అని అధిష్ఠానాన్ని కోరుతూ కొమరోలు, బేస్తవారపేట మండ లాలకు చెందిన కొందరు నాయకులు సోమవారం మీడి యా సమావేశం పెట్టి బహిరంగ ప్రకటనలు చేశారు. బేస్తవారపేటలో అయితే రాంబాబు మద్దతుదారులు ప్రదర్శన కూడా చేశారు. దీంతో అసలు పోటీచేయనని ప్రకటించిన ఎమ్మెల్యే రాంబాబు తిరిగి పోటీకి సిద్ధమ య్యాడన్న విషయం తేటతెల్లమైంది. శనివారం నాటికి ఆయన మార్కాపురం నుంచి పోటీకి సిద్ధపడినట్లు సమా చారం. కుమారుడు కృష్ణచైతన్య ఒత్తిడితో ఆయన తిరిగి అధిష్ఠానంతో చర్చలకు వెళ్లినట్లు కూడా సమాచారం.

తాడేపల్లికి వెళ్లిన బాలినేని

పార్టీ అధిష్ఠానం బాలినేనిని తాడేపల్లికి పిలిచింది. ఒంగోలు లోక్‌సభ స్థానంతోపాటు మిగిలిన అసెంబ్లీల అభ్యర్థుల ఎంపికపై ఆయనతో మాట్లాడేందుకే పిలిచారు. ప్రధానంగా ఆదివారం గిద్దలూరులోని స్థానిక నాయకులు స్థానికేతరులకు ఈసారి టికెట్ వద్దంటూనే బాలినేని అయితే ఒకే అని చెప్పటాన్ని కూడా అధిష్ఠానంలోని నాయకులు పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిసింది. ఒంగోలులో పోటీకి బాలినేని సిద్ధమైనప్పటికీ ఆయన కుమారుడికి లోక్‌సభకు పోటీకి అవకాశం ఇమ్మని గతంలోనే అడిగి ఉన్నారు. కానిపక్షంలో కుమారుడిని గిద్దలూరు నుంచి అయినా రంగంలోకి దింపే ఉద్దేశం బాలినేనికి ఉందా అన్న అనుమానాలు చాలామందికి లేకపోలేదు. ఈ విషయంపై కూడా అధిష్ఠానం బాలి నేనితో స్పష్టంగా మాట్లాడే అవకాశం కనిపిస్తోంది. సోమవారం మధ్యాహ్నానికల్లా విజయవాడ రావాలని విజయసాయి సూచించగా సాయంత్రానికి బాలినేని అక్కడికి చేరారు. దీంతో విజయసాయి చిలకలూరిపేట లో ఓ కార్యక్రమానికి వెళ్లిపోగా, సీఎం జగన్ కూడా ఆ సమయానికి ఇంట్లోకెళ్లి సీఎంవో అధికారులతో ప్రత్యేక కసరత్తులో మునిగిపోయారు. దీంతో బాలినేని మంగళవారం అధిష్ఠానం నాయకులను, సీఎంను కలిసేందుకు అక్కడే వేచి ఉన్నారు. ఒంగోలు లోక్‌సభ నుంచి చెవిరెడ్డిని రంగంలోకి దింపాలని అధిష్ఠానం భావిస్తున్నందున ఆ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్న బాలినేని ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది చూడాల్సి ఉంది. చెవిరెడ్డికి, అతని కుమారుడికి అవకాశం ఇచ్చినట్లే తన కుమారుడికి కూడా అవకాశం ఇవ్వాలని బాలినేని పట్టుబట్టే అవకాశం లేకపోలేదు. కాగా కనిగిరి నుంచి తిరిగి తనకే టికెట్ ఇవ్వాలని కోరుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ సోమవారం కూడా సీఎంవోలో ప్రత్యక్షమయ్యారు. కనిగిరి కాకుంటే కందుకూరు నుంచైనా పోటీచేయాలన్న ఉద్దేశంతో ఆయన ఉన్నట్లు తెలిసింది. మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మాత్రం సోమవారం సీఎంను కలిసేందుకు వెళ్లకపోవటం చర్చనీయాంశం. మార్కాపురాన్ని వీడకూడదన్న దృఢనిర్ణయంతో ఆయన, ఆయన కుటుంబం ఉన్నట్లు తెలుస్తోంది.

రాంబాబు స్థానికుడే

రాజకీయాల నుంచి వైదొలగకూడదని భావించిన అన్నా రాంబాబు కుమారుడు చైతన్య. అవసరమైతే తాను పోటీకి సిద్ధమని కూడా చెప్పినట్లు తెలుస్తోంది. అందుకనుగుణంగా మార్కాపురం అయినా ఓకే అన్న సంకేతం ఇచ్చారు. దీంతో వారికి మార్కాపురం కేటాయించి ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని గిద్దలూరు పంపాలని అధిష్ఠానం భావించింది. అయితే అందుకు నాగార్జునరెడ్డి ససేమిరా అనటంతో తాత్కాలికంగా ఆ ఆలోచనను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో గిద్దలూరు నియోజకవర్గంలోని కొందరు నాయకులు మీడియా ముందుకు వచ్చి స్థానికేతరులు వద్దనటాన్ని సోమవారం రాంబాబు వర్గీయులు వ్యతిరేకించారు. రాంబాబు స్థానికుడే అని చెప్పటంతోపాటు ఆయనకే గిద్దలూరు టికెట్ ఇవ్వాలని కూడా కోరారు. దీంతో రాంబాబు లేక ఆయన కుమారుడు మార్కాపురం, కాకుంటే గిద్దలూరు నుంచి అయినా పోటీకి సిద్ధంగా ఉన్నారా? అన్న అనుమానాలు పెరిగాయి. నియోజకవర్గంలోని కిందిస్థాయి నాయకులు ఇలా విడివిడి ప్రకటనలు, గ్రూపు వ్యవహారాలతో వైసీపీలో ముఠాల హోరు పెరిగిపోయింది.

పోటీకి భరత్ ఓకే

పర్చూరు అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి తాను సిద్ధమని గొట్టిపాటి భరత్ సీఎం జగన్‌కు సమాచారం పంపారు. రెండురోజుల క్రితం జగన్ అతన్ని పిలి పించుకుని మీరు పోటీకి సిద్ధమేనా, ఎంతమేర ఆర్థిక వనరులు సమకూ ర్చుకోగలరని అడగటం తెలిసిందే. అన్నీ పరిశీలించుకుని సోమవారం చెబుతానని సమాధానమిచ్చిన భరత్.. సోమవారం తాడేపల్లి వెళ్లి తాను పోటీకి సిద్ధమని చెప్పినట్లు తెలిసింది. మరోవైపు పర్చూరు వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్న ఆమంచి కృష్ణమోహన్ ఆదివారం మరోసారి చీరాలలోని తన ముఖ్య అనుచరులతో ప్రత్యేకంగా భేటీ అయినట్లు సమాచారం. అదేసమయంలో రెండ్రోజుల క్రితం ఆయన కూడా విజయసాయిని కలిసి తాను పర్చూరు నుంచి పోటీకి దూరం కానని, చీరాల విషయంలో తాను చేసిన ప్రతిపాదననే పరిగణనలోకి తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. దీంతో మంగళ, బుధవారాల్లో పర్చూరుపై అధిష్ఠానం ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం లేకపోలేదు.



నేడు, రేపు ఉమ్మడి జిల్లాలో నారా భువనేశ్వరి

- నిజం గెలవాలి యాత్ర
- ఐదు నియోజకవర్గాల్లో పర్యటన
- పలు కుటుంబాలకు పరామర్శ



ఒంగోలు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి ఈ నెల 30,31 తేదీల్లో ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. రాజకీయ కార్యక్రమాలకు సాధారణంగా దూరంగా ఉండే ఆమె ఇటీవల చంద్రబాబును వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసులో అరెస్టు చేసి జైలులో ఉంచడాన్ని నిరసిస్తూ జనం మధ్యకు వచ్చారు. చంద్రబాబు అరెస్టుతో కలత చెంది రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది టీడీపీ కార్యకర్తలు, అభిమానులు హఠాన్మరణం చెందారు. అలాంటి వారి కుటుంబాలకు మేము అండగా ఉన్నామనే భరోసా ఇచ్చేందుకు భువనేశ్వరి 'నిజం గెలవాలి' పేరుతో జిల్లాల వారీ పర్యటనలు ప్రారంభించారు. అందులో భాగంగా మంగళ, బుధవారాల్లో ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. పార్టీ వర్గాల సమాచారం మేరకు.. ఉమ్మడి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఆమె పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించనున్నారు. పర్చూరు, ఒంగోలు, దర్శి, కొండపి, కందుకూరు నియోజకవర్గాల్లో పర్యటన సాగనుంది. అలాగే మంగళవారం రాత్రి ఒంగోలులో, బుధవారం రాత్రి కందుకూరులో బస చేయనున్నారు. భువనేశ్వరి కార్యక్రమం విజయవంతంపై టీడీపీ నాయకులు దృష్టి సారించారు.

భువనేశ్వరి పర్యటన వివరాలు

- 30వతేదీ సాయంత్రం 4.30 గంటలకు ఉమ్మడి జిల్లాలోని పర్చూరు నియోజకవర్గం చిన్ననందిపాడు గ్రామంలో, 5.30కు యద్దనపూడిలో పర్యటిస్తారు.
- సాయంత్రం 6.55కు ఒంగోలు నగరపరిధిలోని ముక్తినూతలపాడును సందర్శిస్తారు. రాత్రి 7.25కు హైవే పక్కన ఉన్న బృందావనం కల్యాణ మండపానికి చేరుకొని రాత్రికి అక్కడ బస చేస్తారు.
- 31వతేదీ ఉదయం 10గంటలకు బృందావనం కల్యాణ మండపం నుంచి బయల్దేరి 11.20 గంటలకు దర్శిలోని ఐదో వార్డు, 12.15కు ముండ్లమూరు మండలంలోని సింగన్నపాలెం, 12.55కు తాళ్లూరు మండలంలోని తూర్పుగంగ వరం గ్రామాల్లో పర్యటిస్తారు. తూర్పుగంగవరంలో మధ్యాహ్న భోజనం చేస్తారు.
- మధ్యాహ్నం 3.35కు టంగుటూరులో, సాయంత్రం 4.20కు కొండపి మండలం కె.ఉప్పలపాడులో పర్యటిస్తారు.
- సాయంత్రం 5.55కు ఉలవపాడు మండలం టెంకాయచెట్లపాలెం, 6.30కు అదే మండలంలోని ఆత్మకూరు గ్రామాల్లో పర్యటించి రాత్రికి కందుకూరు సమీపంలోని ఆలా వారి కల్యాణ మండపంలో బస చేస్తారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

వెలిగొండపై మభ్యపెడుతున్న వైసీపీ

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 29: వెలిగొండ ప్రాజెక్టుపై ప్రజలను వైసీపీ ప్రభుత్వం మభ్యపెడుతున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సోమవారం జరిగిన ఆపార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వెలిగొండ రెండు సొరంగాలు పూర్తిచేసేందుకు 18 ఏళ్లు పట్టిందన్నారు. దీనికి సిగ్గుపడకపోగా ప్రస్తుతం నీళ్లు లేకుండానే ఏదో సాధించామంటూ గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికీ అప్రోచ్ చానళ్లు పూర్తి కాలేదన్నారు. పునరావాసం గురించి పట్టించుకున్న పరిస్థితి లేదన్నారు. పునరావాసం కల్పించకుండా, ప్రజలను గ్రామాల నుంచి ఖాళీ చేయించకుండా నీళ్లివ్వడం సాధ్యమేనా? అని నిలదీశారు. ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాల కోసం వైసీపీ నేతలు ఇలాంటి ప్రచారం సాగిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా వెలిగొండ ప్రాజెక్టుకు అవసరమైన మేర నిధులను బడ్జెట్‌లో కేటాయించి అన్ని పనులు పూర్తి చేశాకే నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సమక్షంలో వైసీపీలో చేరిన అదే పార్టీ కార్యకర్తలు (వృత్తంలో వైసీపీ వార్డుసభ్యుని భర్త)

ఇదేందిది.. ఇదెప్పుడూ చూడలా!

- వైసీపీ కార్యకర్తలకే ఆపార్టీ కండువాలు
- మంత్రి సురేష్ సమక్షంలో తంతు
- టీడీపీకి చెందిన 20 కుటుంబాలు చేరినట్లు ప్రచారం
- ఖండించిన టీడీపీ నేతలు
- అధికార పార్టీలో చర్చ

సింగరాయకొండ, జనవరి 29 : వైసీపీకి చెందిన వారినే అధికార పార్టీ నేతలు ఒంగోలులోని మంత్రి సురేష్ కార్యాలయానికి తీసుకెళ్లి ఆయన చేత సోమవారం పార్టీ కండువాలు కప్పించారు. టీడీపీకి చెందిన వార్డు సభ్యుడు, 20 కుటుంబాలు వైసీపీ తీర్థంపుచ్చుకున్నట్లు ప్రకటించారు. ఆ విషయమై వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టి నవ్వులపాలయ్యారు. మంత్రి సమక్షంలో జరిగిన చేరికల ఫొటోను చూసి అటు టీడీపీ, ఇటు వైసీపీ నేతలు విస్తుపోయారు. వైసీపీకి చెందిన వారికే కండువాలు కప్పి టీడీపీ వారు పార్టీలో చేరారని చెప్పడాన్ని తెలుగుదేశం నేతలు ఖండించారు. సోమవారం రాత్రి స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆపార్టీ నేతలు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని ఊళ్లపాలెం పంచాయతీలో టీడీపీ మద్దతు వార్డు సభ్యులుగా ఆరుగురు గెలిచారని తెలిపారు. వారంతా పార్టీలోనే కొనసాగుతున్నారన్నారు. వైసీపీ మద్దతుతో 11వ వార్డు సభ్యురాలిగా గొల్లపోతు ఈశ్వరమ్మ గెలుపొందారని చెప్పారు. అయితే సోమవారం వైసీపీకి చెందిన ఈశ్వరమ్మ భర్త గొల్లపోతు శ్రీనివాసులు, ఆపార్టీకి చెందిన కొంత మంది కార్యకర్తలకు మంత్రి సురేష్ చేత కండువాలు వేయించి టీడీపీకి చెందిన వారు చేరినట్లు ప్రకటనలు ఇవ్వడం సిగ్గుచేటని మండిపడ్డారు. మండలంలో నెలరోజుల నుంచి వైసీపీను వీడి టీడీపీలోకి జోరుగా వలసలు వస్తున్నందున ఏంచేయాలో పాలుపోక అధికారపార్టీ నేతలు సొంత పార్టీ కార్యకర్తలకే కండువాలు కప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇలాంటి చౌకబారు రాజకీయాన్ని మానుకోవాలని హితవుపలికారు. విలేకరుల సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు కూనపరెడ్డి సుబ్బారావు, మించల బ్రహ్మయ్య, బ్రహ్మేశ్వరరావు, ఊళ్లపాలెం మాజీ సర్పంచ్ బాయిరెడ్డి మురళి, నూతలపాటి కృష్ణచైతన్య, కొక్కిలగడ్డ శ్రీనివాసులు, కావూరి శ్రీను పాల్గొన్నారు.

పేదల పేరుతో 'పెద్ద' కబ్జా

- ప్రభుత్వ భూమిలో ప్రైవేటు వ్యక్తులు పాగా
- ప్లాట్లు వేసి విక్రయాలు
- కన్నెత్తిచూడని అధికారులు

ఒంగోలు (క్రైం), జనవరి 29 : పేదలకు స్థలాల ముసుగులో ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేస్తున్నారు. ఆ ప్రాంతానికి చెందిన అధికార పార్టీ కీలక నేత అండదండలతో యథేచ్ఛగా ప్రైవేటు వ్యక్తులు పాగా వేస్తున్నారు. కర్నూలు రోడ్డుకు సమీపంలో ఉండటం, ఒకవైపు పెద్ద ఇంజనీరింగ్ కళాశాల, మరోవైపు దగ్గర్లోనే ప్రైవేటు వెంచర్లు ఉండటంతో ఆ భూమిపై వారి కన్నుపడింది. బహిరంగంగానే భారీ యంత్రాలతో చదును చేసి ప్లాట్లు వేసి అమ్మేస్తున్నారు. పైకి మాత్రం ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నా కబ్జా చేసి అమ్మేసుకునే ఆనవాయితీ ఉన్న సంతనూతలపాడులో ఇలాంటివి సర్వసాధారణం అంటూ రెవెన్యూ అధికారులు సైతం దాటవేత ధోరణిని అవలంబించడం విస్తుగొలుపుతోంది. వివరాల్లోకి వెళితే.. సంతనూతలపాడు మండలం ఎండ్లూరు డొంక సమీపంలో ఉన్న 393 సర్వే నంబరులో సుమారు ఎకరా వాగు పోరంబోకు భూమి ఉంది. ఆ పక్కనే సర్వే నంబరు 392లో సుమారు 185 మంది పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేసి ఇంతవరకూ వారికి భూమి (పొజిషన్) చూపించ లేదు. అయితే పట్టాలు పొందిన వారు మాత్రం ఇళ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు. అక్కడ మౌలిక వసతులు లేవని వారు అనేకమార్లు మండల కార్యాలయం వద్ద ఆందోళన చేసిన పరిస్థితి ఉంది.

వాగుపోరంబోకులో యథేచ్ఛగా పనులు

తాజాగా సర్వే నంబరు 393లోని వాగు పోరంబోకులో ఎక్స్‌కవేటర్లు పెట్టి కొంతమంది ప్రైవేటు వ్యక్తులు జంగిల్ క్లియరెన్స్‌తో పాటు చదును పనులు చేయిస్తున్నారు. ఇదేమిటని ఎవరైనా వారిని ప్రశ్నిస్తే, ఈ భూమి పేదల నివేశన స్థలాల కోసం చదును చేస్తున్నామని వారు ధైర్యంగా చెప్పడం ఆశ్చర్యం కలిగించే అంశం. ప్రభుత్వ భూమిలో నివేశన స్థలాలు ఇవ్వాలంటే లబ్ధిదారుల జాబితాను రెవెన్యూ అధికారులు గ్రామసభల ద్వారా తయారు చేయాలి. ఆ తరువాత భూమిని చదును చేసి ప్లాట్లు వేసి ఇవ్వాలి. అలాంటిదేమీ లేకుండా అధికార పార్టీ నాయకుల అండదండలతో ప్రైవేటు వ్యక్తులు అక్కడ స్థలం కావాలంటే రూ.2లక్షలకుపైనే ఇవ్వాలని పేదల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇప్పటికే కొందరికి విక్రయించారు. నేరుగా భూమి మీద ప్లాట్లుగా విభజించేందుకు కర్రలు పాతి డబ్బులిచ్చిన వారికి పొజిషన్ చూపిస్తున్నారు. రెండు రోజులుగా భూమిని చదును చేసేందుకు రెండు ఎక్స్‌కవేటర్లు, డోజర్లు ఏర్పాటు చేసి అక్కడ ఉన్న చెట్లను తొలగించి, మట్టితో గుంతలను పూడ్చారు.



వాగుపోరంబోకులో చిల్లచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

చోద్యంచూస్తున్న అధికారులు

వాగు పోరంబోకు భూమిని ప్రైవేటు వ్యక్తులు తమ సొంతభూమి అన్నట్లు ప్లాట్లు వేసి విక్రయిస్తుంటే రెవెన్యూ అధికారులు చోద్యంచూస్తున్నారు. ఆప్రాంత ప్రజలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసే వరకు వారు అటువైపు తొంగిచూడకపోవడం చర్చనీయంశమైంది. అంతేకాదు పేర్నమిట్ట వీఆర్వో ఒకరు తన పరిధిలోకి రాదని ఫిర్యాదు చేసిన వారికి సమాధానం ఇచ్చారు. ఎట్టకేలకు రెండు రోజుల తరువాత తహసీల్దార్ ఆదేశాల మేరకు అదే వీఆర్వో సోమవారం అక్కడకు వెళ్లి చదును చేస్తున్న వారిని హెచ్చరించి పనులను నిలిపివేయించారు. కానీ ఎవరు చదును చేయిస్తున్నారు, వారికి ఎలాంటి అధికారం ఉందనే విషయం ఏ అధికారీ అడగలేని పరిస్థితి. ప్రభుత్వ భూములను కబ్జా చేసే వారిపై కేసులు నమోదు చేయాల్సి ఉన్నా, అలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రెవెన్యూ అధికారులపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మరో జగన్ మార్క్ కుట్ర

టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి అరెస్టుకు రంగం సిద్ధం

వివరాలు లోపలి పేజీల్లో..



ఒంగోలులోని ప్రకాశం భవన్ వద్ద నిరసన తెలుపుతున్న సెర్ప్ ఉద్యోగులు

సెర్ప్ ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన

- ఆందోళనకు ఎన్జీవో సంఘం మద్దతు
- ఏడో రోజుకు చేరిన సమ్మె

ఒంగోలు నగరం, జనవరి 29 : డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ, వైకేపీ ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ ఎదుట అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం నాటికి సెర్ప్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె ఏడో రోజుకు చేరింది. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా సెర్ప్ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. సెర్ప్ ఉద్యోగుల ఆందోళనకు ఏపీ ఎన్జీఓ సంఘం ప్రతినిధులు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవో సంఘం నాయకులు శరత్‌బాబు, ప్రసన్నకుమార్, ఏడుకొండలు, నాయకులు గోపీనాథ్, నారాయణ, రామారావు, ఝాన్సీ, నరసింహారావు, సుబ్బారావు, ఏఐటీయూసీ నాయకుడు సర్దార్ పాల్గొన్నారు.


నిధి ఆప్‌కే నికట్ కార్యక్రమంలో మాట్లాడుతున్న పీఎఫ్ కమిషనర్ సతీష్‌కుమార్

పీఎఫ్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం

- కమిషనర్ సతీష్‌కుమార్

ఒంగోలు(విద్య), జనవరి 29 : జిల్లాలోని ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లు తమ పీఎఫ్ సమస్యలను తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని పీఎఫ్ కమిషనర్ సతీష్‌కుమార్ తెలిపారు. ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పీడీసీసీ బ్యాంకు కేంద్ర కార్యాలయ సమావేశపు హాలులో నిర్వహించిన నిధి ఆప్‌కే నికట్ ప్రథమ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఎస్. శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ కార్మికులకు నిధి ఆప్‌కే నికట్ ఎంతో ప్రయోజనకరమన్నారు. పీఎఫ్ నోడల్ అధికారి సమ్మయ్య మాట్లాడుతూ నిధి ఆప్‌కి నికట్ ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా మొదటి వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్ల పీఎఫ్ సమస్యలను త్వరగా పరిష్కరించుకునే పద్ధతులను వివరించారు. పీడీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్ రాఘవయ్య మాట్లాడుతూ పీఎఫ్ సంస్థ అందిస్తున్న ఆన్‌లైన్ సేవలు ఎంత ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో అపుస్మా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేమాధవరావు, హనుమంతరావు, బ్యాంకు ఉద్యోగులు, వివిధ సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లు, పీఎఫ్ జిల్లా కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.


జనచైతన్య యాత్రలో సమస్యలను తెలుసుకుంటున్న జనసేన నేతలు

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 29 : ఒంగోలు నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని జనసేన పార్టీ నాయకులు ఆరోపించారు. సరైన డ్రైనేజీ వ్యవస్థలేని కారణంగా దోమల ఉత్పత్తి పెరిగి ప్రజానీకం వ్యాధుల బారిన పడుతున్నా నగర పాలక సంస్థ అధికారులు పట్టించుకున్న పరిస్థితి లేకుండా పోయిందని విమర్శించారు. జనచైతన్య యాత్రలో భాగంగా సోమవారం స్థానిక 15వ డివిజన్ పరిధిలోని వెంకయ్య స్వామి గుడి ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను జనసేన పార్టీ నాయకుల దృష్టికి తెచ్చారు. జనసేన పార్టీ నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యలను విస్మరించిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జనసేన డివిజన్ అధ్యక్షులు మద్రిపూడి విజయ్, ఉంగరాల సాయి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహ్మద్ యూనిస్, ముత్యాల కళ్యాణ్, పల్ల ప్రమీల, ఆకుపాటి ఉష, ఉంగరాల వాసు, తన్నీరు ఉష, కోట సుధీర్, నరసింహారావు, ప్రసాద్, అవినాష్, అనిల్‌కుమార్, మాధవి, అనూష తదితరులు ఉన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 29 : రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కూచిపూడి శరత్‌బాబు డిమాండ్ చేశారు. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు ఆరోగ్యపరమైన సమస్యలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు ఎన్‌జీవో సంఘం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలని, 11వ పీఆర్సీ అరియర్స్ చెల్లింపుతోపాటు హెల్త్ కార్డు ద్వారా అన్నిరకాల వ్యాధులకు వైద్యచికిత్సలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాకు అధ్యక్షత వహించిన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ అంకిరెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ అనంతరం ఏమి పనిచేయలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. హెల్త్‌కార్డు ద్వారా కేవలం కన్ను, పన్ను రోగాలు మాత్రమే చూస్తున్నారని, అన్ని రకాల వ్యాధులు చూసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీవో సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, కొత్తపల్లి మంజేష్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కంచర్ల సుబ్బారావు, నాయకులు రామమోహన్, డేవిడ్, ఐ. విజయసారథి, పి. సుబ్బారావు, ఎంవీ కృష్ణయ్య, పీఈవీ సుబ్బారావు ఉన్నారు.


వలేటివారిపాలెంలో మహిళకు ఇంటి పట్టా అందిస్తున్న ఎమ్మెల్యే బాలినేని

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటిస్థలాలు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 29 : అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాలు ఇస్తామని మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒంగోలు మండలం వలేటివారిపాలెంలో సోమవారం లబ్ధిదారులకు ఇంటిపట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇళ్ల పట్టాల పంపిణీలో కొంత సాంకేతిక సమస్య ఉండటంతో ఆలస్యంగా ఇవ్వాల్సి వచ్చిందన్నారు. పేదలు నివాసం ఉండేలా మంచి లేఅవుట్‌లో ఈ పట్టాలను ఇస్తున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న వారందరికి పార్టీలకు అతీతంగా ఈ పట్టాలను అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో వాటర్ ప్లాంట్‌ను బాలినేని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు కోమలేశ్వరి, చుండూరి రవిబాబు, ఎంపీటీసీ ఉషారాణి, సర్పంచ్ రాఘవ, తహసీల్దార్ మురళీ, ఎంపీడీవో అజిత ఉన్నారు.

స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జేసీ శ్రీనివాసులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 29 : స్పందనలో వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ కే శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం డయల్ యువర్ కలెక్టర్ అనంతరం జరిగిన స్పందన కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు రకాల సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే అర్జీలను నిబంధనల ప్రకారం నిర్దీత గడువులోపు పరిష్కరించాలన్నారు. ఈ స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 236 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, వరప్రసాద్, ఝాన్సీ లక్ష్మి, మాధురితో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

- జలకల పథకం ద్వారా బోరు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పొన్నలూరు మండలం రెడ్డిపాలెంకు చెందిన డి. బ్రహ్మయ్య కోరారు. బోరు వేసేందుకు సర్వే కూడా చేశారని, కానీ బోరు వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల వెంటనే బోరు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.
- తన వ్యవసాయ భూమికి ఆన్‌లైన్‌లో 1బీ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కనిగిరి మండలం పునుగోడుకు చెందిన సుబ్బారెడ్డి కోరారు. 272 సర్వేనెంబరులో 1206 ఖాతా నెంబరు ఉందని తెలిపారు. కానీ ఆన్‌లైన్‌లో 1బీ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు పలు రకాల సమస్యలను విన్నవించారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

- స్పందనలో ఎస్పీకి ఫిర్యాదుచేసిన బాధితుడు


అర్జీని పరిశీలించి మాట్లాడుతున్న ఎస్పీ మలికగర్గ్

ఒంగోలు (క్రైం) జనవరి 29: గ్రంథాలయంలో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.1.40 లక్షలు యర్రగొండపాలెం మండలానికి చెందిన బి.బాలచెన్నయ్య తీసుకొని మోసం చేశాడని దోర్నాల మండలానికి చెందిన ఓ బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. సోమవారం ఎస్పీకార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 112 మంది తమ ఫిర్యాదులను అందించారు. వీటిపై స్పందించిన ఎస్పీ మలికగర్గ్ సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, అదనపు ఎస్పీ క్రైమ్స్ ఎస్‌వీ శ్రీధరరావు, ఒంగోలు డీఎస్పీ నారాయణ స్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధులు గోల్‌మాల్‌పై విచారణ చేయాలి

కలెక్టరేట్ వద్ద ఒమ్మెవరం పొదుపు మహిళల నిరసన

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 29 : ఫోర్జరీ సంతకాలతో రూ. 30 లక్షలు స్త్రీ నిధి, సీఐఎఫ్ నిధుల గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని స్వయం సహాయక సంఘాల మహిళలు డిమాండ్ చేశారు. నాగులుప్పలపాడు మండలం ఒమ్మెవరం గ్రామానికి చెందిన పొదుపు మహిళలు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులును కలిసి సమస్యను విన్నవించారు. ఈ నిధుల అక్రమాలను సహకరించిన వైకేపీ ఏపీఎం రవికుమార్, సీసీ కవిత, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. నిధులను స్వాహా చేసి పరారీలో ఉన్న వీవోఏ కోట అనిత, ఆమె కుమారుడు వంశీకృష్ణలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో పొదుపు మహిళలు ఎం.సుచిత్ర, పద్మావతి, వరూధిని, గోవిందమ్మ, అంజలి, సంధ్యారాణి, నరసాలక్ష్మి, వెంకటరమణ, సుజాత, అంజమ్మ, అన్నపూర్ణ, ఎం. శ్రీదేవి, పి రత్నమాల, వెంకాయమ్మ, పిసునీత, ఆదెమ్మ తదితరులు ఉన్నారు.


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఒమ్మెవరం పొదుపు మహిళలు


కొండపిలో సమావేశంలో మాట్లాడుతున్న సత్య

బాబుతోనే యువతకు భవిత

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య

కొండపి, జనవరి 29 : టీడీపీ అధినేత చంద్రబాబును మళ్లీ సీఎంను చేస్తేనే యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య అన్నారు. ఆయన సోమవారం మండలంలోని ముప్పరాజువారిపాలెం, అనకర్లపూడి, నెన్నూరుపాడు, గుర్రప్పడియ, మూగచింతల, చవటపాలెం, పెట్లూరు, కోయవారిపాలెం, తాటాకులపాలెం, చినకండ్లగుంట, పోలిరెడ్డిపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. కొండపి ఎమ్మెల్యేగా స్వామి హ్యాట్రిక్ విజయంతోపాటు, ప్రభుత్వంలో మంచి పదవి కూడా పొందనున్నారన్నారు. స్వామి నాయకత్వంలో కొండపి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రక్షిత నీరు, ముసి. పాలేరులపై చెక్‌డ్యాంల నిర్మాణం లాంటి కార్యక్రమాలను వచ్చే టీడీపీ ప్రభుత్వంలో చేపట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సత్య నాయకులకు సూచించారు. ఆయన వెంట పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమంద నాయుడు, నాయకులు బత్తుల నారాయణస్వామి, చాగంరెడ్డి నరసారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, కొర్రపాటి వసంత రాయుడు, మారెడ్డి సుబ్బారెడ్డి, ఆరెతోటి బాబూరావు, మూలె రామారావు తదితరులు పాల్గొన్నారు.

స్వామిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

రానున్న ఎన్నికల్లో కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని భారీ మెజారిటీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పిలుపునిచ్చారు. సోమవారం కొండపిలో జరిగిన కొండపి, ముక్కోడిపాలెం, దాసరెడ్డిపాలెం గ్రామాల పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండపి ప్రజలు పార్టీకి ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ కొండపి పట్టణ అధ్యక్షుడు బూదవాటి సోమయ్య, నాయకులు నన్నూరి సుబ్బరామయ్య, కందిమళ్ల రమేష్, షేక్ ఖాఈషా, పి.రమేష్, అల్లడి కల్యాణ్, గుది రమణయ్య, ముక్కు ప్రసాద్, నేతి రవికుమార్, జనసేన మండల అధ్యక్షుడు యనమద్ది విశ్వం తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయం

- మంత్రి ఆదిమూలపు సురేష్

మర్రిపూడి, జనవరి 29 : పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. సోమవారం మర్రిపూడిలో జరిగిన మండల స్థాయి వైసీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. కొండపి నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో వైసీపీ జెండాను ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపు మండలంలోని ప్రధాన సమస్యలైన పొదిలి చిన్నచెరువు నుంచి గుల్లసముద్రం, మర్రిపూడి చెరువులకు రూ.32 కోట్లతో పైప్‌లైన్ ద్వారా సాగర్ జలాలు అందించే పథకంతోపాటు పృథులగిరి లక్ష్మీనరసింహ స్వామి ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ.8 కోట్ల నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. మర్రిపూడి నుంచి పొదిలి కొండ మీదుగా ఎస్టీ కాలనీ వరకు రూ.8 కోట్లతో తారురోడ్డు పనులకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. 98 శాతం ఎన్నికల హామీలను నిలబెట్టుకున్న వైసీపీని మరొకసారి ఆదరించాలని కోరారు. అంతకుముందు మంత్రి సురేష్ పృథులగిరి లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, వైసీపీ మండల అధ్యక్షుడు దద్దాలి మల్లికార్జున, మర్రిపూడి, చిమట సొసైటీ అధ్యక్షుడు బీవీ భాస్కర్‌రెడ్డి, మాకినేని వెంకట్రావు, మండల సీనియర్ నాయకులు ఇనుకొల్లు పిచ్చిరెడ్డి, బోదా రమణారెడ్డి, భోగసముద్రం విజయభాస్కర్‌రెడ్డి, బొగ్గుల శ్రీనివాసుల రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పూనూరి సంజీవరెడ్డి, సర్పంచులు కదిరి భాస్కర్, శీలం వెంకటేశ్వర్‌రెడ్డి, మాచేపల్లి హనుమంతరావు పాల్గొన్నారు.


వైసీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్


ప్రదర్శన చేస్తున్న లాయర్లు

భూమి హక్కు యాజమాన్య చట్టాన్ని రద్దు చేయాలి

కొండపిలో న్యాయవాదుల నిరసన ప్రదర్శన

కొండపి, జనవరి 29 : ప్రజల ఆస్తి హక్కుకు భంగం కలిగించే ఆంధ్రప్రదేశ్ భూమి హక్కు యాజమాన్య చట్టం-2022ను వెంటనే రద్దు చేయాలని ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.ఎస్.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం కొండపిలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి మండల కార్యాలయాల వరకు ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా యాక్ట్‌ను వ్యతిరేకిస్తూ నినదించారు. స్థానికులకు చట్టం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, న్యాయవాదులు సంజీవరెడ్డి, గోపిశెట్టి లక్ష్మీనారాయణ, సిహెచ్.సంజీవ, సీనియర్ న్యాయవాదులు నర్సింగోలు శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

రసకందాయంలో వెంకటకృష్ణాపురం రాజకీయం

సర్పంచ్ పదవికి మందలపు రాజీనామా

మర్రిపూడి, జనవరి 29 : మండలంలోని వెంకటకృష్ణాపురం గ్రామ రాజకీయం రసకందాయంలో పడింది. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఇరు పార్టీల వారు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం టీడీపీ మద్దతుదారుడు మందలపు వెంకటేశ్వర్లు సర్పంచ్‌గా ఏకగ్రీవమయ్యారు. సర్పంచ్‌పాటు మూడు వార్డు సభ్యుల పదవులను టీడీపీకి కేటాయించగా, ఉపసర్పంచ్‌తోపాటు మరో నలుగురు వార్డు సభ్యులుగా వైసీపీకి చెందిన వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అప్పట్లో ఇరుపార్టీల నుంచి ఒక్కొక్కరు రెండున్నర సంవత్సరం సర్పంచ్ పదవిని పంచుకునేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. తొలి విడత టీడీపీ మద్దతుదారుడికి సర్పంచ్ పదవి ఇచ్చారు. మలివిడత వైసీపీ మద్దతుదారుడికి కట్టబెట్టాల్సి ఉంది. అయితే ఒప్పందం ప్రకారం వైసీపీ మద్దతుదారు సర్పంచ్ అయిన తర్వాత టీడీపీకి ఉప సర్పంచ్ తోపాటు నాలుగు వార్డు సభ్యుల పదవులు ఇవ్వాలి. ప్రస్తుతం ఉపసర్పంచ్‌గా వైసీపీకి చెందిన గంగవరపు దేవి కొనసాగుతున్నారు. అయితే ముందుగా మాట్లాడుకున్న ప్రకారం ఇద్దరు వైసీపీ సభ్యులు రాజీనామా చేసి టీడీపీ వారికి అవకాశం ఇవ్వాల్సి ఉంది. సర్పంచ్ పదవిని దేవికి ఇచ్చేందుకు వైసీపీలోని ఓవర్గం వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. ఒప్పందం ప్రకారం టీడీపీ సర్పంచ్ మందలపు వెంకటేశ్వర్లు సోమవారం ఇన్‌చార్జి ఎంపీడీవో సాంబశివరావుని కలిసి తన రాజీనామ పత్రాన్ని అందజేశారు. మాట ప్రకారం వైసీపీ నాయకులు ఐదుగురు సభ్యులను టీడీపీకి ఇచ్చేందుకు అంగీకరిస్తారా? లేదా? అన్న చర్చ గ్రామంలో సాగుతోంది.


రాజీనామా పత్రాన్ని ఎంపీడీవోకు అందజేస్తున్న మందలపు వెంకటేశ్వర్లు

10న నవోదయ ప్రవేశపరీక్ష

ఒంగోలు(విద్య), జనవరి 29 :స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరంలో 9,11 తరగతుల్లో ప్రవేశానికి వచ్చేనెల 10న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే రామిరెడ్డి తెలిపారు. ప్రవేశపరీక్షకు సంబంధించి హాల్ టిక్కెట్లు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు ఆసర్వీసు సెంటర్ల ద్వారానే హాల్ టిక్కెట్లు పొందాలన్నారు. జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కార్యాలయంలో దరఖాస్తు చేసిన వారు ప్రిన్సిపాల్ కార్యాలయంలోనే హాల్ టిక్కెట్లు పొందాలన్నారు. ఈనెల 30నుంచి వచ్చేనెల 6 వరకు ప్రిన్సిపాల్ కార్యాలయంలో పనిదినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు దరఖాస్తు రశీదులు సమర్పించి అభ్యర్థులు హాల్ టిక్కెట్లు పొందవచ్చని ఆయన తెలిపారు. వివరాలకు 9481837230, 8638682701 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఉప్పు సాగు భూములకు పట్టాలు పంపిణీ

కొత్తపట్నం(ఒంగోలు నగరం) జనవరి 29: మండలంలోని మోటుమాల గ్రామంలో సోమవారం ఒంగోలు శాసన సభ్యులు బాలినేని శ్రీనివాస రెడ్డి సాగు భూములకు పట్టాలను పంపిణీ చేశారు. ఆయన సతీసమేతంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ఎంతో కాలంగా భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు అందజేస్తున్నామన్నారు. వైసిపి ప్రభుత్వం రైతుల కోసం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ ప్రాంతంలో ఉప్పు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు పంపిణీ చేయాలనే డిమాండ్ ఉందని, అది ఇంత కాలానికి సాకారం అయ్యిందని అన్నారు. ఈ సందర్భంగా బాలినేనికి గ్రామస్థులు పలు సమస్యలను విన్నవించారు. మోటుమాల రోడ్డును బాగు చేయిస్తానని, చెరువును కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి పరుస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్డీవో విశ్వేశ్వరరావు, తహసీల్దార్ రమణరావు, తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఏకే యూనివర్శిటీ డీన్‌కు అవార్డు

ఒంగోలు(విద్య), జనవరి 29 : స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీ సీడీసీ డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి జాతీయ సమైక్యతా అవార్డును అందుకున్నారు. విజయవాడలోని లయన్స్ ఇంటర్నేషనల్, ఎక్సలే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 2024 సంవత్సరానికి జాతీయ సమైక్యతా అవార్డును వెంకటేశ్వరరెడ్డికి ప్రకటించారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, కొండ వెంకటప్పయ్య, ప్రకాశం జిల్లా జాతీయ ఉద్యమత్యాగమూర్తులు వంటి రచనలు చేసినందుకు వెంకటేశ్వరెడ్డిని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మాజీమంత్రి, ఎమ్మెల్సీ డాక్టర్ డొక్కా మాణిక్యవరప్రసాద్ చేతుల మీదుగా వెంకటేశ్వరరెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. ఇప్పటి వరకు 35కు పైగా జాతీయ, అంతర్జాతీయ వ్యాసాలను ప్రచురించడంతో పాటు ఏడు జాతీయ సదస్సులను నిర్వహించారు.


అవార్డును అందుకుంటున్న డీన్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి

రేపు నారా భువనేశ్వరి టంగుటూరు రాక

టంగుటూరు, జనవరి 29 : టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి ఈనెల 31న టంగుటూరు రానున్నారు. చంద్రబాబు అరెస్ట్ సమయంలో తీవ్ర మనోవేదనకు గురై గుండెపోటుతో మృతి చెందిన టంగుటూరు రజక కాలనీకి చెందిన దుగ్గినేని అరుణ్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. వారికి రూ.3లక్షలు ఆర్థిక సాయం అందించనున్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొంటారని పార్టీ టంగుటూరు పట్టణ అధ్యక్షుడు కామని నాగశ్రీను తెలిపారు.

పేస్‌లో అవగాహన సదస్సు

ఒంగోలు(విద్య), జనవరి 29 : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రోడ్ మ్యాప్ ఫర్ డిజిటల్ స్కిల్లింగ్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రీజనల్ లీడ్- అకాడమి అండ్ గవర్నమెంట్ రిలేషన్స్ రిసోర్స్ పర్సన్ బి. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వ్యాపారంలో సాంకేతిక నైపుణ్యాలను ఏలా సంపాదించుకోవాలో వివరించారు. ప్రభుత్వ పథకాలు, నిధులు సమకూర్చుకునే అవకాశాలపై వివరించారు. ప్రభుత్వ పథకాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలి, డిజిటల్ నైపుణ్యాలను ఎలా పెంపొందించుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, ఏవో రమణబాబు తదితరులు ఉన్నారు.

జనసేనలో చేరిన జడా

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 29 : కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు, ఒంగోలు మునిసిల్ మాజీ కౌన్సిలర్ జడా బాలనాగేంద్ర యాదవ్ జనసేన పార్టీ లో చేరారు. జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ పొలిటికల్ ఆఫైర్స్ కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ సమక్షంలో జనసేనలో చేరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్ ఉన్నారు.


బాలనాగేంద్రకు జనసేన కండువా కప్పుతున్న నాదెండ్ల మనోహర్


మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

రైల్లో నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఒంగోలు (క్రైం) జనవరి 29: రైల్లో నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం ఒంగోలు సమీపంలోని సూరారెడ్డి వారి పాలెం వద్ద జరిగింది. సుమారు 35 ఏళ్ళ వయస్సు కలిగిన వ్యక్తి రైలులోనుంచి జారి పడి మృతి చెందాడు. బులుగు,తెలుపు రంగు చారలు గల టీ షర్టు , బ్లూ కలర్‌నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. అతని వద్దఎలాంటి ఆధారాలు దొరకలేదు. ఈమేరకు ఒంగోలు రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీకాంత్‌బాబు తెలిపారు.

ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 29 : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 50వేల ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి చొప్పర సిసింద్రిబాబు ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. నాలుగేళ్ళ నుంచి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా ఇప్పుడు ఎన్నికల సమయం సమీపిస్తుండటతో ప్రభుత్వం హడావుడి చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం టెట్ లేకుండా నేరుగా డీఎస్సీ నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఎస్బీ సీఐగా రాఘవేంద్రరావు

ఒంగోలు (క్రైం) జనవరి 29: ఒంగోలు స్పెషల్ బ్రాంచ్ సీఐగా కేవీ రాఘవేంద్రరావును నియమిస్తూ గుంటూరు రేంజి ఐజీ పాల్‌రాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఎస్పీ మలికగర్గ్ పొదిలిలో పనిచేస్తున్న రాఘవేంద్రరావు స్పెషల్ బ్రాంచ్‌లో రిపోర్టు చేయాలని సోమవారం ఆదేశాలు ఇచ్చారు. స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న దుర్గాప్రసాద్‌కు చీమకుర్తి సీఐగా పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉంది.

ఏఐకేఎంఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

కొండపి, జనవరి 29 : ఉమ్మడి గుంటూరు జిల్లా గురజాలలో వచ్చేనెల 3,4 తేదీలలో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కె.నాంచార్లు కోరారు. కొండపిలో ఆయన సోమవారం మహాసభల వాల్‌పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి వై.వి. కృష్ణారావు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎస్.భారతి పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చెత్త పోయవద్దన్నందుకు దాడి

కొండపి, జనవరి 29 : తన ఇంటి ముందు చెత్తపోయొద్దన్న వ్యక్తిపై మరో వ్యక్తి రాడ్‌తో దాడి చేశాడు. ఈ సంఘటన పెట్లూరు పంచాయతీ పరిధిలోని దాదానాయుడుపాలెంలో సోమవారం చోటుచేసుకుంది. కొండపి ఎస్సై వై.నాగరాజు కథనం మేరకు.. గ్రామానికి చెందిన పాలూరి నరసింహం పొరుగున ఉన్న మాలకొండయ్య ఇంటి ముందు పదేపదే చెత్త పోస్తున్నాడు. సోమవారం కూడా పోయడంతో మాలకొండయ్య ప్రశ్నించగా నరసింహం ఇనుపరాడ్‌తో దాడి చేశాడు. తలపై బలంగా కొట్టడంతో మాలకొండయ్యకు గాయాలయ్యాయి. ఆయన కొండపి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. వైద్యశాల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు నరసింహంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పశు ,పక్షు జాతుల రక్షణకు చట్టాలు

ఒంగోలు(రూరల్)జనవరి 29 : మానవుల రక్షణకు ఎలాంటి చట్టాలు ఉన్నాయో పశువుల రక్షణకు అలాంటి చట్టాలు ఉన్నాయని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె .బేబిరాణి అన్నారు. మండలంలోని కరవది జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పశు సంక్షేమ పక్షోత్సవాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మానవులు ఎలా జీవిస్తున్నారో అలాగా పశువులు, పక్షులు స్వేచ్ఛగా జీవించాలన్నారు. పశువులను ,పక్షులను హింసిస్తే నేరమవుతుందన్న విషయాన్ని విద్యార్థులు తెలుసుకోవాలన్నారు . కుక్కలు వీధులలో ఉన్నప్పటికి వాటిని చంపటం నిషేధమన్నారు. అనంతరం పశువుల రక్షణ పై విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు అధికారిని బహుమతులు అందచేశారు.ఈకార్యక్రమంలో త్రోవగుంట పశువైద్యశాల ఏడీ డాక్టర్ బి. బసవశంకరరావు, ఉలిచి పశువైద్యాధికారి డాక్టర్ ప్రతిమ, పశువైద్య అధికారి కాట్రగడ్డ లక్ష్మయ్య , కరవది సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం, ఎన్‌వీ రవికుమార్ ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరో జగన్ మార్క్ కుట్ర రాజకీయం


ఏలూరి సాంబశివరావు

టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి అరెస్టుకు రంగం సిద్ధం చేస్తున్న వైనం

పర్చూరులో ఎవరూ పోటీకి ముందుకు రాని నేపథ్యంలో కొత్త ఎత్తు

నాలుగేళ్లుగా మూతపడ్డ గోదాములో తనిఖీలు.. డైరీ పేరుతో నాటకం

జీఎస్టీ ఎగవేత, అప్పుడెప్పుడో ఓట్లు కొనుగోలు పేరుతో హడావుడి

దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్న ఏలూరి, టీడీపీ శ్రేణులు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఆర్థిక వనరులను దెబ్బతీయటం, అక్రమ కేసులు నమోదు చేయటం. తద్వారా ప్రత్యర్థులను లొంగదీసుకోవాలన్న కుట్ర రాజకీయం. ఇదీ జగన్ ప్రభుత్వం నాలుగేళ్లుగా సాగిస్తున్న కుతంత్రాల పర్వం. అందులో ఎక్కువ చేదు అనుభవాలు ఎదురైనా వైసీపీ ప్రభుత్వం వెనక్కు తగ్గలేదు. అందుకు తాజాగా టీడీపీ బాపట్ల లోక్‌సభ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అరెస్టుకు పావులు కదుపుతోందని చెప్పుకోవచ్చు. గత ఎన్నికల్లో టీడీపీకి మెరుగైన ఫలితాలు లభించిన జిల్లాల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఒకటి. దీంతో జిల్లాలో ఆ పార్టీని, పార్టీకి అండగా ఉన్న నేతల్ని దెబ్బతీసే కుట్రలకు అధికారం చేపట్టిన వెంటనే జగన్ శ్రీకారం పలికారు. ధీటైన నాయకులను దెబ్బతీసేందుకు వారి ఆర్థికమూలాలపై దాడి పెంచారు. అందులో భాగంగానే పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై కేసు నమోదుచేయటమే గాక అరెస్టు చేసే దిశగా పోలీసుశాఖ అడుగులు వేస్తోంది. నిజానికి ఏలూరిపై మూడున్నరేళ్ల క్రితమే జగన్ దృష్టిసారించారు. పార్టీ ఫిరాయించమని వత్తిడి చేశారు. అతని వ్యాపారాలను దెబ్బతీసే ప్రయత్నం చేశారు. అయితే ఏలూరి దీనికి లొంగలేదు, పార్టీ ఫిరాయించలేదు.

ఓట్ల కుట్రను దీటుగా ఎదుర్కొని

ఒక ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్న ఏలూరి నోవా అగ్రిటెక్ పేరుతో వ్యాపారవేత్తగా మారారు. చిన్నతనం నుంచి ప్రజాసేవ పట్ల ఉన్న మక్కువ, టీడీపీ అభిమానంతో 2012లో ఆ పార్టీలో చేరారు. 2014లో పర్చూరులో గెలుపొందటమే గాక గత ఎన్నికల్లో జగన్ గాలిని ఎదుర్కొని నియోజకవర్గంలో బలమైన దగ్గుబాటి వెంకటేశ్వరరావును ఓడించారు. ఆ తర్వాత ప్రభుత్వ వత్తిడికి లొంగకపోగా క్రమేపీ నియోజకవర్గంలోను, పార్టీ రాష్ట్రస్థాయి వ్యవహారాల్లోను కీలకంగా మారారు. బాపట్ల పార్లమెంటు నియోజకవర్గ పార్టీ బాధ్యతలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. దీంతో అతనిపై ప్రత్యేక దృష్టిసారించిన జగన్ పర్చూరులో ఆయనను ఓడించాలన్న లక్ష్యంతో వివిధ రకాల ప్రయత్నాలు చేశారు. ఒకరికి ఇద్దరు ఇన్‌చార్జిలను మార్చి బలమైన నాయకుడిని పోటీలోకి దించాలని ప్రయత్నించారు. చివరికి చీరాల నుంచి వచ్చిన ఆమంచి ద్వారా అనేక కుతంత్రాలను చేశారు. బోగస్ ఓట్ల పేరుతో టీడీపీ ఓట్ల తొలగింపు, గ్రామ మండల, నియోజకవర్గ స్థాయిలో నాయకులపై వేధింపులు, కేసులు, అరెస్టులను కొనసాగించారు. దేనికీ బెదరకుండా వ్యూహాత్మకంగా ముందుకుసాగిన ఏలూరికి పట్టు పెరిగిందని గుర్తించి ఆ పార్టీ టికెట్‌ను ఆశించే వారే కరువయ్యారు. జగన్ ఎంతో నమ్మిన ఆమంచి కూడా పర్చూరు తనకు అక్కర్లేదని తేల్చేశారు. ఈ నేపథ్యంలో తనదైన కుట్ర రాజకీయాలకు తెరలేపారు.

దాడులు.. కేసుల కోసం అనుమతి

బోగస్ పేరుతో టీడీపీ ఓట్ల తొలగింపునకు వైసీపీ పన్నిన కుట్రకు పర్చూరులో ఏలూరి అనుసరించిన విధానమే బ్రేక్ వేసింది. ప్రత్యేకించి పోలీసు శాఖ చేసిన అక్రమాలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లి వారిపై చర్యలు తీసుకునే విధంగా కూడా చేయగలిగారు. దీంతో పోలీసులను, ఆదాయపన్నుశాఖ అధికారులను రంగంలోకి దింపారు. నాలుగేళ్ల క్రితం గుంటూరులో మూసివేసిన ఏలూరి సంస్థకు సంబంధించిన గోదాముపై దాడిచేశారు. అక్కడ నుంచి ఎలాంటి వ్యాపార లావాదేవీలు లేవని తేలిపోయింది. ప్రభుత్వం కుట్రను ముందే ఊహించిన ఏలూరి తన సంస్థను ప్రైవేటు లిమిటెడ్ కంపెనీగా మార్చివేశారు. అయినా ఆగని ప్రభుత్వం కేంద్రానికి చెల్లించాల్సిన జీఎస్టీ సక్రమంగా చెల్లించలేదన్న నెపంతో ఐటీ అధికారులను రంగంలోకి దింపింది. వారి పరిశీలనలో ఏమీ ఆధారాలు లభ్యం కాకపోవటంతో డైరీ నాటకానికి తెరలేపారు. అందులో గత ఎన్నికల్లో ఏవో కొన్ని గ్రామాల్లో ఓటర్లకు డబ్బులిచ్చినట్లు ఎవరో సమాచారం రాసిపెట్టుకున్నట్లు తద్వారా నిబంధనలు అతిక్రమించారంటూ కేసు నమోదు చేసేందుకు రంగం సిద్ధంచేశారు. ఆ మేరకు బాపట్ల కోర్టులో మేజిస్ట్రేట్ అనుమతి కోరగా సహజంగానే కోర్టు కేసు నమోదుకు అనుమతించింది. ఈ అంశంలో నేరుగా ఏలూరికి ఎలాంటి సంబంధం లేకపోయినా కేసు నమోదు చేసి అటు వ్యాపారాలను దిగ్బంధం చేయటం ఇటు ఆయనను జైలుపాలు చేసి భయపెట్టడం లక్ష్యంగా ప్రభుత్వం పోలీసు, ఆదాయ పన్ను శాఖలను ముందుకు నడుపుతోంది. కోర్టు అనుమతితో సోమవారం రాత్రికే కేసు నమోదు చేసి మంగళ బుధవారాల్లో అరెస్టుకి సిద్ధమవుతున్నట్లు సమాచారం.

అయితే ఇది పూర్తిగా అక్రమ కేసని తెలిసిన ఏలూరి ధైర్యంగా న్యాయబద్ధంగా కేసును ఎదుర్కొనేందుకు సిద్ధపడినట్లు సమాచారం. టీడీపీ అధిష్ఠానం కూడా ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంది. నియోజకవర్గంలో సమాచారం తెలుసుకున్న సామాన్య ప్రజలు కూడా జగన్ తరహా కుట్ర రాజకీయాలపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం నియోజకవర్గంలో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా పర్యటించనున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే అయిన ఏలూరిపై ప్రభుత్వం పన్నిన కుట్ర ఏ రూపు దాలుస్తుందనేది వేచి చూడాలి.


45వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న దామచర్ల జనార్దన్

సైకో జగన్‌ను ఇంటికి పంపితేనే మంచి రోజులు

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 29 : రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రిగా కావాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. జనం కోసం జనార్దన్ కార్యక్రమాన్ని సోమవారం నగరంలోని 45వ డివిజన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేయడంతోపాటు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలపై ఆర్థిక భారం పెరిగిందన్నారు. సామాన్యుడు సంతోషంగా జీవించే పరిస్థితి లేదన్నారు.సైకో జగన్‌ను ఇంటికి పంపితేనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయన్నారు. చంద్రబాబు హయాంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, కార్మికులు, కర్షకులకు పనులు ఉండటం వలన జీవన విధానం సంతోషంగా సాగిందన్నారు. ఇప్పటికైనా ప్రజలు గడిచిన నాలుగున్నరేళ్ళలో జరిగిన అభివృద్ధి ఏమిటో.. నష్టం ఏమిటో గుర్తించాలన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదాయం తక్కువ, ఆర్థిక భారం ఎక్కువ కావడంతో సామాన్యుల పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించాలని, సైకో జగన్‌కు బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాలూరి వెంకటేశ్వర రెడ్డి, అరటిపల్లి చెంచిరెడ్డి, పడిగి రాములు, యాదల రాధా, తోక వీరయ్య, గోళ్ళ వెంకటేశ్వర్లు, పద్మజ, తదితరులు పాల్గొన్నారు,

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు పాతపాడు, కేవీపల్లి విద్యార్థులు

కనిగిరి, జనవరి 29: 67వ జాతీయస్థాయి ఖో-ఖో పోటీలకు మండలంలోని కంచర్లవారిపల్లి, పాతపాడు హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ కాశీవిశ్వనాథరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31నుంచి వచ్చే నెల 4వరకు ఝార్ఖండ్‌లోని రాంచీ లో జరిగే జాతీయస్థాయి అండర్ - 14 స్కూల్ గేమ్స్‌కు ఎంపికైనారు. గత పది రోజులుగా జిల్లా సాధికారిత సంస్థ నందు చిత్తూరులో జరిగిన శిక్షణా శిభిరం నందు పాల్గొని రాంచీలో జరిగే జాతీయస్థాయిలో జరిగే ఆంధ్రప్రదేశ్ ఖో-ఖో బాలురుజట్టులో కేవిపల్లి హైస్కూల్‌కు చెందిన తమ్మినేని మనోజర్‌రెడ్డి, బాలికల జట్టులో రేగలగడ్డ గురవమ్మలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వనజ, కేవిపల్లి, పాతపాడు హైస్కూల్ హెచ్‌ఎంలుపాల్గొన్నారు.

లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

పామూరు, జనవరి 29 : వ్యవసాయ భూములను వ్యవసాయ యేతర పనులకు ఉపయోగించుకునేవారు ప్రభుత్వ అనుమతితో క్రమబద్ధీకరించుకోవాలని ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్ సూచించారు. కందుకూరు రోడ్‌లో కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న పలు వెంచర్లను సోమవారం ఆర్డీవో పరిశీలించారు. అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్లు వేయరాదని, కన్వర్షన్ ఫీ జులు చెల్లించిన అనంతరం లేఅవుట్లు వేయాలని సూచించారు. వెంచర్లలో ప్రభుత్వ అసైన్డ్‌మెంట్, పోరంబోకు భూములను ఆక్రమించుకొని వెంచర్లు వేస్తే అనుమతులు రద్దు చేయడమే కాకుండా కన్వర్షన్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం రావిగుంటపల్లి, ఇనిమెర్ల రైల్వేలైన్ నిర్మాణం కోసం భూ సేకరణలో అవసరమైన భూములను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువ ప్రకారమే రైతులకు నష్ట పరిహారం అందిస్తామని ఆర్డీవో స్పష్టం చేశారు. ఆయనవెంట తహసీల్దార్ అవుల సురేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బీ మల్లికార్జునరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

దొనకొండ, జనవరి 29 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సం ఘటన మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామం వద్ద సోమవారం జరిగింది. అందిన వివరాల మేరకు మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన మురికిపూడి విల్సన్ తన ద్విచక్ర వాహనంపై కురిచేడు మండలంలోని పొట్లపాడు గ్రా మానికి వెళ్తున్నాడు.రామిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో వాహనంకు అకస్మాత్తుగా మేక అడ్డురావటంతో తప్పించే క్రమంలో అదుపుతప్పి కిందద పడ్డాడు. ఈ ప్రమాదంలో విల్సన్ కాలు విరగటం, గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఆదినారాయణ, దూపాటి శ్రీనులు సంఘటన ప్రదేశంకు చేరుకొని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేపట్టి వినుకొండ వైద్యశాలకు తరలించినట్లు సమాచారం.

కరవది మేజర్‌కు నీరు వచ్చేదెప్పుడు?

చిల్లచెట్లతో నిండిపోయిన మేజర్

నీటికోసం ఎదురు చూస్తున్నరైతాంగం

చీమకుర్తి, జనవరి 29 : కరవది మేజర్ కాలువలో నీరు ప్రవహించి ఆరునెలలు పైనే అవుతోంది. కాలువల్లో నీరు పారటానికి వీలులేనంతగా చిల్లచెట్లు వటవృక్షాలుగా పెరిగిపోయి ఉండటం ఈ మేజర్ దుస్థితికి అద్దం పడుతోంది. రామతీర్థం రిజర్వాయర్‌కు ఎగువనుంచి కరవది మేజర్‌కు సాగర్‌జలాలు సరఫరా అవుతుంటాయి.ఈ మేజర్ ఆయకట్టు పరిధిలో మండలంలోని నాయుడుపాలెం, బండ్లమూడి, పల్లామల్లి, నేకునంబాదు, తొర్రగుడిపాడు, చండ్రపాడు తదితర గ్రామాలకు చెందిన పొలాలున్నాయి. వరిసాగుకు నీరుఅందివ్వలేమని ఈ ఏడాది ప్రభుత్వం ప్రకటించటంతో ఆయకట్టు పరిధిలో పొగాకు, మిర్చి, బొప్పాయి, జొన్న, కంది,ఆరుతడి పంటలను రైతులు సాగు చేశారు. వర్షాధార భూములు కావటంతో సాగర్‌జలాలు అవసరం ఎంతో ఉంది. ఈ పరిస్థితుల్లో కూడా ఈ మేజర్ కాలువల్లో నీరు పారి ఆరునెలలుకు పైగా అవుతుండటం గమనార్హం. కనీసం కాలువల్లో విపరీతంగా పెరిగిపోయిన చిల్లచెట్లను కూడా తొలగించిన పాపాన పోలేదు. గత రెండురోజుల వరకూ సాగర్‌జలాలు వచ్చినా జలాశయం నింపి తాగునీటి అవసరాలు తీర్చటానికి ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో కరవది మేజర్‌కు నీటిసరఫరా చేయలేదు.ఫలితంగా ఆయకట్టుకింద సాగుచేసిన పంటలకు నీటి అవసరం తీరక పంటలు గిడసబారి పోతున్నాయి. ముఖ్యంగా పొగాకు సాగుచేసిన రైతాంగం సాగునీటికోసం ఎదురుచూస్తున్నది. ఇక సాగునీరు అందించే అవకాశం లేదనే విషయం రైతాంగాన్ని ఆందోళనలో పడవేస్తున్నది.ఉన్నతాధికారులు స్పందించి కరవది మేజర్‌కు నీటిసరఫరా చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీఎన్ విజయ్‌కుమార్

జగన్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది

సంతనూతలపాడు, జనవరి 29: జగన్‌పార్టీ అక్రమాలకు చెక్‌పడేందుకు ఇక 74రోజులే మిగిలి ఉందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జ్ బీఎన్ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఒంగోలులోని అయన కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ నిరంకుశపాలనకు చరమగీతం పాడేందుకు ఉద్యోగులు, ప్రజలు, రైతులు, యువత సిద్ధమయ్యారన్నారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో వైసీపీ, జగన్‌మోహన్‌రెడ్డి కనుమరుగవుతారని తెలిపారు. వైసీపీ నాసికరకం మద్యం తాగి లక్షలమంది ఆసుపత్రులు పాలవ్వగా వేలమంది చనిపోయారన్నారు. మద్య నిషేధం చేస్తానని చెప్పిన మాటలు నీటిమూటలుగా మిగిలాయన్నారు. ఎమ్మెల్యేలు సైతం వైసీపీ నుంచి పక్కపార్టీలకు వలసలు పోతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దినేని హరిబాబు, తేళ్ల మనోజ్, రమేష్, కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నాయకులను పరిచయం చేసుకున్న మంత్రి మేరుగ

సంతనూతలపాడు, జనవరి 29: సంతనూతలపాడులోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాంఘిక సంక్షేమశాఖా మంత్రి మేరుగ నాగార్జున మండలంలో పలుగ్రామాల నాయకులు, కార్యకర్తలను పరిచయం చేసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ఎంపీపీ బి.విజయ, జడ్పీటీసీ డి.రమణమ్మ, నాయకులు, సచివాలయం కన్వీనర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

టీడీపీలో కొనసాగుతున్న చేరికలు

» తురకపల్లిలో వైసీపీని వీడిన కుటుంబాలు

» విజయానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర విజ్ఞప్తి


వైసీపీని వీడి టీడీపీలో చేరిన సీతారాంపురం వాసులను ఆహ్వానిస్తున్న డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జనవరి 29: టీడీపీలోకి చేరికల పర్వం కొనసాగుతూనే ఉంది. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర క్యాంప్ క్యాంపు నివాసంలో సోమవారం హనుమంతుపాడు మండలంలోని సీ తారాంపురం గ్రామానికి చెందిన 30 కుటుంబాలవారు వైసీపీని వీడారు. వారంతా సానికొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్టీఆర్) ఆధ్వర్యంలో టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఉగ్ర వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కనిగిరిలో తెలుగుదేశం పార్టీ అత్యధిక మెజార్టీతో గెలుపొందేలా కృషి చేయాలని వారికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కనిగిరిలో భారీ మెజార్టీ వచ్చేలా పనిచేయాలని కోరారు. ఇంటింటికీ తిరుగుతూ ఆయా గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి టీడీపీ చేపట్టబోయే చర్యలను, అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా టీడీపీ గెలుపుతోనే కనిగిరి అభివృద్ధి సాధ్యపడుతుందని, వెలుగొండ జలాలు కనిగిరి ప్రాంతంలోని అన్ని మండలాలకు రప్పించేలా అధినేత చంద్రబాబు చర్యలు తీసుకుంటారని ప్రజలకు చెప్పాలన్నారు.

కొత్తగా పార్టీలో చేరిన వారికి సముచి త స్థానం కల్పించడంతో పాటు పాత వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ పాత, కొత్త తేడా లేకుండా కలసి కట్టుగా పార్టీ గెలుపుకు సైనికుల్లా పని చేయాలన్నారు. వైసీపీని వీడి నూనె నారాయణయాదవ్ నేతృత్వం లో పార్టీలో చేరిన వారిలో నల్లబోతుల బాలు, పీవీ లక్ష్మణ్, ఎస్ అబ్దుల్ రహిమాన్, విలియ మ్స్, బీ ప్రవీణ్, కే గురుకృష్ణ, బీ రమేష్, జుటికె విక్కీ, ఎస్‌కే రఫీ, అజయ్‌ప్రవీణ్, సీతారాంపురం గ్రామస్థులు పాల్గొన్నారు.

బీసీలకు నమ్మకద్రోహం చేసిన జగన్


జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాజుయాదవ్

పామూరు, జనవరి 29 : బీసీ సామాజిక వర్గాల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి 27 రకాల పథకాలను రద్దు చేసి బీసీలకు న మ్మకద్రోహం చేశారని టీడీపీ బీసీ కమిటీ రా ష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.గంగరాజుయాదవ్ అన్నా రు. శేషమహల్ ప్రాంగణంలో జయహో బీసీ సదస్సును టీడీపీ బీసీ మండల కమిటీ అధ్యక్షుడు దేగా నాగరాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. టీడీపీ మినీ మేనిఫెస్టోలో చం ద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతోపాటు బీసీలకు రక్షణ చట్టం తీసకొస్తామని గంగరాజు యాదవ్ తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. అబ్జర్వర్ వీరన్న మాట్లాడుతూ టీడీపీ కి బలహీనవర్గాలవారే వెన్నెముక అన్నారు. జ గన్‌రెడ్డి పాలనలో బీసీలను అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించి న ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. చం ద్రబాబు ఆదరణ పథకంతో బీసీలకు ఆర్థిక భ రోసా లభించిందన్నారు.

బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మస్తాన్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీలు అణచివేతకు గురయ్యారన్నా రు. బీసీలందరూ ఐక్యంగా టీడీపీ విజయాని కి మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

సదస్సులో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం హుసేన్‌రావుయాదవ్, ఎంపీటీసీ సభ్యుడు బొ ల్లా నరసింహారావు, జిల్లా కమిటీ సభ్యుడు షే క్ ఖాజారహంతుల్లా, ఆర్‌ఆర్ రఫీ, ఆరేకొండ హరి ప్రసాద్, వై.రమేష్, నల్లబోతుల వెంకటేశ్వర్లు, ఎం.గిద్దయ్య, టీడీపీ ముస్లిం మూనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ గౌస్‌బాషా, చిన హజరత్, కొలూరి రహంతుల్లా, బత్తుల సత్యం, ఎన్.నాగేంద్రచారి, మండ్లా రమణయ్య, తిరుపత య్య, దొర సానాచారి, శేఖర్. పోలేపల్లి హరి పాల్గొన్నారు.


తలపడుతున్న ఎడ్లు

కోలాహలంగా ఒంగోలు జాతి గిత్తల బల ప్రదర్శన

కురిచేడు, జనవరి 29: కురిచేడు మండలం పొట్లపాడు గ్రామంలో గుత్తికొండ రామయోగిస్వామి 113వ తిరునాళ్ల సందర్భంగా రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి గిత్తల బల ప్రదర్శన పోటీలు సోమవారం కోలాహలంగా జరిగాయి. సోమవారం 4 పళ్ల విభాగంలో పోటీలు జరిగాయి. మొత్తం 14 జతలు పోటీలో పా ల్గొన్నాయి. ప్రథమ బహుమతిని చిలకలూరిపేట సమీపంలోని పురుషోత్తపట్నానికి చెందిన షేక్ అబ్దుల్ సత్తార్ ఎడ్ల జత 4331 అడుగులు లాగి గెలుచుకున్నాయి. వారికి రూ.40వేల బహుమతి అందజేశారు. ద్వితీయ బహుమతిని నంద్యాల జిల్లా కొణిదెల గ్రామానికి చెందిన డి.నరసింహారావు ఎడ్ల జత 4200 అడుగులు లాగి గెలుచుకున్నాయి. వారికి రూ.30 వేలు బహుమతిని అందజేశారు. తృతీయ స్థానంలో గుంటూరు జిల్లా తుళ్లూరుకు చెందిన మోదుగుల రామిరెడ్డి ఎడ్లజత 4085 లాగి గెలుచుకున్నాయి. వారికి రూ.25వేలు అందజేశా రు. ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన చూడటానికి ప్రజలు ఎక్కువగా తరలి వచ్చారు. కార్యక్రమంలో ఆలయం ధర్మకర్త నుసుం గోవిందరెడ్డి పాల్గొన్నారు. గ్రామస్థులకు, పోటీలో పాల్గొన్న వారికి చీమకుర్తికి చెందిన గ్రానైట్ వ్యాపారి నుసుం గోవింద రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు.

వైసీపీలో చల్లారని మార్పు మంటలు

దద్దాల పరిచయ కార్యక్రమానికి డుమ్మాకొట్టిన పలువురు నేతలు


శ్రేణులకు నమస్కరిస్తున్న దద్దాల

పీసీపల్లి, జనవరి 29 : కనిగిరి నియోజకవర్గం వైసీపీలో ఇన్‌చార్జి మార్పుతో ఆ పార్టీలో రాజుకున్న అసమ్మతి మంటలు ఇంకా చల్లారలేదు.వైసీపీ అధిష్ఠానం 4వ జాబితాలో నియోజకవర్గ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను తప్పించి హెచ్‌ఎంపాడు జడ్పీటీసీ సభ్యుడు దద్దాల నారాయణ యాదవ్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో మండలంలోని వైసీపీలోని బుర్రా వర్గం దద్దాల నియామకాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ అధిష్ఠానం మరోసారి పునరాలోచన చేసి బుర్రానే ఇన్‌చార్జిగా ప్రకటించాలంటూ మీడియా సమావేశాలు పెట్టి ప్రకటనలు చేశారు. అయితే ఇన్‌చార్జిగా నియమితులైన దద్దాల పరిచయ కార్యక్రమం పేరుతో సోమవారం పీసీపల్లిలో వైసీపీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వైసీపీకి చెందిన పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ముఖ్యనాయకులు డుమ్మాకొట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు పలువురికి ఫోన్‌లు చేసి ఆహ్వానించినా సొంత పనులు ఉన్నాయనే సాకు చెప్పి సమావేశానికి హాజరుకాలేదని తెలిసింది. పెదఅలవలపాడు, మురుగమ్మి, గుదేవారిపాలెం, ఎంపీటీసీ సభ్యులు, పలు పంచాయతీల సర్పంచ్‌లతో పాటు మండల సచివాలయాల కన్వీనర్ సుదర్శన్, వ్యవసాయ సలహా మండలి సభ్యు లు ఏరువ నరసింహం, సీనియర్ నాయకులు పులి వెంకటేశ్వరరెడ్డి, పలు గ్రామాలకు చెందిన మరికొంతమంది నాయకులు సమావేశంలో కనిపించలేదు. మండలపార్టీ కన్వీనర్ బొ ర్రారెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పోలు జయరామిరెడ్డి, ఎంపీపీ జషన్య, సేవాదళ్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు లక్ష్మీకాంతం ఓకేరెడ్డి, యర్రంరెడ్డి మోహన్‌రెడ్డి, మాజీ ఎం పీపీ బత్తుల అంజయ్య, చీమల బ్రహ్మానందరె డ్డి, డబ్బుగొట్టు మహేష్, గుంటగాని భాస్కర్ తదితరులు దద్దాలకు స్వాగతం పలికి పరిచ య కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితో పాటు వెలిగండ్ల జడ్పీటీసీ సభ్యుడు తిరుపతిరెడ్డి, బన్ని, కస్తూరిరెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు ఉ న్నారు. ఈ పరిచయ కార్యక్రమానికి పార్టీ నా యకులు అందరూ హాజరు కాకపోవడంతో బు ర్రాను ఇన్‌చార్జిగా తప్పించడంవల్లే ఆయన అభిమానులు డుమ్మాకొట్టారని అక్కడకు వ చ్చినవారు చర్చించుకుంటున్నారు. ఈ సందర్భంగా దద్దాల మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పనిచేసి వైసీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యతన అందరిపై ఉందన్నారు. అనంతరం నాయకులు ఆయనను సన్మానించారు.

వాలీబాల్ విన్నర్‌గా పులిపాడు సచివాలయం జట్టు

ముండ్లమూరు, జనవరి 29 : దర్శి నియోజక వర్గ స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో మండలంలోని పులిపాడు సచివాలయం జట్టు విన్నర్‌గా నిలిచింది. దీంతో సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద విజేతగా నిలిచిన జట్టును ఎంపీడీవో శంకరరావు, ఈవో ఆర్‌డీ శ్రీదేవి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విజేతలను అభినందించి జ్ఞాపికలను అందజేశారు.

మోసపూరిత మాటలను నమ్మవద్దు

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు

● పలు గ్రామాల్లో బాబు ష్యూరిటీ కార్యక్రమ నిర్వహణ



భవిష్యత్తుకు గ్యారెంటీ పత్రాలు అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, జనవరి 29: ప్రజలు మోసపూరిత మాటలను మరోసారి నమ్మవద్దని రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని రామచంద్రకోట గ్రామంలో 'బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ.. గ్రామంలో కనిపిస్తున్న సిమెంట్ రోడ్లలో 95 శాతం టీడీపీ హయాంలో నిర్మించినవే నన్నారు. గ్రామంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా నాడు టీడీపీ హయాంలో ట్యాంకర్లతో నీరు సరఫరా చేశారన్నారు. ఇవన్నీ కళ్లముందు జరిగిన సత్యాలన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక తట్టెడు మట్టి పోయలేద న్నారు. తాగునీటికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నా రన్నారు. అంతేకాదు పెళ్లికానుక, పండుగ కానుక, చంద్రన్న బీమా, రైతులకు పంట నష్టపరిహారం, రాయితీతో అందించే ట్రాక్టర్లు వంటి సంక్షేమ పథకాలను అమలుజేశారన్నారు. టీడీపీ మళ్లీ అధికారంలోకి రాగానే రద్దు చేసిన పథకాలన్నీ పునరుద్ధరిస్తారన్నారు. అంతేగాక మహిళలకు ఆర్‌టీసీ బస్సుల్లో ఉచిత ప్రమాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు అందజేస్తామన్నారు. ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే వెలిగొండప్రాజెక్టు నిర్మాణంలో వైసీపీ నేతలు రోజుకో అబద్ధం చెబుతున్నా రని ఆరోపించారు. రెండు సొరంగాలు పూర్తయితే నీళ్లిచ్చినట్లు కాదని పెండింగు పనులు పూర్తి చేయాలని, నిర్వాసితులకు పరిహారం అందించాలని అన్నారు. టీడీపీ అధికారం చేపట్టిన కొద్దిరోజులకే నిర్మాణం పూర్తి చేస్తామని, మార్కాపురం జిల్లాగా ప్రకటించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ఏర్వ మల్లికార్జునరెడ్డి, నాయ కులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, షేక్ సమ్మద్‌భాష, దేసు నాగేంద్రబాబు, చంటి, ఎలకపాటి చెంచ య్య, షేక్ ఇస్మాయిల్, బాష, కె శ్రీనివాసు లు, చల్లా వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు బట్టు సుధాకర్‌రెడ్డి, ఆర్ సుబ్బరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను పరిశీలించాలి

పొదిలి : రాష్ట్ర భవితవ్యం మరో రెండు నెలల్లో తేలనుందని, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక విశ్వనాథపురంలోని పార్టీ కార్యాలయంలో పొదిలి, కొనకనమిట్ల మండలాల బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులకు ఏర్పాటు చేసిన ఇంటిగ్రేడెడ్ శిక్షణ కార్యాక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాలుగురోజుల్లో ప్రతి బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులు ఓటర్ల జాబితాను తరువుగా పరిశీలించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తక్షణమే బూత్ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని, ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. అందుకే మరో అస్త్రంగా టీడీపీ ఓటర్లను ఏరివేసేందుకు కంకణం కట్టుకున్నారన్నారు. టీడీపీ ఓటర్లు ఓటు కోల్పోకుండా బూత్ కమిటీలు చూడాలన్నారు. కార్యక్రమంలో పొదిలి, కొనకనమిట్ల మండలాల ఇన్‌చార్జులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





పొదిలి, మార్కాపురంలో మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్ : ఓటర్ల అవకతవకలపై బూత్ ఇన్‌చార్జులు యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జులు పరిశీలించి ఫిర్యాదులు చేయాలని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మార్కాపురంలో మార్కాపురం, తర్లుపాడు క్లస్టర్, బూత్‌యూనిట్ ఇన్‌చార్జుల శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహిం చారు. టీడీపీ ఓటర్లు ఓటు కోల్పోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి వి.మల్లికార్జున్, పోల్ మేనేజ్‌మెంట్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి, షేక్ మౌలాలి పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఉత్తమ హెచ్‌ఎంను ఆదర్శంగా తీసుకోవాలి



హెచ్‌ఎంను సన్మానిస్తున్న కౌన్సిలర్లు

మార్కాపురం వన్ టౌన్, జనవరి 29: ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని 27వ వార్డు కౌన్సిలర్ కశ్శెట్టి నగేష్ అన్నారు. కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డిని సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ విద్యాభివృద్ధి, పాఠశాల అభివృద్ధిలో చంద్రశేఖర్ ఎంతో కృషి చేస్తూ, తన సొంత ధనాన్ని కూడా గుప్తదానాలుగా ఇచ్చారన్నారు. పాఠశాలకు తన వంతు సహాయంగా రూ.50వేల నగదును వచ్చే విద్యా సంవత్సరానికి అందజేస్తానన్నారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు తడికమల్ల బాలసుబ్బారావు, కాంట్రాక్టర్ డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు నాగిరెడ్డిపల్లిలో జయహో బీసీ

కొమరోలు, జనవరి29: మండలంలోని తాటిచర్ల పంచాయతీలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు తెలిపారు. గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి మండలంలోని బీసీ నాయులు, కార్యాకర్తలు, టీడీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గిద్దలూరు, జనవరి 29 : గిద్దలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 30న మంగళవారం ఉదయం 11 గంటలకు తమ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ కడపలక్ష్మీ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హేమలత ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధిపై, కార్య క్రమాలపై సమీక్ష నిర్వహిస్తున్న నేపథ్యంలో సమావేశానికి అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యుడు, కోఆప్షన్ సభ్యులు హాజరుకావాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం



శిక్షణ ఇస్తున్న చంద్రకళ

గిద్దలూరు, జనవరి 29 : పట్టణంలోని పాత విజయవాణి స్కూల్ సమీపంలో సోమవారం ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతినిత్యం శ్వాస మీద ధ్యాస పెట్టి ధ్యానం చేయడం ద్వారా అనేక రుగ్మతల నుంచి బయట పడవచ్చని పిరమిడ్ మాస్టర్ చంద్రకళ పేర్కొన్నారు. ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గంగిశెట్టి కాశీరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో హుండీ లెక్కింపు

త్రిపురాంతకం, జనవరి 29: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలా త్రిపుర సుందరీదేవి అమ్మవార్ల ఆలయాల్లో హుండీలను సోమవారం లెక్కించారు. స్వామివారి హుండీలు రూ.9,47,291, అమ్మవారి హుండీలు రూ.17,59,410 కాగా మొత్తం రూ.27,06,701 వచ్చినట్లు ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయాల ఇన్‌స్పెక్టర్ బి.నాగమల్లేశ్వరరాజు, ఆలయ సిబ్బంది, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాలలో జార్జ్ ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభ



ప్రాంగణ ఎంపికలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 29: స్థానిక డా.శ్యామ్యూల్ జార్జ్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన కాడ్ నెక్స్ నిర్వహించిన డ్రైవ్‌లో 16 మంది ఫైనలీయర్ విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల కార్యదర్శి ఆదిమూలపు విశాల్ పేర్కొన్నారు. సంస్థ ప్రతినిధులు గజేంద్ర, రిషీలు వివిధ దశలలో విద్యార్థులను పరీక్షించి 16 మందిని ఎంపిక చేశారు. వీరికి రూ.4.2లక్షల వేతనం లభిస్తుందని ప్లేస్‌మెంట్ అధికారి ప్రొఫెసర్ కుమార్ తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ డా.రాజాబాబు, డీన్ మస్తానయ్య, వివిధ విభాగాధిపతులు అభినందించారు.

కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం




శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

పొదిలి, జనవరి 29 : మాగుంట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. పట్టణంలోని రథంరోడ్డులో ప్రైవేటు కార్యాలయంలో ట్రస్ట్ ప్రతినిధిగా కల్లం వెంకట సుబ్బారెడ్డి ప్రారంభించారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం కుట్టు మిషన్ ఉచితంగా ఇస్తారన్నారు. ఈ శిక్షణకు ఎవరైనా రావచ్చని వయసు నిమిత్తం లేదన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, జీ శ్రీనివాసులు, శిక్షణకు వచ్చిన మహిళలు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాన్ని నమ్మవద్దు

● అటవీ ప్రాంతంలో పులి సంచారం లేదు



పులి అడుగుజాడల కోసం గాలిస్తున్న అధికారులు

కంభం, జనవరి 29 : నల్లమల అటవీ ప్రాంతం సమీపంలోని లక్ష్మీపురం, రంగాపురం, మాగుటూరు గ్రామాల పరిధిలో ఎటు వంటి పెద్దపులి సంచారం లేదని మార్కాపురం డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ప్రసాద్‌రెడ్డి పేర్కొ న్నారు. అసత్య ప్రచారాన్ని ఆయా ప్రాంతాల ప్రజలు, రైతులు నమ్మవద్దన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా యూట్యూబ్ ఛానల్స్ మాగుటూరు, లక్ష్మీపురం గ్రామ పరిసరాల్లో పెద్దపులి సంచరిస్తోందని, కొన్ని రోజుల క్రితం ఆవుపై దాడి చేసిందని, పరిసర ప్రాంతాల రైతులు భయాందోళన చెందుతున్నారన్నారు. ఈ అసత్య ప్రచారాలు సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయన్నారు. పెద్దపులి గత ఏడాది జనవరి 19, 25, 27 తేదీలలో, డిసెంబరు 23న బొమ్మిలింగం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి, గోడెంగురుస్వామి, నాలి నాగేశ్వరరావు, కర్నాటి వెంకటేశ్వర్ రెడ్డిలకు చెందిన ఆవులపై పెద్దపులి దాడిచేసినట్లు తెలిపారు. ఈ జనవరి పెద్దపులి ఎక్కడా సంచరించలేదన్నారు. ఆదివారం తమ సిబ్బందితో అడవిలో గాలించామన్నారు. అలాగే కెమెరాలను కూడా పరిశీలించామన్నారు. ఎక్కడా పులి సంచారం లేదన్నారు.

వెలిగొండ నిర్మాణంలో జాప్యం చేయొద్దు

● జనసేన ఇన్‌చార్జ్ కాశీనాథ్



పాదయాత్ర చేస్తున్న జనసేన ఇన్‌చార్జ్ కాశీనాథ్

మార్కాపురం రూరల్ జనవరి 29: పశ్చిమ ప్రకాశం వరప్రదాయని వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం విషయంలో ప్రభుత్వం జాప్యం చేయడం తగదని, జనసేన మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మిడి కాశీనాథ్ అన్నారు. మండలంలోని పెద్దయాచవరం గ్రామం నుంచి రెండోరోజు పాదయాత్ర ప్రారంభమైంది. మన్నెంవారిపల్లి, నాయుడుపల్లి, రాయవరం గ్రామాల మీదుగా సోమవారం రాత్రికి తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు గ్రామానికి యాత్ర చేరుకొంది. ఆయా గ్రామాలలో తిరిగి వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. జనసేన, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పవన్ కళ్యాణ్, చంద్రబాబులు కలిసి వెలుగొండను పూర్తి చేసి నీటిని విడుదల చేస్తారన్నారు. మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేసి మార్కాపురం ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాకర్ల శ్రీనివాసులు, జనసేన నాయకుడు బొందిలి కాశీరాం సింగ్, సిరిగిరి శ్రీను, పిన్నేబోయిన శ్రీను, శాసనాల రంగనాథ్, పెద్ద యాచవరం, నాయుడుపల్లి, రాయవరం గ్రామాల టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కత్తితో యువకుడి దాడి

గిద్దలూరు టౌన్, జనవరి 29 : క్రికెట్ ఆడే విషయంలో వివాదం చెలరేగి వ్యక్తిపై కత్తితో దాడి చేసుకున్న ఘటన మండలంలోని కెఎస్‌పల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. క్రికెట్ ఆడుతున్న సమయంలో స్నేహితుల మధ్య వివాదం తలెత్తింది. అది ఇంట్లో వారికి తెలిసి వెంకటేష్ అనే యువకుడిపై స్నేహితుడి తండ్రి రాజు కత్తితో దాడి చేశాడు. గాయపడ్డ వెంకటేష్‌ను స్థానికంగా చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు. ఎస్సై మహేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన క్రీడా సంబరాలు



ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు, జనవరి 29 : గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శ బీఈడీ కళాశాల ఆవరణలో నియోజక వర్గస్థాయిలో ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మున్సిపల్ కమి షనర్ రామకృష్ణయ్య బహుమతులు అందజేశారు గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోటీల ఇన్‌చార్జులు శోభన్‌బాబు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న సుధీర్‌కుమార్‌రెడ్డి

రాచర్ల, జనవరి 29 : స్వాతంత్ర సమరయోధుల గురించి విద్యార్థుల తోపాటు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని స్పందన పాఠశాల డైరెక్టర్ పేర్ల సుధీర్‌కుమార్‌రెడ్డి అన్నా రు. ఫిబ్రవరి 22న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా స్పందన పాఠశాలలో సోమవారం కరపత్రాలను విడుదల చేశారు. యుద్ధంలో వీరమరణం పొందిన ఆర్మీ జవాన్లకు సంబంధించి, కవులకు, సామాజిక కార్యకర్తలకు వ్యాసరచన పోటీలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాచర్ల జడ్పీహైస్కూల్ హెచ్‌ఎం రామ్‌నాయక్, కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపాల్ మాలకొండమ్మ, ఎంఆర్ సేవాసంస్థ వ్యవస్థాపకులు మణికంఠ, ప్రచార కమిటీ సభ్యులు బి.ఎస్.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వెలిగొండపై అసత్యప్రచారం ఆపాలి

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు



మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జనవరి 29 : వెలిగొండప్రాజెక్టు పూర్తి అయిందని సోషల్‌మీడియాలో అసత్య ప్రచారం చేసే వైసీపీ నాయకులు, వెలిగొండప్రాజెక్టు వద్దకు వచ్చి బహిరంగ చర్చలో నిరూపిస్తారా టీడీపీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు సవాల్ విసిరారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో పలు గ్రామాల్లో ఆదివారం జరిగిన రామయోగిస్వామి తిరునాళ్ల ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన టీడీపీ పార్టీ విద్యుత్తు ప్రభలపై నుంచి ఎరిక్షన్‌బాబు మాట్లాడారు. నాలుగున్నరేళ్ల వెలిగొండప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేసి రెండు నెలల్లో ఎన్నికలు జరుగనున్నాయని వెలిగొండ ప్రాజెక్టు పూర్తి అయిందని, ప్రారంభిస్తామని వైసీపీ నాయకులు సోషల్ మీడియా ప్రచారం చేసుకొంటోందన్నారు.

అన్నారు. ప్రాజెక్టు వద్దకు వచ్చి బహిరంగ చర్చకు వచ్చి నిరూపించాలని వైసీపీ నాయకులకు సవాల్ విసిరారు. ఈ నియోజకవర్గంలో నాలుగున్నర సంవత్సరాలు ఏమిఅభివృద్ధి పనులుచేయకుండా ఎన్నికలు సమయంలో ఓట్ల కోసం అబద్ధపు ప్రచారం చేసి మరోకసారి నియోజకవర్గ ప్రజలను మోసం చేసేందుకు వైసీపీ నాయకులు ఊర్లలో తిరిగి ఓట్లు అడుగుతున్నారని అన్నారు. ఆ మాటలకు ప్రజలు మోసపోవద్దన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలనే తలంపుతో టీడీపీలోకి వచ్చి పనిచేసేనాయకులకు, కార్యకర్తలకు ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ద్వితీయా శ్రేణి నాయకులు, ఆయా మండలాల,గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని నరసాయపాలెం, అయ్యంబొట్లపల్లి, సోమేపల్లి, యెండారివారిపాలెం, చెన్నంపల్లి గ్రామాల్లో జరిగిన తిరుణాల ఉత్సవాల్లో టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పాల్గొని మాట్లాడారు.

జగన్‌ను గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డి

● వైసీపీని వీడి పలు కుటుంబాల చేరిక



పార్టీ కండువాకప్పి ఆహ్వానిస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

కంభం, జనవరి 29 : రానున్న ఎన్నికల్లో జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి కంభం మండలం చిన్నకంభం గ్రామంలో అశోక్‌రెడ్డి సమక్షంలో గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు బండారు నెమలిగుండం, మాజీ వైస్ ఎంపీపీ ఆవుల పుల్లయ్య, జలపాటి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ జలపాటి లీలావతి, జలపాటి లోకేష్, మాజీ వార్డు సభ్యుడు దేమా బాలమ్మ ఆధ్వర్యంలో నలుగురు వార్డు సభ్యులతో సహా 120 కుటుంబాలు టీడీ పీలో చేరాయి. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి వారికి టీడీపీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో గిద్దలూరు నియోజక వర్గంలో టీడీపీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమం లో వైసీపీని వీడి టీడీపీలో చేరిన వార్డు సభ్యులు పందనబోయిన పద్మ, దొడ్డా లక్ష్మమ్మ, శెట్టం ప్రసాద్, గొంగటి నాగమణి, ఎంపీటీసీ మాజీ సభ్యులు, మాజీ వార్డుమెంబర్లు, చిన్నకంభం టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో కాపు కులస్థులు ఎక్కువగా ఉండడం గమనార్హం.

డిమాండ్ల సాధన కోసం మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



గిద్దలూరులో వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

గిద్దలూరు, జనవరి 29 : డిమాండ్ల సాధన కోసం మధ్యాహ్న భోజన పథకం కార్మికులు స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆ కార్మిక సంఘం ప్రతినిధి లక్ష్మీదేవి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు పాదయాత్ర సందర్భంగా మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న వర్కర్లకు, హెల్పర్లకు కనీస వేతనం 10వేలు ఇస్తానని హామీ ఇచ్చి ఇంతవరకు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలన్నారు. ప్రతి విద్యార్థికి కనీసం రూ.20 మెనూ చార్జీ ఇవ్వాలని కోరారు. ప్రతి కార్మికురాలికి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వమే వంటగ్యాస్ సరఫరా చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఈ పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించ వద్దని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈవో వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం ప్రతినిధులు కుమారి, నరసమ్మ, ఆదిలక్ష్మమ్మ పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల, జనవరి 29: ఎన్నో ఏళ్లగా పౌరసరఫరాల సరుకులు ఆయా షాపులకు దింపుతున్నామని ఇప్పుడు కూలీ ధరలు తగ్గించి ఇస్తామంటూ తమ కడుపు కొడుతున్నారని, న్యాయం చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం తహసీల్దారు కార్యాల యంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా కూలీలు మాట్లాడుతూ మండలంలో 50 మంది ముఠా కూలీలు గత కొన్నేండ్లుగా రేషన్‌షాపులకు వచ్చే బియ్యం బస్తాలను ఆ యా షాపులకు దించితే బస్తాకు రూ.6లు ఇచ్చేవారు. 3 నెలలుగా రూ.4లే ఇస్తున్నారని, ఇష్టం లేకపోతే మానుకోవాలని చెబుతున్నారు. తమకు న్యాయం చేయాలని తహసీల్దారు వేణు గోపాలరావుకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు పీ తిరుమలయ్య, నటరాజ్ ముఠా కార్మిక సంఘం అధ్యక్షుడు మస్తాన్, ఆరవీటి రాములు, పీ పాపయ్య, కాశిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అన్నాపై బురదజల్లడం ఆపాలి !

జడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు



మాట్లాడుతున్న వెంకట్‌నాయుడు

కొమరోలు, జనవరి 29: ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు నాన్‌లోకల్ అని బురదచల్లడం మానుకోవాలని కొమరోలు జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు సూచించారు. ఎంపీపీ కామూరి అమూల్య ఆదివారం బేస్తవారిపేటలో ఎమ్మెల్యే అన్నా రాంబాబుపై స్థానికేతరుడని వ్యాఖ్యలు చేయడాన్ని తప్పుబట్టారు. కొమరోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గిద్దలూరు ఎమ్మెల్యేగా మూడు సార్లు పోటీచేసి రెండు సార్లు ఆయన గెలుపొందారన్నారు. ఆయన స్థానికులు కారా..? అని ప్రశ్నించారు. మండల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే తెచ్చిన రూ.85లక్షల నిధులకు మండల పరిషత్ తీర్మానం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అన్నా రాంబాబు కంభం మండలం సైదాపురం గ్రామానికి చెందిన వ్యక్తి అని ఎంపీపీ అమూల్య తెలుసుకోవాలన్నారు. మండలంలోని బాదినేనిపల్లి గ్రామానికి చెందిన వారు నాన్-లోకల్ అయితే, కంభం మండలంలోని సైదాపురం గ్రామానికి చెందిన వారు కూడా నాన్-లోకల్ అవుతారని గుర్తుంచుకోవాలన్నారు. పేద, మధ్యతరగతి, ధనిక అనే తారతమ్యం లేకుండా ఎమ్మెల్యే నిత్యం ప్రజల్లో ఉంటున్నారన్నారు. గత ఎన్నికల సమయంలో మీకు నాన్‌లోకల్ గుర్తుకురాలేదా...? మీరు ఓట్లు వేయించలేదా...? అని ప్రశ్నించారు. మండల పరిషత్ పరిధిలోని 12మంది ఎంపీటీసీలకు ఆయా గ్రామాల అభివృద్ధికి ఒకొక్క ఎంపీటీసీ సభ్యుడికి రూ.5లక్షల నిధులు ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వకుండా నిధులను దుర్వినియోగం చేస్తున్నారన్నారు. వైసీపీ టికెట్ కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేసుకోవచ్చన్నారు. అయితే మంచివ్యక్తిని విమర్శించడం సరైనపద్ధతికాదన్నారు. ఇకపై రాంబాబును విమర్శిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి వైసీపీ తరఫున గిద్దలూరు టికెట్ ఎవ్వరికి ఇచ్చినా తాము పార్టీ కోసం కలసికట్టుగా కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు నాదెళ్ల వెంగయ్య చౌదరి, బోయిళ్ల జనార్దన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, బాదం వేణుగోపాల్, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బేస్తవారపేట, జనవరి 29 : గిద్దలూరు వైసీపీ టిక్కెట్ అన్నా వెంకట రాంబాబుకే కేటాయించాలని బేస్తవారపేట వైసీపీ నాయకులు సోమవారం సాయంత్రం రాణిపేట ప్రధాన రహదారి నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అన్నా రాంబాబు కంభం మండలం, సైదాపురం గ్రామానికి చెందిన వారన్నారు. గిద్దలూరు నియోజకవర్గానికి స్థానికుడే అని ర్యాలీలో నినాదాలు చేశారు. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు అందరితో కలసి మెలసి అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో బేస్తవారపేట సర్పంచ్ అశ్రీత జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బి.ప్రేమానంద్, జడ్‌పీటీసీ సభ్యులు బండ్లమూడి వెంకటరాజయ్య, వైస్ ఎంపీపీ దూదెకుల ఖాజీమియా, కొండారఘునాథ్‌రెడ్డి, పి.ఈశ్వరరెడ్డి, మట్టా రమేష్, మాజీ ఎంపీపీ పల్లెబోయిన వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

మరో జగన్ మార్క్ కుట్ర రాజకీయం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఆర్థిక వనరులను దెబ్బతీయటం, అక్రమ కేసులు నమోదు చేయటం. తద్వారా ప్రత్యర్థులను లొంగదీసుకోవాలన్న కుట్ర రాజకీయం. ఇదీ జగన్ ప్రభుత్వం నాలుగేళ్లుగా సాగిస్తున్న కుతంత్రాల పర్వం. అందులో ఎక్కువ చేదు అనుభవాలు ఎదురైనా వైసీపీ ప్రభుత్వం వెనక్కు తగ్గలేదు. అందుకు తాజాగా టీడీపీ బాపట్ల లోక్‌సభ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అరెస్టుకు పావులు కదుపుతోందని చెప్పుకోవచ్చు. గత ఎన్నికల్లో టీడీపీకి మెరుగైన ఫలితాలు లభించిన జిల్లాల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఒకటి. దీంతో జిల్లాలో ఆ పార్టీని, పార్టీకి అండగా ఉన్న నేతల్ని దెబ్బతీసే కుట్రలకు అధికారం చేపట్టిన వెంటనే జగన్ శ్రీకారం పలికారు. దీటైన నాయకులను దెబ్బతీసేందుకు వారి ఆర్థిక మూలాలపై దాడి పెంచారు. అందులో భాగంగానే పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై కేసు నమోదు చేయడమే గాక అరెస్టు చేసే దిశగా పోలీసుశాఖ అడుగులు వేస్తోంది. నిజానికి ఏలూరిపై మూడున్నరేళ్ల క్రితమే జగన్ దృష్టిసారించారు. పార్టీ ఫిరాయించమని ఒత్తిడి చేశారు. అతని వ్యాపారాలను దెబ్బతీసే ప్రయత్నం చేశారు. అయితే ఏలూరి దీనికి లొంగలేదు, పార్టీ ఫిరాయించలేదు.

దాడులు.. కేసుల కోసం అనుమతి

బోగస్ పేరుతో టీడీపీ ఓట్ల తొలగింపునకు వైసీపీ పన్నిన కుట్రకు పర్చూరులో ఏలూరి అనుసరించిన విధానమే బ్రేక్ వేసింది. ప్రత్యేకించి పోలీసు శాఖ చేసిన అక్రమాలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లి వారిపై చర్యలు తీసుకునే విధంగా కూడా చేయగలిగారు. దీంతో పోలీసులను, ఆదాయపన్నుశాఖ అధికారు లను రంగంలోకి దింపారు. నాలుగేళ్ల క్రితం గుంటూరులో మూసివేసిన ఏలూరి సంస్థకు సంబంధించిన గోదాముపై దాడిచేశారు. అక్కడ నుంచి ఎలాంటి వ్యాపార లావాదేవీలు లేవని తేలిపోయింది. ప్రభుత్వ కుట్రను ముందే ఊహించిన ఏలూరి తన సంస్థను ప్రైవేటు లిమిటెడ్ కంపెనీగా మార్చివేశారు. అయినా ఆగని ప్రభుత్వం కేంద్రానికి చెల్లించాల్సిన జీఎస్టీ సక్రమంగా చెల్లించలేదన్న నెపంతో ఐటీ అధికారులను రంగంలోకి దింపింది. వారి పరిశీలనలో ఏమీ ఆధారాలు లభ్యం కాకపోవటంతో డైరీ నాటకానికి తెరలేపారు. అందులో గత ఎన్నికల్లో ఏవో కొన్ని గ్రామాల్లో ఓటర్లకు డబ్బులిచ్చినట్లు ఎవరో సమాచారం రాసిపెట్టుకున్నట్లు తద్వారా నిబంధనలు అతిక్రమించారంటూ కేసు నమోదు చేసేందుకు రంగం సిద్ధంచేశారు. ఆ మేరకు బాపట్ల కోర్టులో మేజిస్ట్రేట్ అనుమతి కోరగా సహజంగానే కోర్టు కేసు నమోదుకు అనుమతించింది. ఈ అంశంలో నేరుగా ఏలూరికి ఎలాంటి సంబంధం లేకపోయినా కేసు నమోదు చేసి అటు వ్యాపారాలను దిగ్బంధం చేయటం ఇటు ఆయనను జైలుపాలు చేసి భయపెట్టడం లక్ష్యంగా ప్రభుత్వం పోలీసు, ఆదాయపన్ను శాఖలను ముందుకు నడుపుతోంది. కోర్టు అనుమతితో సోమవారం రాత్రికే కేసు నమోదు చేసి మంగళ బుధవారాల్లో అరెస్టుకి సిద్ధమవుతున్నట్లు సమాచారం. అయితే ఇది పూర్తిగా అక్రమ కేసని తెలిసిన ఏలూరి ధైర్యంగా న్యాయబద్ధంగా కేసును ఎదుర్కొనేందుకు సిద్ధపడినట్లు సమాచారం.

నగర పంచాయతీకి మూడేళ్లు..!

- ఒక్క పోస్టు మంజూరైతే ఒట్టు
- డిప్యుటేషన్ సిబ్బందితో విధులు
- పనులు ముందుకు సాగని వైనం
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు



దర్శి, జనవరి 29 : దర్శి నగర పంచాయతీ ఏర్పాటై మూడేళ్లు పూర్తయింది. ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క పోస్టు మంజూరు చేస్తే ఒట్టు. డిప్యుటేషన్‌పై అరకొరగా నియమించిన అధికారులు, సిబ్బంది గత మూడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. పూర్తి స్థాయి సిబ్బంది నియామకం జరగకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయినందున ప్రయోజనం ఏమిటని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పన్నుల పోటు తప్ప ఒరిగిందే మీమిలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మేజర్ పంచాయతీగా ఉన్న దర్శి 2020 జనవరిలో నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయింది. రెండేళ్ల క్రితం నగర పంచాయతీకి ఎన్నికలు జరిగి పాలకవర్గం ఏర్పడింది. అయినప్పటికీ ఇప్పటి వరకు సిబ్బంది నియామకం జరగలేదు. నగర పంచాయతీ కమిషనర్‌తో పాటు అన్ని పోస్టులు డిప్యుటేషన్‌పైనే కొనసాగుతున్నాయి. కొందరు అధికారులు డిప్యుటేషన్‌పై వారంలో కొన్నిరోజులు ఇక్కడ, కొన్నిరోజులు అక్కడ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఇక్కడ జరగాల్సిన పనులు కుంటు పడుతున్నాయి. దర్శి నగర పంచాయతీకి కమిషనర్, డీఈ, రెండు ఏఈ పోస్టులు, సీనియర్ అసిస్టెంట్ పోస్టు, డేటా ప్రాసెసింగ్ అధికారి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, డీపీవో, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ముగ్గురు, జూనియర్ అకౌంట్ ఆఫీసర్, జూనియర్ అకౌంటెంట్, సీనియర్ అకౌంటెంట్, మేనేజర్, రెవెన్యూ ఆఫీసర్, పోస్టులు మంజూరు కావాల్సి ఉంది. ఈ పోస్టులు ఇప్పటి వరకు మంజూరు కాలేదు. వినుకొండ మున్సిపాలిటీలో పనిచేస్తున్న వై మహేశ్వరరావు డిప్యుటేషన్‌పై ఇక్కడ కమిషనర్‌గా అదేవిధంగా మిగిలిన సిబ్బంది డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. వైసీపీ అసమర్థ పాలన వలన ఇప్పటి వరకు పోస్టులు మంజూరు కా లేదని ప్రజలు బాహటకంగా విమర్శిస్తున్నారు. నగర పంచాయతీ ఏర్పాటైతే అధిక నిధులు మంజూరవుతాయని, అభివృద్ధి జరుగుతుందని ఆశించిన ప్రజలకు నిరాశ మిగిలింది.

పన్నులు పెరిగాయి

దర్శి నగర పంచాయతీ ఏర్పాటైన తర్వాత 15 శాతం ఆస్తి పన్ను పెరిగింది. గతంలో ఏడాదికి ఒకసారి పన్ను కడితే సరిపోయేది. ఇప్పుడు ఆరు నెలలకోసారి పన్నులు చెల్లించాల్సి ఉంది. ఆలస్యం జరిగితే రూ.2 వడ్డీతో కలిపి వసూలు చేస్తున్నారు. ఇంటి, ఇతర భవన నిర్మాణాలకు రేట్లు పెరిగాయి. దీంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయి. ఈ లోపు అయినా పోస్టులు మంజూరై రెగ్యులర్ సిబ్బందిని నియమిస్తారో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటైన నూతన నగర పంచాయతీలకు ఎక్కడా పోస్టులు మంజూరు కాలేదని అందువలన ఇక్కడ నియామకం జరగలేదని అధికారులు చెప్తున్నారు. ఇప్పట్లో పోస్టుల నియామకం జరిగే అవకాశం కనిపించకడం లేదు. పాలకుల తీరుపట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఇనిమెర్ల వద్ద జరుగుతున్న పనులు

శరవేగంగా హైవే రోడ్డు నిర్మాణం

పామూరు, జనవరి 29 : సింగరాయకొండ నుంచి పామూరు, సీఎస్‌పురం, మండలాల మీదుగా మైదుకూరు జాతీయ రహదారులను కలిపే 167/బీ హై వే పనులు శరవేగంగా సాగుతున్నాయి. పామూరు మండలం మాలకొండ నుంచి సీఎస్‌పురం వరకు 43 కిలోమీటర్లు మేర మోడరన్ కన్‌స్ట్రక్షన్, పీఎస్ఎన్ రెడ్డి అండ్ కంపెనీ ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. హైవే అథారిటీ నిబంధనల మేరకు మాలకొండ, బోడవాడ, బొట్లగూడూరు, మోపాడు, లక్ష్మీనరసాపురం, ఇనిమెర్ల, నుచ్చుపొద గ్రామాల వద్ద రోడ్డు వెడల్పు, కొత్తపల్లి, దూబగుంట, గ్రామాల వద్ద తారురోడ్డు పనులు జరుగుతున్నట్లు కాంట్రాక్టర్లు తెలిపారు. 12 మీటర్ల రోడ్డు వెడల్పు కోసం హైవే అధికారులు చేసిన సర్వే ప్రకారం ప్రస్తుతం ఉన్న రోడ్డుకు ఇరువైపులా వెడల్పు, మెటలింగ్ పనులతో పాటు ఒక లేయర్ తారు రోడ్డు పనులు మొదలైనట్లు తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి పనులు పూర్తవుతాయని తెలిపారు.



లేఅవుట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో జాన్‌ఇర్విన్

లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

పామూరు, జనవరి 29 : వ్యవసాయ భూములను వ్యవసాయ యేతర పనులకు ఉపయోగించుకునేవారు ప్రభుత్వ అనుమతితో క్రమబద్ధీకరించుకోవాలని ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్ సూచించారు. కందుకూరు రోడ్‌లో కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న పలు వెంచర్లను సోమవారం ఆర్డీవో పరిశీలించారు. అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్లు వేయరాదని, కన్వర్షన్ ఫీజులు చెల్లించిన అనంతరం లేఅవుట్లు వేయాలని సూచించారు. వెంచర్లలో ప్రభుత్వ అసైన్డ్‌మెంట్, పోరంబోకు భూములను ఆక్రమించుకొని వెంచర్లు వేస్తే అనుమతులు రద్దు చేయడమే కాకుండా కన్వర్షన్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం రావిగుంటపల్లి, ఇనిమెర్ల రైల్వేలైన్ నిర్మాణం కోసం భూసేకరణలో అవసరమైన భూములను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువ ప్రకారమే రైతులకు నష్ట పరిహారం అందిస్తామని ఆర్డీవో స్పష్టం చేశారు. ఆయనవెంట తహసీల్దార్ ఆవుల సురేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బీ మల్లికార్జునరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

దొనకొండ, జనవరి 29 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామం వద్ద సోమవారం జరిగింది. అందిన వివరాల మేరకు మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన మురికి పూడి విల్సన్ తన ద్విచక్ర వాహనంపై కురిచేడు మండలంలోని పొట్లపాడు గ్రామానికి వెళ్తున్నాడు. రామిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో వాహనంకు అకస్మాత్తుగా మేక అడ్డు రావటంతో తప్పించే క్ర మంలో అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో విల్సన్‌కాలు విరగటం, గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఆదినారాయణ, దూపాటి శ్రీనులు సంఘటన ప్రదేశంకు చేరుకొని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేపట్టి వినుకొండ వైద్యశాలకు తరలించినట్లు సమాచారం.

కోటిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కైపు

తాళ్లూరు, జనవరి 29 : నాగంబొట్లపాలెం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ సీనియర్ ఎర్రబోలు కోటిరెడ్డి కుటుంబాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కైపు వెంకట కృష్ణారెడ్డి సోమవారం పరామర్శించారు. కోటిరెడ్డి కాంగ్రెస్ పార్టీ కోసం కృషి చేశారని, ఆయన మరణం పార్టీకి తీరనిలోటని విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో రామిరెడ్డి ప్రతాపరెడ్డి, కాట్రెడ్డి సుదర్శన్ రెడ్డి, జనార్దన్‌చౌదరి, గోపియాదవ్ పాల్గొన్నారు.

ప్రముఖ వైద్యుడు గురుబ్రహ్మం మృతి



గురుబ్రహ్మం

కనిగిరి, జనవరి 29: ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ చప్పరం గురుబ్రహ్మం (80) ఆదివారం రాత్రి మృతి చెందారు. కొంత కాలంగా అస్వస్థతో ఉన్న ఆయన వైద్యం కోసం బెంగళూరు ఆసుపత్రిలో చేరారు. వైద్యం పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో కనిగిరి ప్రజలతో పాటు ప్రముఖులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన పార్థివదేహాన్ని బెంగళూరు నుంచి సోమవారం రాత్రి కనిగిరికి తీసుకువచ్చారు. ఆయన సతీమణి ప్రముఖ వైద్యులు సుగుణావతమ్మ. ఆయన తనయుడు ప్రముఖ న్యాయవాది. గురు బ్రహ్మం మరణవార్తతో సుగుణావతమ్మ సెంటరులో, ఆర్యవైశ్య కుటుంబాల్లో, పేద, బడుగు వర్గాల కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు

దర్శి జనవరి 29 : రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం లయన్స్ క్లబ్ సహకారంతో రవాణా శాఖ కార్యాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ గీతాపద్మ డ్రైవర్లకు కంటి పరీక్షలు చేశారు. మొత్తం 80 మందికి పరీక్షలు చేయగా కొంతమందికి కళ్లజోళ్లు అవసరంగా గుర్తించారు. ఈ సందర్భంగా రవాణాశాఖ అధికారి పీ రవికుమార్ మాట్లాడుతూ డ్రైవర్లకు కంటిచూపు బాగుంటేనే సురక్షితంగా వాహనాలను నడపగలరన్నారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో డ్రైవర్ల సురక్షితం కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మాడపాకుల బాలు, కార్యదర్శి అప్పికట్ల ఆదినారాయణ సభ్యులు హనుమంతరావు, ఆర్.రాఘవులు, జీ శ్రీనివాసరావు, పీ సత్యం పా ల్గొన్నారు.

కోలాహలంగా ఒంగోలు జాతి గిత్తల బల ప్రదర్శన



తలపడుతున్న ఎడ్లు

కురిచేడు, జనవరి 29: కురిచేడు మండలం పొట్లపాడు గ్రామంలో గుత్తికొండ రామయోగిస్వామి 113వ తిరునాళ్ల సందర్భంగా రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి గిత్తల బల ప్రదర్శన పోటీలు సోమవారం కోలాహలంగా జరిగాయి. సోమవారం 4 పళ్ల విభాగంలో పోటీలు జరిగాయి. మొత్తం 14 జతలు పోటీలో పాల్గొన్నాయి. ప్రథమ బహుమతిని చిలకలూరిపేట సమీపంలోని పురుషోత్తపట్నానికి చెందిన షేక్ అబ్దుల్ సత్తార్ ఎడ్ల జత 4331 అడుగులు లాగి గెలుచుకున్నాయి. వారికి రూ.40వేల బహుమతి అందజేశారు. ద్వితీయ బహుమతిని నంద్యాల జిల్లా కొణిదెల గ్రామానికి చెందిన డి.నరసింహారావు ఎడ్ల జత 4200 అడుగులు లాగి గెలుచుకున్నాయి. వారికి రూ.30 వేలు బహుమతిని అందజేశారు. తృతీయ స్థానంలో గుంటూరు జిల్లా తుళ్లూరుకు చెందిన మోదుగుల రామిరెడ్డి ఎడ్లజత 4085 లాగి గెలుచుకున్నాయి. వారికి రూ.25వేలు అందజేశారు. ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన చూడటానికి ప్రజలు ఎక్కువగా తరలి వచ్చారు. కార్యక్రమంలో ఆలయం ధర్మకర్త నుసుం గోవిందరెడ్డి పాల్గొన్నారు. గ్రామస్థులకు, పోటీలో పాల్గొన్న వారికి చీమకుర్తికి చెందిన గ్రానైట్ వ్యాపారి నుసుం గోవింద రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

దర్శి, జనవరి 29 : మహిళల అభ్యున్నతే ధ్యేయంగా వైసీపీ ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుందని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ చెప్పారు. స్థానిక పీజీఎస్ కల్యాణ మండపం ఆవరణలో సోమవారం మండలంలోని డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం కింద విడుదలైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక స్వాలంబన కల్పించేందుకు వడ్డీలేని రుణాలను అందిస్తున్నారని తెలిపారు. మహిళలు పథకాలను వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. కుటుంబ కారణాలతో గత ఎన్నికల్లో తాము పోటీ నుంచి తప్పుకోగా కొంతమంది భయపడి మానుకున్నారని తప్పుడు ఆరోపణలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే ఇప్పుడు పోటీ చేయాలని సవాల్ చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. మండలంలోని 1764 గ్రూపులకు రూ.6.55 కోట్లు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి టీ రవికుమార్, ఎంపీపీ జీ సుధారాణి, ఎంపీడీవో హనుమంతరావు, ఈవోఆర్డీ గుత్తా శోభన్‌బాబు, నగర పంచాయతీ కమిషనర్ వై మహేశ్వరరావు, రాష్ట్ర షే క్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎం బాషా, రాష్ట్ర బ్యూటిఫికేషన్‌కార్పొరేషన్ డైరెక్టర్ అంజిరెడ్డి, వైస్ ఎంపీపీలు సోము దుర్గారెడ్డి, కొరివి ముసలయ్య, ఏఎమ్‌సీ మాజీ చైర్మన్ కేవీరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బూచేపల్లికి ఎంపీపీ సునీత మద్దతు

ముండ్లమూరు, జనవరి 29 : దర్శి నియోజక వర్గ వైసీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి ఎంపీపీ సుంకర సునీత మద్దతు తెలిపారు. సోమవారం శివప్రసాదరెడ్డి ఎంపీపీ సునీత బ్రహ్మానందరెడ్డి ఇంటికి వెళ్లారు. ముందుగా ఆయన్ని ఘ నంగా సన్మానించారు. ఎంపీపీ సునీత బ్రహ్మానందరెడ్డి ఎమ్మెల్యే మద్దిశెట్టివర్గానికి చెందిన వారు. ఇటీవల శివప్రసాదరెడ్డికి దర్శి నియోజక వర్గ వైసీపీ ఇన్‌చార్జ్‌గా నియమించడంతో ఆయన మద్దిశెట్టి వర్గీయులతో కలిశారు. అందులో భాగంగానే ఎంపీపీ ఇంటికి కూడా వెళ్లారు. ఈ సందర్భంగా శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ వైసీపీ నాయకులు, కార్యకర్తలందరినీ సమానంగా చూస్తామని అన్నారు. కార్యక్రమంలో నూజెండ్లపల్లి సర్పంచ్ చొప్పరపు వెంకటేశ్వర్లు, మారెళ్ల సొసైటీ మాజీ అధ్యక్షుడు మట్టా సుబ్బారెడ్డి, మైలా శ్రీరాములు, సుంకర హనుమారెడ్డి, భీమిరెడ్డి శివరామిరెడ్డి, సుంకర వీరారెడ్డి, గంగన్నపాలెం, జమ్ములమడక గ్రామాలకు చెందిన నేతలు ఉన్నారు.

టీడీపీలో కొనసాగుతున్న చేరికలు

- తురకపల్లిలో వైసీపీని వీడిన కుటుంబాలు
- విజయానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర విజ్ఞప్తి



వైసీపీని వీడి టీడీపీలో చేరిన సీతారాంపురం వాసులను ఆహ్వానిస్తున్న డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జనవరి 29: టీడీపీలోకి చేరికల పర్వం కొనసాగుతూనే ఉంది. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర క్యాంప్ క్యాంపు నివాసంలో సోమవారం హనుమంతుపాడు మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన 30 కుటుంబాలవారు వైసీపీని వీడారు. వారంతా సాని కొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్టీఆర్) ఆధ్వర్యంలో టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఉగ్ర వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కనిగిరిలో తెలుగుదేశం పార్టీ అత్యధిక మెజార్టీతో గెలుపొందేలా కృషి చేయాలని వారికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కనిగిరిలో భారీ మెజార్టీ వచ్చేలా పనిచేయాలని కోరారు. ఇంటింటికీ తిరుగుతూ ఆయా గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి టీడీపీ చేపట్టబోయే చర్యలను, అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా టీడీపీ గెలుపుతోనే కనిగిరి అభివృద్ధి సాధ్యపడుతుందని, వెలుగొండ జలాలు కనిగిరి ప్రాంతంలోని అన్ని మండలాలకు రప్పించేలా అధినేత చంద్రబాబు చర్యలు తీసుకుంటారని ప్రజలకు చెప్పాలన్నారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పించడంతో పాటు పాత వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ పాత, కొత్త తేడా లేకుండా కలసి కట్టుగా పార్టీ గెలుపుకు సైనికుల్లా పని చేయాలన్నారు. వైసీపీని వీడి నూనె నారాయణయాదవ్ నేతృత్వంలో పార్టీలో చేరిన వారిలో నల్లబోతుల బాలు, పీవీ లక్ష్మణ్, ఎస్ అబ్దుల్ రహిమాన్, విలియమ్స్, బీ ప్రవీణ్, కే గురుకృష్ణ, బీ రమేష్, జుటికె విక్కీ, ఎస్‌కే రఫీ, అజయ్‌ప్రవీణ్, సీతారాంపురం గ్రామస్థులు పాల్గొన్నారు.

బీసీలకు నమ్మకద్రోహం చేసిన జగన్



జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాజుయాదవ్

పామూరు, జనవరి 29 : బీసీ సామాజిక వర్గాల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి 27 రకాల పథకాలను రద్దు చేసి బీసీలకు నమ్మకద్రోహం చేశారని టీడీపీ బీసీ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.గంగరాజుయాదవ్ అన్నారు. శేషమహల్ ప్రాంగణంలో జయహో బీసీ సదస్సును టీడీపీ బీసీ మండల కమిటీ అధ్యక్షుడు డేగా నాగరాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. టీడీపీ మినీ మేనిఫెస్టోలో చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో పాటు బీసీలకు రక్షణ చట్టం తీసకొస్తామని గంగరాజు యాదవ్ తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. అబ్జర్వర్ వీరన్న మాట్లాడుతూ టీడీపీకి బలహీనవర్గాలవారే వెన్నెముక అన్నారు. జగన్‌రెడ్డి పాలనలో బీసీలను అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబు ఆదరణ పథకంతో బీసీలకు ఆర్థిక భరోసా లభించిందన్నారు. బీసీ సెల్ నియోజక వర్గ అధ్యక్షుడు మస్తాన్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీలు అణచివేతకు గురయ్యారన్నారు. బీసీలందరూ ఐక్యంగా టీడీపీ విజయానికి మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. సదస్సులో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం హుసేన్‌రావుయాదవ్, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, జిల్లా కమిటీ సభ్యుడు షేక్ ఖాజారహంతుల్లా, ఆర్ఆర్ రఫీ, ఆరేకొండ హరి ప్రసాద్, వై.రమేష్, నల్లబోతుల వెంకటేశ్వర్లు, ఎం.గిడ్డయ్య, టీడీపీ ముస్లిం మూనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ గౌస్‌బాషా, చిన హజరత్, కౌలూరి రహంతుల్లా, బత్తుల సత్యం, ఎన్.నాగేంద్రచారి, మండ్లా రమణయ్య, తిరుపతయ్య, దొరసానాచారి, శేఖర్. పోలేపల్లి హరి పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు పాతపాడు, కేవీపల్లి విద్యార్థులు

కనిగిరి, జనవరి 29: 67వ జాతీయస్థాయి ఖో-ఖో పోటీలకు మండలంలోని కంచర్లవారిపల్లి, పాతపాడు హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ కాశీవిశ్వనాథరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31నుంచి వచ్చే నెల 4వరకు ఝార్ఖండ్‌లోని రాంచీలో జరిగే జాతీయస్థాయి అండర్ - 14 స్కూల్ గేమ్స్‌కు ఎంపికైనారు. గత పది రోజులుగా జిల్లా సాధికారిత సంస్థ నందు చిత్తూరులో జరిగిన శిక్షణా శిబిరంలో పాల్గొని రాంచీలో జరిగే జాతీయ స్థాయిలో జరిగే ఆంధ్రప్రదేశ్ ఖోఖో బాలురు జట్టులో కేవీపల్లి హైస్కూల్‌కు చెందిన తమ్మినేని మనోజ్‌రెడ్డి, బాలికల జట్టులో రేగలగడ్డ గురవమ్మలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వనజ, కేవీపల్లి, పాతపాడు హైస్కూల్ హెచ్‌ఎంలు విజయభాస్కర్ రెడ్డి, బీ ఇందిర, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, పీఈటీలు పాల్గొన్నారు.



కోతులను బోనులో బంధించిన సిబ్బంది

ఎట్టకేలకు కోతుల నిర్మూలనకు చర్యలు

దొనకొండ, జనవరి 29 : దొనకొండలో తీవ్రమైన కోతుల బెడదకు గ్రామ పంచాయతీ సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి, దేవానంద్, కార్యదర్శి పీ కృష్ణమూర్తి ఎట్టకేలకు కోతుల నిర్మూలనకు సోమవారం శ్రీకారం పలికారు. ఇటీవల కాలంలో గ్రామంలోని అన్ని వీధుల్లో కోతులు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఇళ్లలోకి ప్రవేశించి బీభత్సం సృష్టించడం, రోడ్లపై చిరు వ్యాపారుల వద్ద పండ్లు, తినే వస్తువులను తీసుకెళ్లడం లాంటి చర్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కాలంలో కోతుల దాడికి గురై పలువురు గాయాలపాలైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో ప్రజలు విపరీతమైన కోతులతో తాము ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని నిర్మూలన చర్యలు చేపట్టాలంటూ వినతిపత్రాలు అం దించి పలు సమావేశాల్లో ఆరోపణలు చేశారు. దీంతో స్పందించిన పంచాయతీ పాలకులు మాచర్ల నుంచి కోతులను పట్టుకునే వారిని పిలిపించగా వారు బోన్లను ఏ ర్పాటు చేసి కోతులను పట్టుకునే చర్యలు చేపట్టారు. పట్టుకున్న కోతులను శ్రీశైలం అడవుల్లో వదిలిపెట్టేలా చర్యలు చేపడుతున్నామని కార్యదర్శి కృష్ణమూర్తి వివరించారు. దొనకొండలో కోతుల నిర్మూలనకు చర్యలు చేపట్టిన సర్పంచ్, పాలకులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వాలీబాల్ విన్నర్‌గా పులిపాడు సచివాలయం జట్టు

ముండ్లమూరు, జనవరి 29 : దర్శి నియోజక వర్గ స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో మండలంలోని పులిపాడు సచివాలయం జట్టు విన్నర్‌గా నిలిచింది. దీంతో సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద విజేతగా నిలిచిన జట్టును ఎంపీడీవో శంకరరావు, ఈవోఆర్డీ శ్రీదేవి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విజేతలను అభినందించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జే శ్రీనివాసరావు, రాజ రాజేశ్వరిదేవి పాల్గొన్నారు.

వైసీపీలో చల్లారని మార్పు మంటలు

- దద్దాల పరిచయ కార్యక్రమానికి డుమ్మాకొట్టిన పలువురు నేతలు



శ్రేణులకు నమస్కరిస్తున్న దద్దాల

పీసీపల్లి, జనవరి 29 : కనిగిరి నియోజకవర్గం వైసీపీలో ఇన్‌చార్జి మార్పుతో ఆ పార్టీలో రాజుకున్న అసమ్మతి మంటలు ఇంకా చల్లారలేదు.వైసీపీ అధిష్ఠానం 4వ జాబితాలో నియోజకవర్గ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను తప్పించి హెచ్‌ఎంపాడు జడ్పీటీసీ సభ్యుడు దద్దాల నారాయణ యాదవ్‌ను నియోజక వర్గ ఇన్‌చార్జిగా ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో మండలంలోని వైసీపీలోని బుర్రా వర్గం దద్దాల నియామకాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ అధిష్ఠానం మరోసారి పునరాలోచన చేసి బుర్రానే ఇన్‌చార్జిగా ప్రకటించాలంటూ మీడియా సమావేశాలు పెట్టి ప్రకటనలు చేశారు. అయితే ఇన్‌చార్జిగా నియమితులైన దద్దాల పరిచయ కార్యక్రమం పేరుతో సోమవారం పీసీపల్లిలో వైసీపీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వైసీపీకి చెందిన పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ముఖ్యనాయకులు డుమ్మాకొట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు పలువురికి ఫోన్‌లు చేసి ఆహ్వానించినా సొంత పనులు ఉన్నాయనే సాకు చెప్పి సమావేశానికి హాజరుకాలేదని తెలిసింది. పెదఅలవలపాడు, మురుగుమ్మి, గుదేవారిపాలెం, ఎంపీటీసీ సభ్యులు, పలు పంచాయతీల సర్పంచ్‌లతో పాటు మండల సచివాలయాల కన్వీనర్ సుదర్శన్, వ్యవసాయ సలహా మండలి సభ్యు లు ఏరువ నరసింహం, సీనియర్ నాయకులు పులి వెంకటేశ్వరరెడ్డి, పలు గ్రామాలకు చెం దిన మరికొంతమంది నాయకులు సమావేశం లో కనిపించలేదు. మండలపార్టీ కన్వీనర్ బొ ర్రారెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పోలు జయరామిరెడ్డి, ఎంపీపీ జపన్య, సేవాదళ్ కన్వీనర్ రా జశేఖర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు లక్ష్మీకాంతం ఓకేరెడ్డి, యర్రంరెడ్డి మోహన్‌రెడ్డి, మాజీ ఎం పీపీ బత్తుల అంజయ్య, చీమల బ్రహ్మానందరె డ్డి, డబ్బుగొట్టు మహేష్, గుంటగాని బాస్కర్ తదితరులు దద్దాలకు స్వాగతం పలికి పరిచ య కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితో పాటు వెలిగండ్ల జడ్పీటీసీ సభ్యుడు తిరుపతిరెడ్డి, బ న్ని, కస్తూరిరెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ పరిచయ కార్యక్రమానికి పార్టీ నాయకులు అందరూ హాజరుకాకపోవడంతో బుర్రాను ఇన్‌చార్జిగా తప్పించడంవల్లే ఆయన అభిమానులు డుమ్మాకొట్టారని అక్కడకు వచ్చినవారు చర్చించుకుంటున్నారు. ఈ సందర్భంగా దద్దాల మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పనిచేసి వైసీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యతన అందరిపై ఉందన్నారు. అనంతరం నాయకులు ఆయనను సన్మానించారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
మంగళవారం 30 జనవరి 2024





జగన్ ఇచ్చిన హామీలను వీడియో క్లిప్పింగ్‌లను చూపిస్తున్న చంద్రబాబు



ప్రభంజనం

'రా కదలిరా!' సభ విజయవంతం

- తండోపతండాలుగా సభకు వచ్చిన పసుపు సైన్యం
- భారీ సంఖ్యలో తరలివచ్చిన మహిళలు, యువకులు
- జయజయ ధ్వానాలు, ఈలలు, కేరింతల హోరు
- స్ఫూర్తి నింపిన చంద్రబాబు ప్రసంగం
- అంబోతుకు కళ్లె వేసి నడిరోడ్డుపై నడిపిస్తా!
- పొన్నూరు 'కిలాడి' గ్రావెల్ రోశయ్యగా మారిపోయాడు
- ఆర్కే, మద్దాళిని వాడి పడేసిన పేపర్లా విసిరేశాడు
- స్థానిక వైసీపీ ఎమ్మెల్యేలపై విరుచుకుపడిన చంద్రబాబు

జనం.. జనం.. ఎటుచూసినా ప్రభంజనం.. తండోపతండాలుగా కదలివచ్చిన పసుపు సైన్యం.. సొంతవాహనాలపై స్వచ్ఛందంగా తరలి వచ్చిన ప్రజానీకం.. ఉత్సాహం నింపిన అధినేత ప్రసంగం.. జిల్లాలో 'రా కదలిరా!' సభ ప్రభంజనం సృష్టించింది. ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయకపోయినా, రవాణా సదుపాయాలు సరిపోకపోయినా జనం గ్రామాల నుంచి లక్షలాదిగా తరలివచ్చారు. బైకు ర్యాలీలు పెట్టుకుని కొందరు, ట్రాక్టర్లు కట్టుకుని మరికొందరు సభకు హాజరయ్యారు. టీడీపీ సభలకు సంప్రదాయకంగా వచ్చే పార్టీ శ్రేణులు, రైతులతోపాటు ఈసారి పెద్దసంఖ్యలో మహిళలు, యువకులు హాజరయ్యారు. హాజరవడమే కాకుండా మహిళలు స్ఫూర్తిదాయకంగా చంద్రబాబు ఉపన్యాసానికి బదులిచ్చారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనపై చంద్రబాబు మాట్లాడుతున్నప్పుడు ధీటుగా బదులిస్తూ, సైకో పాలన అంతం చేస్తామంటూ పిడికిళ్లు బిగించి నినాదాలు చేశారు. వేలాదిగా వచ్చిన యువత కట్టుతప్పకుండా క్రమశిక్షణగా సభను నడిపించడమే కాకుండా చంద్రబాబుకు భరోసాను ఇచ్చారు. సభలో భాగంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

గుంటూరు, పొన్నూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గంలోని వడ్లమూడి గ్రామంలో సోమవారం జరిగిన 'రా కదలిరా!' సభ విజయవంతమైంది. టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు సహా సాధారణ ప్రజలు కూడా తండోపతండాలుగా సభకు రావడంతో సభా ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. గ్యాలరీలన్నీ నిండిపోయాయి. మధ్యాహ్నం మూడు దాటిందో లేదో వేలాదిగా జనం సభకు తరలివచ్చారు. గుంటూరు పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాల నుంచి వేలాది బైకులతో కార్యకర్తలు తరలిరాగా, సంప్రదాయకంగా వచ్చే రైతాంగం, రైతు కూలీలు ట్రాక్టర్లు కట్టుకుని సభకు చేరుకున్నారు. గుంటూరు, తెనాలి, పొన్నూరు పట్టణాల నుంచి అత్యధిక సంఖ్యలో సభికులు హాజరయ్యారు. సభ ప్రారంభానికి ముందే అందరూ ప్రాంగణానికి చేరుకోవడంతో గ్యాలరీలన్నీ కిక్కిరిసిపోయాయి. ప్రాంగణం సరిపోక బయట రోడ్లపైన నిలబడే పరిస్థితి కనిపించింది. చంద్రబాబు రాకతో సభా ప్రాంగణమంతా జయజయ ధ్వానాలతో, ఈలలతో హోరెత్తింది. చంద్రబాబు వస్తున్న హెలికాప్టర్‌ను చూస్తూ మహిళలు, యువకులు, కార్యకర్తలు పచ్చ కండువాలు, జెండాలు ఊపుతూ అధినేతకు ఘనస్వాగతం పలికారు. ముఖ్యనేతలు హెలిప్యాడ్ వద్దకు వెళ్లి ఆయనను సాదరంగా వేదిక వద్దకు తీసుకువచ్చారు. సభకు టీడీపీ- జనసేన పార్టీల క్యాడర్ పెద్ద సంఖ్యలో హాజరవడంతో ఉత్సాహపూరిత వాతావరణం నెలకొంది.

ఉత్సాహం నింపిన చంద్రబాబు ప్రసంగం..

'మా కన్నాపై దాడి చేయిస్తావా అంబోతు.. ఖబడ్దార్! తోక కట్‌చేస్తా! అంబోతుకు కళ్లెం వేస్తా.. నడిరోడ్డుపై నడిపిస్తా.. అవసరమైతే బట్టలిప్పి తరిమికొడతా!' అంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విరుచుకుపడ్డారు. చంద్రబాబు అధి కార వైసీపీ నేతల అరాచకాలపై చంద్ర నిప్పులు చెరిగారు. గుంటూరు పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో వున్న అధికార పార్టీ ఎమ్మెల్యేల అక్రమాలను, అకృత్యాలను లక్షలాదిమంది ప్రజల సమక్షంలో ఎండగట్టడమే కాకుండా, అధికార మదంతో చెలరేగిపోతున్న వారికి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యమంత్రి వారికి అక్రమాలు చేయడానికి లైసెన్సులు ఇచ్చాడని ఆరోపించారు. ఒక పెద్ద సైకో ఇప్పుడు ఊరికో సైకోని సిద్ధం చేశాడని, వారందరికీ కళ్లెం వేసి దారికి తెచ్చే బాధ్యత టీడీపీ తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. 'పొన్నూరు కిలాడి' ఇప్పుడు గ్రావెల్ రోశయ్యగా మారిపోయాడని, సినిమాల్లో కనిపించే కేజీఎఫ్‌ను మించి పొన్నూరు గ్రావెల్ ఫీల్డ్(పీజీఎఫ్) దోపిడీ సాగుతోందని ఆరోపించారు. 700 ఎకరాల్లో 2వేల కోట్ల రూపాయల దోపిడీకి తెరతీశాడని ఆరోపించారు. మాజీ హోంమంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే సుచరిత, వేమూరు ఎమ్మెల్యే, మంత్రి మేరుగ నాగార్జున, చిలకలూరిపేట ఎమ్మెల్యే, మంత్రి విడుదల రజినీపై సెటైర్లు వేశారు. ఈ ఊరిలో పనికిరాని చెత్త పక్కూరిలో బంగారమవుతుందని జగన్ అనకుంటున్నారని, ఆ పప్పులేవీ ఉడకవని ఎద్దేవా చేశారు. 'పాపం మంగళగిరి ఎమ్మెల్యే మనపై కేసులు వేసీ వేసీ.. చివరికి జగన్ చేతిలో మోసపోయాడు' అని అన్నారు. గుంటూరు పశ్చిమలో మన పార్టీలో గెలిచిన ఎమ్మెల్యే ప్లేటు ఫిరాయించి ఇప్పుడు అడ్రసు లేకుండా పోయాడన్నారు. వాడుకుని వదిలేయడంలో జగన్ మించినవారు లేరని మరోమారు జగన్ రుజువు చేశాడు. వాళ్లిద్దరినీ వాడుకుని వేస్టు పేపర్‌లా వదిలేశాడని, వారు అడ్రస్ లేక తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. తెనాలిలో ఎమ్మెల్యే మున్సిపల్ సిబ్బందితో సొంత పనులు చేయించుకుంటున్నాడని, మట్టి, కంకర బొక్కేస్తున్నాడని, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే గంజాయి, గుట్కా వ్యాపారాలతో యువత జీవితాలను నాశనం చేస్తు న్నారని, వీరంతా ఎన్నికల తరువాత తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

వైసీపీ అరాచకాలను ఎండగట్టిన టీడీపీ నేతలు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రశ్నించడానికి ముందుకు వచ్చిన పవన్ కల్యాణ్‌ను కలుపుకుని చంద్రబాబు 'రా కద లిరా!' పిలుపునిచ్చారని అన్నారు. ప్రతిపక్షాలు ఏమి చేస్తున్నాయి. అధికార పక్షం ఏం చేస్తోంది అనేది ఆలోచించుకుని ప్రజలు ఓట్లేయాలని కోరారు. పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ టీడీపీతో తన కుటుంబం 40 ఏళ్ల అను బంధం కలిగి వుందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి చనిపోయే వరకూ తన తండ్రి వీరయ్య చౌదరి పార్టీ సేవకే అంకితమ య్యారని, తాను కూడా కడదాకా పార్టీతోనే వుంటానని చెప్పారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రం కోస మే పవన్ మంచి నిర్ణయం తీసుకున్నారని, ఓటు ను చీలనివ్వకుండా వైసీపీని ఓడించడానికి చంద్రబాబు, పవన్ కలిసి నడుస్తున్నారని, ప్రతిపక్ష ఓటును చీలనీయనన్న పవన్ లక్ష్యాన్ని దెబ్బతీయడానికే కాంగ్రెస్, షర్మిల నాటకమని విమర్శించారు. పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ ప్రజలంతా ఎన్నికల కోసం కాకుండా స్వాతంత్ర్యం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు ఇన్‌చార్జి బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ రైతులను, రైతుకూలీలు, దిన కూలీలను, మహిళలు, యువత, ఉద్యోగులు, విద్యార్థులు అందరినీ వంచించిన జగన్‌కు ప్రజల్లో మార్పు చూసి వెన్నులో వణుకు పుడుతుందన్నారు. తూర్పు ఇన్‌చార్జి నసీర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ నాడు ఇచ్చిన పిలుపు స్ఫూర్తినందుకుని జనం కదలినట్లు ఇప్పుడు బాబు స్ఫూర్తినందుకుని జనం రాష్ట్రం కోసం, పిల్లల భవిష్యత్తు కోసం కదలిరావాలన్నారు. మంగళగిరి నుంచి రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గా లను క్షోభ పెడుతోంది జగన్‌రెడ్డే నన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజా మాట్లాడుతూ ఉద్యమాల పురుటిగడ్డలో రాజధానిని ఏర్పా టు చేస్తే దానిని జగన్‌రెడ్డి విచ్ఛి న్నం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ చంద్రబాబు అభివృద్ధితో దేశమంతా రాష్ట్రం వైపు చూసేలా చేశారన్నారు. కార్యక్రమంలో రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్, మాజీ మంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనందబాబు, దేవినేని ఉమా మహేశ్వరరావు, నన్నపనేని రాజకుమారి, మాకినేని పెదరత్తయ్య, రాయపాటి శ్రీనివాస్, నేతలు డేగల ప్రభాకర్, కనపర్తి శ్రీనివాసరావు, మన్నవ మోహనకృష్ణ, నిమ్మల శేషయ్య, చిట్టాబత్తిన చిట్టిబాబు, వడ్రాణం మార్కండేయులు, హరిబాబు, నందం అబద్ధయ్య, పాల్గొన్నారు.


చంద్రబాబుతో ఎమ్మెల్యే అనగాని మాటామంతి


ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేంద్రకుమార్


గీతాలు ఆలపిస్తున్న తెలుగు మహిళలు


చంద్రబాబును సన్మానిస్తున్న జనసేన నేతలు


సభలో ముస్లిం మహిళలు

నాలా మోసపోవద్దు..

- వైసీపీ నాయకుడు అబ్దుల్లా వినతి

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జనవరి29: తనలా వైసీపీకి ఓటు వేసి నష్టపోవద్దని వైసీపీ నాయకుడు షేక్ అబ్దుల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. వడ్లమూడిలో జరిగిన రా కదలిరా టీడీపీ బహిరంగ సభలో ఆయనకు మాట్లాడే అవకాశం కల్పించగా తన కుటుంబం గత ఎన్నికల్లో కష్టపడి పనిచేసి వైసీపీని గెలిపించామని అన్నారు. నాలుగేళ్ల క్రితం తన కుమారుడు రబ్బానీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్నాడు. తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉండటంతో ముఖ్యమంత్రికి, డీజీపీకి లేఖలు రాసినా తన గోడు వినేవారే లేరన్నారు. పొన్నూరు ఎమ్మెల్యే వద్దకు వెళ్లి కుమారుడి మృతిపై విచారణ జరపాలని పలుమార్లు కోరినా నిర్లక్ష్యమే కనపడిందన్నారు. డబ్బులు తీసుకొని తన కుమారుడి కేసును ఎమ్మెల్యే మాఫీ చేయించారని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ప్రజలకు రక్షణ ఇచ్చే టీడీపీ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



సభకు వచ్చిన వాహనాలపై రవాణా శాఖ పెనాల్టీ

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జనవరి29: చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలో సోమవారం జరిగిన తెలుగుదేశం పార్టీ రా కదలిరా బహిరంగ సభకు వచ్చిన వాహనాలపై రవాణా శాఖ పెనాల్టీలు విధించటం ఆశ్చర్యానికి గురి చేసింది. వడ్లమూడి గ్రామం వద్ద జరిగిన సభకు ప్రజలు పలు జిల్లా నలుమూలల నుంచి బస్సులు, ట్రాక్టర్లు, కారులు, ఇతర రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేసుకొని స్వచ్ఛందంగా తరలివచ్చారు. ప్రభుత్వ ఆదేశాలా లేక, వైసీపీ పెద్దలు హుకుం జారీ చేసారో తెలియదు కానీ రవాణా శాఖ అధికారులు, ఈ ప్రైవేటు ఆపరేటర్ల బస్సులను ఆపి భారీ పెనాల్టీ విధించిన్నట్లు సమాచారం. అంతే కాకుండా మార్గంలో లారీలను అడ్డుపెట్టి వాహనాలు అడ్డగించారు. రవాణా శాఖ అధికారులు, పోలీసుల చర్యలతో టీడీపీ శ్రేణులు రోడ్డుపైనే వాహనాలను నిలిపి నిరసనలు వ్యక్తం చేశారు.


కటౌట్‌లు, ఫ్లడ్‌లైట్లు స్టాండ్‌లు ఎక్కిన కార్యకర్తలు


మహిళాభిమానం

నేనున్నానని..

- నేడు జిల్లాలో నారా భువనేశ్వరి 'నిజంగెలవాలి' పర్యటన
- చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక ఆగిన గుండెలు
- వారి కుటుంబసభ్యులకు పరామర్శ, ఆర్థికసాయం



బాపట్ల, జనవరి29(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మరణించిన వారి కుటుంబాలకు నేనున్నా ననే భరోసా ఇవ్వడానికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీ మణి నారా భువనేశ్వరి మంగళవారం జిల్లాలో పర్యటిం చనున్నా రు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా చెరుకుపల్లిలోని ఓ కుటుంబంతో పాటు, పర్చూరు నియోజకవర్గ పరిధిలోని చిననంది పాడు, యద్దనపూడి గ్రామాల్లోని రెండు కుటు ంబాలను భువనేశ్వరి పరామర్శించి వారికి ఆర్థిక సాయం అందించి ధైర్యం చెప్పనున్నారు

పర్యటన సాగేదిలా...

మంగళవారం ఉదయం 11:30కు గన్నవరం విమానాశ్రయానికి చేరుకోనున్న భువనేశ్వరి అక్కడ నుంచి రోడ్డుమార్గంలో మధ్యాహ్నం 1:50కి చెరుకుపల్లికి చేరుకుని అక్కడ ఓ కుటుంబాన్ని పరామర్శిస్తారు. ఆరుంబాక గ్రామంలో భోజనం చేసి అక్కడ నుంచి పర్యటన కొనసాగిస్తారు. సాయంత్రం 4:30కి పర్చూరు నియోజకవర్గ పరిధిలోని చిననందిపాడు గ్రామానికి చేరుకుని చంద్రబాబు అరెస్టు తట్టుకోలేక మరణించిన వ్యక్తి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పనున్నారు. అక్కడ నుంచి సాయంత్రం 5:30కి యద్దనపూడి చేరుకుని మరో కుటుంబాన్ని పరామర్శించనున్నారు. చనిపోయిన వారి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పడంతో పాటు ఒక్కో కుటుంబానికి మూడు లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సాయాన్ని ఈ పర్యటనలో భువనేశ్వరి అందించనున్నారు.


ఒక్కొక్కరికి.. రెండు ఓట్లు


- ఈఆర్‌వోకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదు
- అధికార పార్టీ నాయకుల ఆదేశాలతోనే తొలగించని వైనం


రేపల్లె, జనవరి 29: తీరప్రాంతంలో ఓటర్ల తుది జాబితా తప్పులు తడకగా మారింది. ఒకే చోట రెండు ఓట్లు ఉన్నా అధికార పార్టీ నాయకుల ఆదేశాలతో బీఎల్‌వోలు దృష్టి సారించలేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. రేపల్లె నియోజకవర్గంలోని నిజాంపట్నంలో ఓటర్ల జాబితాను పరిశీలిస్తే ఒకే ఓటరుకు రెండు చోట్ల చొప్పున 68ఓట్లను గతంలో గుర్తించారు. స్థానిక నాయకులు బీఎల్‌వోకి స్థానిక తహసీల్దార్‌కు రెండు చోట్ల ఓట్లను తొలగించాలని ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇటీవల విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాలో సగం పైగానే ఒకే ఓటరుకు రెండు ఓట్లు చొప్పున ఉన్నాయి.

నిజాంపట్నంలో పార్వతీ మోపిదేవికి 140వ బూత్‌లో సీరియల్ నెంబర్ 331, 147వ బూత్‌లో సీరియల్ 303లో ఒకే పేరున రెండు ఓట్లు ఉన్నాయి. ఇదే విధంగా కొక్కిలిగడ్డ నాగరాజుకు 140వ బూత్‌లో సీరియల్ నెంబర్ 218, 150వ బూత్‌లో సీరియల్ నెంబర్ 219లో రెండు ఓట్లు ఉన్నాయి. కొక్కిలిగడ్డ వెంకటేశ్వరమ్మ 140వ బూత్‌లో సీరియల్ నెంబర్ 12 కాగా, 146వ బూత్ సీరియల్ నెంబర్ 977లో రెండు ఓట్లు ఉన్నాయి. బొమ్మిడి వెంకటేశ్వరమ్మ 146వ బూత్‌లో సీరియల్ నెంబర్ 1085లో 141బూత్‌లో సీరియల్ నెంబర్ 920లో రెండు ఓట్లు ఉన్నాయి. బొమ్మిడి తిరుపతమ్మ 143వ బూత్‌లో సీరియల్ నెంబర్ 230, బూత్ నెంబర్147 సీరియల్ 371లో రెండు ఓట్లు ఉన్నాయి. తక్షణమే పరిశీలించి రెం డు ఓట్లు ఉన్నవాటిని తొలగించాలని కోరుతున్నారు.


నిజాంపట్నంలో మోపిదేవి పార్వతీకి రెండు ఓట్లు


వెంకటేశ్వరమ్మ బొమ్మిడికి రెండు ఓట్లు


తిరుపతమ్మకి రెండు ఓట్లు


వెంకటేశ్వరమ్మ కొక్కిలిగడ్డకు రెండు ఓట్లు

జగన్ మార్క్ కుట్ర

- ఎమ్మెల్యే ఏలూరి అరెస్టుకు రంగం సిద్ధం చేస్తున్న వైనం
- పర్చూరులో ఎవరూ పోటీకి ముందుకు రాని నేపథ్యంలో కొత్త ఎత్తు
- నాలుగేళ్లుగా మూతపడ్డ గోదాములో తనిఖీలు డైరీ పేరుతో నాటకం
- జీఎస్టీ ఎగవేత, అప్పుడెప్పుడో ఓట్ల కొనుగోలు పేరుతో హడావుడి
- దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్న ఏలూరి, టీడీపీ శ్రేణులు



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఆర్థిక వనరులను దెబ్బతీయటం, అక్రమ కేసులు నమోదు చేయటం. తద్వారా ప్రత్యర్థులను లొంగదీసుకోవాలన్న కుట్ర రాజకీయం. ఇదీ జగన్ ప్రభుత్వం నాలుగేళ్లుగా సాగిస్తున్న కుతంత్రాల పర్వం. అందులో ఎక్కువ చేదు అనుభవాలు ఎదురైనా వైసీపీ ప్రభుత్వం వెనక్కు తగ్గలేదు. అందుకు తాజాగా టీడీపీ బాపట్ల లోక్‌సభ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అరెస్టుకు పావులు కదుపుతోందని చెప్పుకోవచ్చు. గత ఎన్నికల్లో టీడీపీకి మెరుగైన ఫలితాలు లభించిన జిల్లాల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఒకటి. దీంతో జిల్లాలో ఆ పార్టీని, పార్టీకి అండగా ఉన్న నేతల్ని దెబ్బతీసే కుట్రలకు అధికారం చేపట్టిన వెంటనే జగన్ శ్రీకారం పలికారు. దీటైన నాయకులను దెబ్బతీసేందుకు వారి ఆర్థికమూలాలపై దాడి పెంచారు. అందులో భాగంగానే పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై కేసు నమోదుచేయటమే గాక అరెస్టు చేసే దిశగా పోలీసుశాఖ అడుగులు వేస్తోంది. నిజానికి ఏలూరిపై మూడున్నరేళ్ల క్రితమే జగన్ దృష్టిసారించారు. పార్టీ ఫిరాయించమని వత్తిడి చేశారు. అతని వ్యాపారాలను దెబ్బతీసే ప్రయత్నం చేశారు. అయితే ఏలూరి దీనికి లొంగలేదు, పార్టీ ఫిరాయించలేదు.

ఓట్ల కుట్రను దీటుగా ఎదుర్కొని

ఒక ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్న ఏలూరి నోవా అగ్రిటెక్ పేరుతో వ్యాపారవేత్తగా మారారు. చిన్నతనం నుంచి ప్రజాసేవ పట్ల ఉన్న మక్కువ, టీడీపీ అభిమానంతో 2012లో ఆ పార్టీలో చేరారు. 2014లో పర్చూరులో గెలుపొందటమే గాక గత ఎన్నికల్లో జగన్ గాలిని ఎదుర్కొని నియోజకవర్గంలో బలమైన దగ్గుబాటి వెంకటేశ్వరరావును ఓడించారు. ఆ తర్వాత ప్రభుత్వ వత్తిడికి లొంగకపోగా క్రమేపీ నియోజకవర్గంలోను, పార్టీ రాష్ట్రస్థాయి వ్యవహారాల్లోను కీలకంగా మారారు. బాపట్ల పార్లమెంటు నియోజకవర్గ పార్టీ బాధ్యతలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. దీంతో అతనిపై ప్రత్యేక దృష్టిసారించిన జగన్ పర్చూరులో ఆయనను ఓడించాలన్న లక్ష్యంతో వివిధ రకాల ప్రయత్నాలు చేశారు. ఒకరికి ఇద్దరు ఇన్‌చార్జిలను మార్చి బలమైన నాయకుడిని పోటీలోకి దించాలని ప్రయత్నించారు. చివరికి చీరాల నుంచి వచ్చిన ఆమంచి ద్వారా అనేక కుతంత్రాలను చేశారు. బోగస్ ఓట్ల పేరుతో టీడీపీ ఓట్ల తొలగింపు, గ్రామ మండల, నియోజకవర్గ స్థాయిలో నాయకులపై వేధింపులు, కేసులు, అరెస్టులను కొనసాగించారు. దేనికీ బెదరకుండా వ్యూహాత్మకంగా ముందుకుసాగిన ఏలూరికి పట్టు పెరిగిందని గుర్తించి ఆ పార్టీ టికెట్‌ను ఆశించేవారే కరువయ్యారు. జగన్ ఎంతో నమ్మిన ఆమంచి కూడా పర్చూరు తనకు అక్కర్లేదని తేల్చేశారు. ఈ నేపథ్యంలో తనదైన కుట్ర రాజకీయాలకు తెరలేపారు.

దాడులు.. కేసుల కోసం అనుమతి

బోగస్ పేరుతో టీడీపీ ఓట్ల తొలగింపునకు వైసీపీ పన్నిన కుట్రకు పర్చూరులో ఏలూరి అనుసరించిన విధానమే బ్రేక్ వేసింది. ప్రత్యేకించి పోలీసు శాఖ చేసిన అక్రమాలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లి వారిపై చర్యలు తీసుకునే విధంగా కూడా చేయగలిగారు. దీంతో పోలీసులను, ఆదాయపన్నుశాఖ అధికారులను రంగంలోకి దింపారు. నాలుగేళ్ల క్రితం గుంటూరులో మూసివేసిన ఏలూరి సంస్థకు సంబంధించిన గోదాముపై దాడిచేశారు. అక్కడ నుంచి ఎలాంటి వ్యాపార లావాదేవీలు లేవని తేలిపోయింది. ప్రభుత్వం కుట్రను ముందే ఊహించిన ఏలూరి తన సంస్థను ప్రైవేటు లిమిటెడ్ కంపెనీగా మార్చివేశారు. అయినా ఆగని ప్రభుత్వం కేంద్రానికి చెల్లించాల్సిన జీఎస్టీ సక్రమంగా చెల్లించలేదన్న నెపంతో ఐటీ అధికారులను రంగంలోకి దింపింది. వారి పరిశీలనలో ఏమీ ఆధారాలు లభ్యం కాకపోవటంతో డైరీ నాటకానికి తెరలేపారు. అందులో గత ఎన్నికల్లో ఏవో కొన్ని గ్రామాల్లో ఓటర్లకు డబ్బులిచ్చినట్లు ఎవరో సమాచారం రాసిపెట్టుకున్నట్లు తద్వారా నిబంధనలు అతిక్రమించారంటూ కేసు నమోదు చేసేందుకు రంగం సిద్ధంచేశారు. ఆ మేరకు బాపట్ల కోర్టులో మేజిస్ట్రేట్ అనుమతి కోరగా సహజంగానే కోర్టు కేసు నమోదుకు అనుమతించింది. ఈ అంశంలో నేరుగా ఏలూరికి ఎలాంటి సంబంధం లేకపోయినా కేసు నమోదు చేసి అటు వ్యాపారాలను దిగ్బంధం చేయటం ఇటు ఆయనను జైలుపాలు చేసి భయపెట్టడం లక్ష్యంగా ప్రభుత్వం పోలీసు, ఆదాయపన్ను శాఖలను ముందుకు నడుపుతోంది. కోర్టు అనుమతితో సోమవారం రాత్రికే కేసు నమోదు చేసి మంగళ బుధవారాల్లో అరెస్టుకి సిద్ధమవుతున్నట్లు సమాచారం. అయితే ఇది పూర్తిగా అక్రమ కేసని తెలిసిన ఏలూరి ధైర్యంగా న్యాయబద్ధంగా కేసును ఎదుర్కొనేందుకు సిద్ధపడినట్లు సమాచారం. టీడీపీ అధిష్ఠానం కూడా ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంది. నియోజకవర్గంలో సమాచారం తెలుసుకున్న సామాన్య ప్రజలు కూడా జగన్ తరహా కుట్ర రాజకీయాలపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం నియోజకవర్గంలో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా పర్యటించనున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే అయిన ఏలూరిపై ప్రభుత్వం పన్నిన కుట్ర ఏ రూపు దాలుస్తుందనేది వేచి చూడాలి.

వెలిగొండపై మభ్యపెడుతున్న వైసీపీ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 29: వెలిగొండ ప్రాజెక్టుపై రైతులను వైసీపీ ప్రభుత్వం మభ్యపెడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సోమవారం జరిగిన ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు సొరంగాలు పూర్తిచేసేందుకు 18 ఏళ్లు పట్టిందన్నారు. దీనికి సిగ్గుపడకపోగా ఇప్పుడు నీళ్లు లేకుండానే ఏదో సాధించామంటూ గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికి అప్రోచ్ చానళ్లు పూర్తి కాలేదన్నారు. పునరావాసం పట్టించుకున్న పరిస్థితి లేకుండా పోయిందన్నారు. పునరావాసం కల్పించకుండా నీళ్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. రైతులను గ్రామాల నుంచి ఖాళీ చేయించకుండా నీళ్లివ్వడం సాధ్యమేనా? అని నిలదీశారు. ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాల కోసం రైతులను, ప్రజలను మభ్యపెట్టేందుకు ఈ ప్రచారాలు సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వెలిగొండ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో అవసరమైన నిధులు కేటాయించి అన్ని పనులు పూర్తి చేశాకే నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు పాల్గొన్నారు.

రోజుకో రగడ..!

అధికార వైసీపీలో అభ్యర్థుల రగడ ఇంకా కొలిక్కిరాలేదు. గిద్దలూరులో ఎమ్మెల్యే అన్నా రాంబాబు కేంద్రంగా ద్వితీయస్థాయి నాయకుల్లో జగడం ప్రారంభం కాగా నియోజకవర్గాన్ని వీడేందుకు మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి సిద్ధం కాలేదు. కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ మరోచోట అవకాశం కోసం సోమవారం కూడా సీఎంఓ చుట్టూ ప్రదక్షిణలు చేశారు. విజయసాయి నుంచి వచ్చిన సమాచారంతో జిల్లాలో ఆ పార్టీ నేత, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సోమవారం సాయంత్రానికి తాడేపల్లి చేరారు. అప్పటికే అటు జగన్ ఇటు విజయసాయిలు వేరే కార్యక్రమాలకు వెళ్లటంతో వెనుదిరిగారు. మంగళవారం ఉమ్మడి జిల్లాలోని ఒంగోలు లోక్‌సభ, గిద్దలూరు, మార్కాపురం, కందుకూరు, పర్చూరు అసెంబ్లీలపై అధిష్ఠానం చర్చించి తుది నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

- గిద్దలూరులో రాంబాబు రచ్చ
- ఆయనకు మద్దతుగా అనుచరుల కార్యక్రమాలు
- కొమరోలులో సమావేశం, బీపేటలో ర్యాలీ
- తాడేపల్లి చేరిన బాలినేని
- నేడు మిగిలిన స్థానాల అంశం కొలిక్కి వచ్చే అవకాశం
- మళ్లీ సీఎంఓకు వెళ్లిన బుర్రా
- పర్చూరు నుంచి పోటీచేస్తానని చెప్పిన గొట్టిపాటి భరత్



బీపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న శ్రేణులు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గిద్దలూరు నియోజకవర్గ అధికార పార్టీలో అభ్యర్థి రచ్చ నెలకొంది. స్థానికేతర నాయకులను పంపవద్దు అంటూనే మాజీ మంత్రి బాలినేనిని పంపితే మాకు ఓకే అని ఆ నియోజకవర్గంలోని కొందరు వైసీపీ ప్రజాప్రతినిధులు ప్రకటించిన నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే అన్నా రాంబాబు అనుచరులు బహిర్గతమయ్యారు. రాంబాబుని స్థానికేతరుడని ఆ నాయకులు ఎలా అంటారు, ఆయన స్థానికుడే ఆయనకే టికెట్ ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరుతూ కొమరోలు, బేస్తవారపేట మండలాలకు చెందిన కొందరు నాయకులు సోమవారం మీడియా సమావేశం పెట్టి బహిరంగ ప్రకటనలు చేశారు. బేస్తవారపేటలో అయితే రాంబాబు మద్దతుదారులు ప్రదర్శన కూడా చేశారు. దీంతో అసలు పోటీచేయనని ప్రకటించిన ఎమ్మెల్యే రాంబాబు తిరిగి పోటీకి సిద్ధమయ్యాడన్న విషయం తేటతెల్లమైంది. శనివారం నాటికి ఆయన మార్కాపురం నుంచి పోటీకి సిద్ధపడినట్లు సమాచారం. కుమారుడు కృష్ణచైతన్య వత్తిడితో ఆయన తిరిగి అధిష్ఠానంతో చర్చలకు వెళ్లినట్లు కూడా సమాచారం.

రాంబాబు స్థానికుడే

అన్నా రాంబాబు కుమారుడు చైతన్య రాజకీయాల నుంచి వైదొలగకూడదని భావించి అవసరమైతే తాను పోటీకి సిద్ధమని కూడా చెప్పినట్లు తెలుస్తోంది. అందుకనుగుణంగా మార్కాపురం టికెట్‌కు సిద్ధమన్న సంకేతం ఇచ్చారు. దీంతో వారికి మార్కాపురం కేటాయించి ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని గిద్దలూరు పంపాలని అధిష్ఠానం భావించింది. అయితే అందుకు నాగార్జునరెడ్డి ససేమిరా అనటంతో తాత్కాలికంగా ఆ ఆలోచనను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని కొందరు నాయకులు మీడియా ముందుకు వచ్చి స్థానికేతరులు వద్దనటాన్ని సోమవారం రాంబాబు వర్గీయులు వ్యతిరేకించారు. రాంబాబు స్థానికుడే అని చెప్పటంతోపాటు ఆయనకే గిద్దలూరు టికెట్ ఇవ్వాలని కూడా కోరారు. దీంతో రాంబాబు లేక ఆయన కుమారుడు మార్కాపురం కాకుంటే గిద్దలూరు నుంచి అయినా పోటీకి సిద్ధంగా ఉన్నారా? అన్న అనుమానాలు పెరిగాయి. నియోజకవర్గంలోని కిందిస్థాయి నాయకులు ఇలా విడివిడి ప్రకటనలు గ్రూపు వ్యవహారాలతో వైసీపీలో ముఠాల హోరు పెరిగిపోయింది.

తాడేపల్లికి వెళ్లిన బాలినేని

ఈ నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం బాలినేనిని తాడేపల్లికి పిలిచింది. ఒంగోలు లోక్‌సభతో పాటు మిగిలిన అసెంబ్లీల అభ్యర్థుల ఎంపికపై ఆయనతో మాట్లాడేందుకే పిలిచారు. ప్రధానంగా ఆదివారం గిద్దలూరులోని స్థానిక నాయకులు స్థానికేతరులకు ఈసారి టికెట్ వద్దంటూనే బాలినేని అయితే ఒకే అని చెప్పటాన్ని కూడా అధిష్ఠానంలోని నాయకులు పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిసింది. ఒంగోలులో పోటీకి బాలినేని సిద్ధమైనప్పటికీ ఆయన కుమారుడికి లోక్‌సభకు పోటీకి అవకాశం ఇమ్మని గతంలోనే అడిగి ఉన్నారు. కానిపక్షంలో కుమారుడిని గిద్దలూరు నుంచి అయినా రంగంలోకి దింపే ఉద్దేశం బాలినేనికి ఉందా అన్న అనుమానాలు చాలామందికి లేకపోలేదు. ఈ విషయంపై కూడా అధిష్ఠానం బాలినేనితో స్పష్టంగా మాట్లాడే అవకాశం కనిపిస్తోంది. సోమవారం మధ్యాహ్నానికల్లా విజయవాడ రావాలని విజయసాయి సూచించగా సాయంత్రానికి బాలినేని అక్కడికి చేరారు. దీంతో విజయసాయి చిలకలూరిపేటలో ఓ కార్యక్రమానికి వెళ్లిపోగా సీఎం జగన్ కూడా ఆ సమయానికి ఇంట్లో కెళ్లి సీఎంఓ అధికారులతో ప్రత్యేక కసరత్తులో మునిగిపోయారు. దీంతో బాలినేని మంగళవారం అధిష్ఠానం నాయకులతోను సీఎంతోను కలిసేందుకు అక్కడే వేచి ఉన్నారు. ఒంగోలు లోక్‌సభ నుంచి చెవిరెడ్డిని రంగంలోకి దింపాలని అధిష్ఠానం భావిస్తున్నందున ఆ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్న బాలినేని ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడనేది చూడాల్సి ఉంది. చెవిరెడ్డికి, అతని కుమారుడికి అవకాశం ఇచ్చినట్లే తన కుమారుడికి కూడా అవకాశం ఇవ్వాలని బాలినేని పట్టుబట్టే అవకాశం లేకపోలేదు. కాగా కనిగిరి నుంచి తిరిగి తనకే టికెట్ ఇవ్వాలని కోరుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ సోమవారం కూడా సీఎంఓలో ప్రత్యక్షమయ్యారు. కనిగిరి కాకుంటే కందుకూరు నుంచైనా పోటీచేయాలన్న ఉద్దేశంతో ఆయన ఉన్నట్లు తెలిసింది. మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మాత్రం సోమవారం సీఎంను కలిసేందుకు వెళ్లకపోవటం కూడా చర్చనీయాంశం. మార్కాపురాన్ని వీడకూడదన్న దృఢ నిర్ణయంతో ఆయన, ఆయన కుటుంబం ఉన్నట్లు తెలుస్తోంది.

పర్చూరు పోటీకి సిద్ధం: భరత్

కాగా పర్చూరు అసెంబ్లీ నుంచి పోటీకి తాను సిద్ధమని దివంగత మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి నరసయ్య కుమారుడు భరత్ సీఎం జగన్‌కు సంకేతం పంపారు. రెండురోజుల క్రితం జగన్ అతన్ని పిలిపించుకుని మీరు పోటీకి సిద్ధమేనా, ఎంతమేర ఆర్థిక వనరులు సమకూర్చుకోగలరని అడగటం తెలిసిందే. అన్ని పరిశీలించుకుని సోమవారం చెబుతానని సమాధానమిచ్చిన భరత్ ఆ మేరకు సోమవారం తాడేపల్లి వెళ్లి తాను పోటీకి సిద్ధమని సంకేతం ఇచ్చినట్లు తెలిసింది. కాగా మరోవైపు పర్చూరు వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్న ఆమంచి కృష్ణమోహన్ ఆదివారం నాడు మరోసారి చీరాలలోని ఆయన ముఖ్య అనుచరులతో ప్రత్యేకంగా భేటీ అయినట్లు సమాచారం. అదేసమయంలో రెండురోజుల క్రితం ఆయన కూడా విజయసాయిని కలిసి తాను పర్చూరు నుంచి పోటీకి దూరం కానని చీరాల విషయంలో తాను చేసిన ప్రతిపాదననే పరిగణనలోకి తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. దీంతో మంగళ, బుధవారాల్లో పర్చూరు విషయంపై కూడా అధిష్ఠానం ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం లేకపోలేదు.

ఇదేందిది.. ఇదెప్పుడూ చూడలా!

- వైసీపీ కార్యకర్తలకే ఆ పార్టీ కండువాలు!
- మంత్రి సురేష్ సమక్షంలో తంతు
- టీడీపీకి చెందిన 20 కుటుంబాలు చేరినట్లు ప్రచారం
- ఖండించిన టీడీపీ నేతలు
- అధికార పార్టీలో చర్చ



మంత్రి సమక్షంలో వైసీపీలో చేరిన ఆ పార్టీ కార్యకర్తలు (వృత్తంలో వైసీపీ వార్డుసభ్యుని భర్త)

సింగరాయకొండ, జనవరి 29 : వైసీపీకి చెందిన వారినే అధికార పార్టీ నేతలు ఒంగోలులోని మంత్రి సురేష్ కార్యాలయానికి తీసుకెళ్లి ఆయన చేత పార్టీ కండువాలు కప్పించారు. టీడీపీకి చెందిన వార్డు సభ్యుడు, 20 కుటుంబాలు వైసీపీ తీర్థంపుచ్చుకున్నట్లు సోమవారం ప్రకటించారు. వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టి నవ్వులపాలయ్యారు. మంత్రి సమక్షంలో జరిగిన చేరికల ఫొటోను చూసి అటు టీడీపీ, ఇటు వైసీపీ నేతలు విస్తుపోయారు. వైసీపీకి చెందిన వారికే కండువాలు కప్పి టీడీపీ వారు పార్టీలో చేరారని చెప్పడాన్ని తెలుగుదేశం నేతలు ఖండించారు. సోమవారం రాత్రి స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆపార్టీ నేతలు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని ఊళ్లపాలెం పంచాయతీలో టీడీపీ మద్దతు వార్డు సభ్యులుగా ఆరుగురు గెలిచారని తెలిపారు. వారంతా పార్టీలోనే కొనసాగుతున్నారన్నారు. వైసీపీ మద్దతుతో 11వ వార్డు సభ్యురాలిగా గొల్లపోతు ఈశ్వరమ్మ గెలుపొందారని చెప్పారు. అయితే సోమవారం వైసీపీకి చెందిన ఈశ్వరమ్మ భర్త గొల్లపోతు శ్రీనివాసులు, ఆపార్టీకి చెందిన కొంత మంది కార్యకర్తలకు మంత్రి సురేష్ చేత కండువాలు వేయించి టీడీపీ వారు చేరినట్లు ప్రకటనలు ఇవ్వడం సిగ్గుచేటని మండిపడ్డారు. మండలంలో నెలరోజుల నుంచి వైసీపీను వీడి టీడీపీ గూటికి జోరుగా వలసలు వస్తున్నందున ఏంచేయాలో పాలుపోక అధికారపార్టీ నేతలు సొంత పార్టీ కార్యకర్తలకే కండువాలు కప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇలాంటి చౌకబారు రాజకీయాన్ని మానుకోవాలని హితవుపలికారు. విలేకరుల సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు కూనపరెడ్డి సుబ్బారావు, మించల బ్రహ్మయ్య, బ్రహ్మేశ్వరరావు, ఊళ్లపాలెం మాజీ సర్పంచ్ బాయిరెడ్డి మురళి, నూతలపాటి కృష్ణచైతన్య, కొక్కిలగడ్డ శ్రీనివాసులు, కావూరి శ్రీను పాల్గొన్నారు.

టీడీపీలో కొనసాగుతున్న చేరికలు

- తురకపల్లిలో వైసీపీని వీడిన కుటుంబాలు
- విజయానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర విజ్ఞప్తి



వైసీపీని వీడి టీడీపీలో చేరిన సీతారాంపురం వాసులను

కనిగిరి, జనవరి 29: టీడీపీలోకి చేరికల పర్వం కొనసాగుతూనే ఉంది. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర క్యాంప్ క్యాంపు నివాసంలో సోమవారం హనుమంతుపాడు మండలంలోని సీ తారాంపురం గ్రామానికి చెందిన 30 కుటుం బాలవారు వైసీపీని వీడారు. వారంతా సానికొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్టీఆర్) ఆధ్వర్యంలో టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఉగ్ర వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కనిగిరిలో తెలుగుదేశం పార్టీ అత్యధిక మెజార్టీతో గెలుపొందేలా కృషి చేయాలని వారికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కనిగిరిలో భారీ మెజార్టీ వచ్చేలా పనిచేయాలని కోరారు. ఇంటింటికీ తిరుగుతూ ఆయా గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి టీడీపీ చేపట్టబోయే చర్యలను, అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా టీడీపీ గెలుపుతోనే కనిగిరి అభివృద్ధి సాధ్యపడుతుందని, వెలుగొం డ జలాలు కనిగిరి ప్రాంతంలోని అన్ని మండలాలకు రప్పించేలా అధినేత చంద్రబాబు చర్యలు తీసుకుంటారని ప్రజలకు చెప్పాల న్నారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి సముచి త స్థానం కల్పించడంతో పాటు పాత వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ పాత, కొత్త తేడా లేకుండా కలసి కట్టుగా పార్టీ గెలుపుకు సైనికుల్లా పని చేయాలన్నారు. వైసీపీని వీడి నూనె నారాయణయాదవ్ నేతృత్వం లో పార్టీలో చేరిన వారిలో నల్లబోతుల బాలు, పీవీ లక్ష్మణ్, ఎస్ అబ్దుల్ రహిమాన్, విలియ మ్స్, బీ ప్రవీణ్, కే గురుకృష్ణ, బీ రమేష్, జుటికె విక్కీ, ఎస్‌కే రఫీ, అజయ్‌ప్రవీణ్, సీతారాంపురం గ్రామస్థులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఒంగోలు జాతి గిత్తల బల ప్రదర్శన

కురిచేడు, జనవరి 29: కురిచేడు మండలం పొట్లపాడు గ్రామంలో గుత్తికొం డ రామయోగిస్వామి 113వ తిరునాళ్ల సందర్భంగా రాష్ట్ర స్థాయి ఒంగోలు జా తి గిత్తల బల ప్రదర్శన పోటీలు సోమవారం కోలాహలంగా జరిగాయి. సోమవారం 4 పళ్ల విభాగంలో పోటీలు జరిగాయి. మొత్తం 14 జతలు పోటీలో పా ల్గొన్నాయి. ప్రథమ బహుమతిని చిలకలూరిపేట సమీపంలోని పురుషోత్తపట్నానికి చెందిన షేక్ అబ్దుల్ సత్తార్ ఎడ్ల జత 4331 అడుగులు లాగి గెలుచుకున్నాయి. వారికి రూ.40వేల బహుమతి అందజేశారు. ద్వితీయ బహుమతిని నంద్యాల జిల్లా కొణిదెల గ్రామానికి చెందిన డి.నరసింహారావు ఎడ్ల జత 4200 అడుగులు లాగి గెలుచుకున్నాయి. వారికి రూ.30 వేలు బహుమతిని అందజేశారు. తృతీయ స్థానంలో గుంటూరు జిల్లా తుళ్లూరుకు చెందిన మోదుగుల రామిరెడ్డి ఎడ్లజత 4085 లాగి గెలుచుకున్నాయి. వారికి రూ.25వేలు అందజేశా రు. ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన చూడటానికి ప్రజలు ఎక్కువగా తరలి వచ్చారు. కార్యక్రమంలో ఆలయం ధర్మకర్త నుసుం గోవిందరెడ్డి పాల్గొన్నారు. గ్రామస్థులకు, పోటీలో పాల్గొన్న వారికి చీమకుర్తికి చెందిన గ్రానైట్ వ్యాపారి నుసుం గోవింద రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు పాతపాడు, కేవీపల్లి విద్యార్థులు

కనిగిరి, జనవరి 29: 67వ జాతీయస్థాయి ఖో-ఖో పోటీలకు మండలంలోని కంచర్లవారిపల్లి, పాతపాడు హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ కాశీవిశ్వనాథరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31నుంచి వచ్చే నెల 4వరకు ఝార్ఖండ్‌లోని రాంచీ లో జరిగే జాతీయస్థాయి అండర్ - 14 స్కూల్ గేమ్స్‌కు ఎంపికైనారు. గత పది రోజులుగా జిల్లా సాధికారిత సంస్థ నందు చిత్తూరులో జరిగిన శిక్షణా శిబిరం నందు పాల్గొని రాంచీలో జరిగే జాతీయస్థాయిలో జరిగే ఆంధ్రప్రదేశ్ ఖో-ఖో బాలురుజట్టులో కేవిపల్లి హైస్కూల్‌కు చెందిన తమ్మినేని మనోజ్‌రెడ్డి, బాలికల జట్టులో రేగలగడ్డ గురవమ్మలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వనజ, కేవిపల్లి, పాతపాడు హైస్కూల్ హెచ్‌ఎం లు విజయభాస్కర్‌రెడ్డి, బీ ఇందిరా, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, పీఈటీలు పాల్గొన్నారు.

పేదల పేరుతో 'పెద్ద' కబ్జా..!

- ప్రభుత్వ భూమిలో ప్రైవేటు వ్యక్తులు పాగా
- ప్లాట్లు వేసి ఇతరులకు విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



వాగుపోరంబోకులో యథేచ్ఛగా పనులు

ఒంగోలు(క్రైం), జనవరి 29 : పేదల స్థలాల ముసుగులో ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేస్తున్నారు. ఆ ప్రాంతానికి చెందిన అధికారపార్టీ కీలక నేత అండదండలతో యథేచ్ఛగా ప్రైవేటు వ్యక్తులు పాగా వేస్తున్నారు. కర్నూలు రోడ్డుకు సమీపంలో ఉండటం, ఒకవైపు పెద్ద ఇంజనీరింగ్ కళాశాల, మరోవైపు దగ్గర్లోనే ప్రైవేటు వెంచర్లు ఉండటంతో ఆ భూమిపై వారి కన్నుపడింది. బహిరంగంగానే భారీ యంత్రాలతో చదును చేసి ప్లాట్లు వేసి అమ్మేస్తున్నారు. పైకి మాత్రం ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నా కబ్జా చేసి అమ్మేసుకునే అనవాయితీ ఉన్న సంతనూతలపాడులో ఇలాంటివి సర్వసాధారణం అంటు రెవెన్యూ అధికారులు సైతం దాటవేత ధోరణిని అవలంబించడం విస్తుగొలిపే అంశం. వివరాల్లోకి వెళితే.. సంతనూతలపాడు మండలం ఎండ్లూరు డొంక సమీపంలో ఉన్న 393 సర్వే నంబరులో సుమారు ఎకరా వాగు పోరంబోకు భూమి ఉంది. ఆ పక్కనే సర్వే నంబరు 392లో సుమారు 185 మంది పేదలకు ఇళ్లస్థలాలు మంజురు చేసి ఇంతవరకు వారికి భూమి(పొజిషన్) చూపించలేదు. అయితే అక్కడ పట్టాలు పొందిన వారు మాత్రం ఇళ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు. అక్కడ మౌలిక వసతులు లేవని వారు అనేకమార్లు మండల కార్యాలయం వద్ద ఆందోళన చేసిన పరిస్థితి ఉంది.

అయితే తాజాగా సర్వే నంబరు 393లోని వాగు పోరంబోకులో ఎక్స్‌కవేటర్లు పెట్టి కొంతమంది ప్రైవేటు వ్యక్తులు జంగిల్ క్లియరెన్స్‌తో పాటు చదును పనులు చేయిస్తున్నారు. ఇదేమిటని రెవెన్యూ అధికారులు ప్రశ్నిస్తే, ఈ భూమి పేదల నివేశన స్థలాల కోసం చదును చేస్తున్నామని వారు ధైర్యంగా చెప్పడం ఆశ్చర్యం కలిగించే అంశం. ప్రభుత్వ భూమిలో నివేశన స్థలాలు ఇవ్వాలంటే లబ్ధిదారుల జాబితాను రెవెన్యూ అధికారులు గ్రామసభల ద్వారా తయారు చేయాలి. ఆ తరువాత భూమిని చదును చేసి ప్లాట్లు వేసి లబ్ధిదారులకు ఇవ్వాలి. అలాంటిదేమీ లేకుండా అధికార పార్టీ నాయకుల అండదండలతో ప్రైవేటు వ్యక్తులు భూమిని గత రెండురోజులుగా చదును చేయిస్తున్నారు. అంతేకాదు అక్కడ స్థలం కావాలంటే రూ.2లక్షలకుపైనే ఇవ్వాలని సదరు వ్యక్తులు పేదలను డిమాండ్ చేయడం గమనార్హం. పేదలకు నివేశన స్థలాలంటూ మాయమాటలు చెప్పి నమ్మించి ప్లాట్లు వేసి ఇప్పటికే కొందరికి విక్రయాలు చేయడం వెనుక అధికార పార్టీ నాయకుల అండ ఉందనే ప్రచారం జరుగుతోంది. అంతేకాదు నేరుగా భూమి మీద ప్లాట్లుగా విభజించేందుకు కర్రలు పాతి డబ్బులిచ్చిన వారికి పొజిషన్ చూపిస్తున్నారు. రెండు రోజులుగా భూమిని చదును చేసేందుకు రెండు ఎక్స్‌కవేటర్లు, డోజర్లు ఏర్పాటు చేసి అక్కడ ఉన్న చెట్లను తొలిగించి, మట్టితో గుంతలను పూడ్చారు.

చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

వాగు పోరంబోకు భూమిలో ప్రైవేటు వ్యక్తులు తమ సొంతభూమి అన్నట్లుగా ప్లాట్లు వేసి విక్రయిస్తుంటే రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఆ ప్రాంత ప్రజలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసే వరకు వారు అటువైపు తొంగిచూడక పోవడం చర్చనీయంశంగా మారింది. అంతేకాదు పేర్నమిట్ట వీఆర్వో ఒకరు తన పరిధిలోకి రాదంటు ఫిర్యాదు చేసిన వారికి సమాధానం ఇచ్చారు. అయితే ఎట్టకేలకు రెండు రోజుల తరువాత తహసీల్దార్ ఆదేశాల మేరకు అదే వీఆర్వో సోమవారం అక్కడకు వెళ్లి చదును చేస్తున్న వారిని హెచ్చరించి పనులను నిలిపివేశారు. కానీ ఎవరు చదును చేయిస్తున్నారు, వారికి ఎలాంటి అధికారం ఉందనే విషయం ఏ అధికారి అడగలేని పరిస్థితి. ప్రభుత్వ భూములను కబ్జా చేసే వారిపి కేసులు నమోదు చేయాల్సి ఉన్నా, అలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రెవెన్యూ అధికారులపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బలరాం

దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం

» ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

చీరాల, జనవరి 29: నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి చెప్పారు. అందుకు ఊటుకూరివారి వీధి విస్తరణ, నూతన సీసీ నిర్మాణం నిదర్శనమని అన్నారు. స్థానిక కొట్లబజారు నుంచి నల్లగాంధీ బొమ్మకు వెళ్లే ఊటుకూరివారి వీధిలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సీసీ రోడ్డును సోమవారం బలరాం ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే బలరాం మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు ఎప్పుడు అండగా ఉంటామన్నారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పురప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు.

కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, గుంటూరు మాధవరావు, మల్లెల లలితరాజశేఖర్, గుంటూరు ప్రభాకరావు, మామిడాల రాములు, కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, కంపా అరుణ్, చిలుకోటి శ్రీనివాసరావు, చిన్ని లీలాధర్, మాగం మురళి, తులాబందు వెంకటసురేష్, శ్రీరామ్ వేణుగోపాల్, షేక్ మహిమూద్, కళ్యాణం విజయ్‌ప్రకాష్, రియాజ్, మున్సిపల్ డీఈ ఏసయ్య పాల్గొన్నారు.

'ఆసరా'ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేష్

చీరాల, జనవరి 29: ఆసరా సొమ్మును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. స్థానిక ఎస్‌ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలోని ఓపెన్ ఎయిర్ థియేటర్లో సోమవారం జరిగిన ఆసరా నాలుగో విడత సంబరాలకు వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో 957 స్వయం సహాయక సంఘాలకు రూ.6.49 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. సీఎం జగన్ పేదల పక్షపాతి అనేందుకు ఇది నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సీఎంఎం సుబ్రమణ్యం, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, నాయకులు కొండ్రు బాబ్జి, గుంటూరు మాధవరావు, మల్లెల లలితరాజశేఖర్, గవిని శ్రీనివాసరావు, పలువురు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై జాగ్రత్తలు తీసుకోవాలి



మేదరమెట్లలో టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న సుబ్బారాయుడు

మేదరమెట్ల, జనవరి 29: ఓటర్ల జాబితాపై నిరంతరం నిఘా ఉంచి అర్హులైన ఓటర్లను తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలుగుదేశం నాయకులకు శిక్షణ ఇస్తున్న కొల్లా సుబ్బారాయుడు తెలిపారు. సోమవారం మండలంలోని మేదరమెట్ల, పమిడిపాడు గ్రామాల్లో పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. చంద్రబాబు ప్రకటించిన ఆరు హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనర్హుల ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఇంటింటికి తిరిగి బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ అంశాలను ప్రచారం చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బూత్‌వారీగా, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై స్పష్టమైన అవగాహనతో గ్రామ నాయకులు ఉండాలన్నారు.

కార్యక్రమంలో మేదరమెట్ల శ్రీనివాసరావు, మన్నే ప్రసాద్, జాగర్లమూడి జయకృష్ణ, నాదెండ్ల కోటేశ్వరరావు, జాగర్లమూడి వీరాంజనేయులు, మందా నాగేశ్వరరావు, చింతా సుబ్బారావు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవి మద్దతు కోరిన హనిమిరెడ్డి



హనిమిరెడ్డిని సన్మానిస్తున్న శ్రీదేవి

మేదరమెట్ల, జనవరి 29: మాజీ ఎమ్మెల్యే జాగర్లమూడి రాఘవరావు కుమార్తె విక్రం శ్రీదేవిని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పానెం చిన్నహనిమిరెడ్డి కలిసి మద్దతు కోరారు. సోమవారం కొరిశపాడు మండలం పమిడిపాడులోని శ్రీదేవి ఇంటికి వెళ్లి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. గతంలో శ్రీదేవితోపాటు మరికొందరిని వైసీపీ సస్పెండ్ చేసింది. హనిమిరెడ్డి ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించాక శ్రీదేవితో పాటు మిగతా నేతలపై కూడా సస్పెన్షన్‌ను ఎత్తివేయించారు. ఈనేపథ్యంలో శ్రీదేవిని కలిసి పార్టీ పటిష్టతకు పనిచేయాలని ఆయన కోరారు. ఆయన వెంట కరణం సుబ్బయ్య, జాగర్లమూడి యలమందరావు, పాలపర్తి చిట్టి, తదితరులు ఉన్నారు.

పశువుల రక్షణకు చట్టాలు

ఒంగోలు(రూరల్)జనవరి 29: మానవుల రక్షణకు ఎలాంటి చట్టాలు ఉన్నాయో పశువుల రక్షణకు అలాంటి చట్టాలు ఉన్నాయని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె .బేబిరాణి అన్నారు. మండలంలోని కరవది జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పశు సంక్షేమ పక్షోత్సవాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మానవులు ఎలా జీవిస్తున్నారో అలాగా పశువులు, పక్షులు స్వేచ్ఛగా జీవించాలన్నారు. పశువులను, పక్షులను హింసిస్తే నేరమవుతుందన్న విషయాన్ని విద్యార్థులు తెలుసుకోవాలన్నారు . కుక్కలు వీధులలో ఉన్నప్పటికి వాటిని చంపటం నిషేధమన్నారు. అనంతరం పశువుల రక్షణ పై విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు అధికారిని బహుమతులు అందచేశారు.ఈకార్యక్రమంలో త్రోవగుంట పశువైద్యశాల ఏడీ డాక్టర్ బి. బసవశంకరరావు, ఉలిచి పశువైద్యాధికారి డాక్టర్ ప్రతిమ, పశువైద్య అధికారి కాట్రగడ్డ లక్ష్మయ్య , కరవది సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం, ఎన్‌వీ రవికుమార్ ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం

ఒంగోలు(విద్య), జనవరి 29: జిల్లాలోని ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లు తమ పీఎఫ్ సమస్యలను తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని పీఎఫ్ కమిషనర్ సతీష్‌కుమార్ తెలిపారు. ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పీడీసీసీ బ్యాంకు కేంద్ర కార్యాలయ సమావేశపు హాలులో నిర్వహించిన నిధి ఆప్‌కే నికిత ప్రథమ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఎస్. శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ కార్మికులకు నిధి ఆప్‌కే నికిత ఎంతో ప్రయోజనకరమన్నారు. పీఎఫ్ నోడల్ అధికారి సమ్మయ్య మాట్లాడుతూ నిధి ఆప్‌కి నికిత ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా మొదటి వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్ల పీఎఫ్ సమస్యలను త్వరగా పరిష్కరించుకునే పద్ధతులను వివరించారు. పీడీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్ రాఘవయ్య మాట్లాడుతూ పీఎఫ్ సంస్థ అందిస్తున్న ఆన్‌లైన్ సేవలు ఎంత ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో అపుస్మా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేమాధవరావు, హనుమంతరావు, బ్యాంకు ఉద్యోగులు, వివిధ సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లు, పీఎఫ్ జిల్లా కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సమగ్ర మంచినీటి పథకం పూర్తయ్యేనా..!

» టీడీపీ హయాంలో రూ.85 కోట్లతో పనులు ప్రారంభం
» ఐదేళ్ళు గడిచినా ఇంకా సాగుతున్న వైనం
» రివర్స్ టెండరింగ్ పేరుతో కొంతకాలం కాలయాపన
» బిల్లుల చెల్లింపులు జరగక అర్ధంతరంగా నిలిపివేసిన కాంట్రాక్టర్
» అద్దంకి వాసులకు నీటి కష్టాలు ఎప్పటికి తీరేనో..!



అర్ధంతరంగా నిలిచిపోయిన ఓవర్‌హెడ్ ట్యాంక్



ఆయిల్ మిల్ రోడ్డులో పైప్‌లైన్‌లు వేసి వదిలి వేయటంతో ప్రమాదకరంగా ఉన్న సిమెంట్ దిమ్మెలు

అద్దంకి, జనవరి 29: అద్దంకి పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు వచ్చే 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019 సంవత్సరంలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక కృషితో సమగ్ర మంచినీటి పథకానికి రూ.85 కోట్లు మంజూరయ్యాయి. అప్పట్లోనే పనులు ప్రారంభించి కొంతమేర జరిగాయి. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో తమ్మవరం వద్ద ఇన్‌టేక్ వెల్ ఏర్పాటుచేసి అక్కడ నుంచి శింగరకొండ సమీపంలోని అద్దంకి కొండపై ఏర్పాటుచేసే ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నేరుగా నీరు చేరేలా పైప్‌లైన్‌లు ఏర్పాటుచేయాల్సి ఉంది. ఎన్నికలకు ముందే తమ్మవరం వద్ద నుంచి అద్దంకి వరకు పైప్‌లైన్ పనులు అత్యధిక శాతం పూర్తయ్యాయి. అద్దంకి నుంచి అద్దంకి కొండ వరకు అవసరమైన పైప్‌లైన్‌లను ఆయా ప్రాంతాలలో సిద్ధంచేసి ఉంచారు. అద్దంకి కొండ వద్ద ఏర్పాటుచేసే ట్యాంక్ నుంచి గ్రావిటీ ద్వారా పట్టణంలోని అన్ని ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు నీరు చేరేవిధంగా రూపకల్పన చేశారు. అదేసమయంలో అక్కడే ఉన్న టిడ్కో ఇళ్లకు కూడా పుష్కలంగా నీరు అందుబాటులో ఉండేవిధంగా పథకం రూపకల్పన చేశారు.

అయితే, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో రివర్స్ టెండరింగ్ పేరుతో తమ్మవరం నుంచి అద్దంకి పట్టణంలోని మార్కెట్‌యార్డు వరకే పరిమితం చేసి, అక్కడ నుంచి పట్టణంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్ లకు నీటిని పంపింగ్ చేసేలా ప్రతిపాదనలు మార్పు చేశారు. దీంతో టిడ్కో ఇళ్ళకు నీటి వసతి లేకుండా పోయింది. రివర్స్ టెండరింగ్‌లో కొత్తగా ఏర్పాటుచేసిన జగనన్న కాలనీలకు అదనంగా చేర్చారు. ఇలా సుమారు రెండు సంవత్సరాలకు పైగా సమయం గడిచిపోయింది. అనంతరం పనులు ప్రారంభమయ్యాయి. మార్కెట్‌యార్డు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎన్‌ఎస్పీ కాలనీ లలో ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణ పనులు, పట్టణంలోని అంతర్గత పైప్‌లైన్‌ల పనులు చేపట్టారు. కొంతమేర పనులు చేపట్టిన తరువాత కాంట్రాక్టర్ చేసిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపు ఆగిపోయింది. దీంతో గత ఐదారు నెలలుగా ఎక్కడి పనులు అక్కడే అసంపూర్తిగా నిలిచిపోయాయి. పట్టణంలో సీసీ రోడ్లు పగులగొట్టి పైప్‌లైన్‌లు వేయగా వాటిని అలానే వదిలివేయటంతో వాహనాల రాకపోకలకు మరింత ఇబ్బందిగా మారింది. ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోవటంతో పనులు ఇంతలో పునః ప్రారంభమయ్యే పరిస్థితి కనిపించటం లేదు. మూడు సంవత్సరాల క్రితం పూర్తి కావాల్సిన సమగ్ర మంచినీటి పథకం పనులు ఎప్పుడు పూర్తవుతాయో కూడా అర్థంకాని పరిస్థితి నెలకొందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వేసవిలో నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. పనులు పూర్తిచేసే విధంగా కృషి చేయాల్సిన అధికార పార్టీ నేతలు, మున్సిపల్ పాలక వర్గం మిన్నకుండటంతో ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అద్దంకి పట్టణ సమ గ్ర మంచినీటి పథకం పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నేనున్నానంటూ.. నిజం గెలవాలంటూ..

» నేడు బాపట్ల పార్లమెంట్ పరిధిలో నారా భువనేశ్వరి పర్యటన

పర్చూరు, జనవరి 29: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ నేపథ్యంలో కలతతో మృతి చెందిన కుటుంబాలకు భరోసా కల్పించేందుకు నేనున్నానంటూ.. నిజం గెలవాలంటూ నారా భువనేశ్వరి బాపట్ల పార్లమెంట్ పరిధిలో మంగళవారం పర్యటిస్తారని ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ రాజమహేంద్రవరంలో సత్యమేవ జయతే దీక్షలో చంద్రబాబు అక్రమ అరెస్టుతో మృతి చెందిన కుటుంబాలకు అండగా ఉంటానని భువనేశ్వరి మాట ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఆయా కుంటుంబాలకు భరోసా ఇచ్చేందుకు పర్యటిస్తున్నారన్నారు. మంగళవారం బాపట్ల పార్లమెంట్ పరిధిలో నిజం గెలవాలని కార్యక్రమాన్ని భువనేశ్వరి నిర్వహిస్తున్నారని తెలపారు. గన్నవరం ఎయిర్‌పోర్టు వద్ద ఉదయం 11.30 కు బయలుదేరి రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లికి 1.50 గంటలకు చేరుకుంటారన్నారు. అక్కడ నుంచి 2.10కి ఆరుంబాక చేరుకుంటారని, అక్కడ 40 నిమిషాలు భోజనం విరామం తీసుకుంటారన్నారు. ఆతర్వాత బాపట్ల, జమ్ములపాలెం, రేటూరు, అప్పాపురం, కాకుమాను, పెదనందిపాడు మీదుగా 4.30 గంటలకు పర్చూరు నియోజకవర్గం చిననందిపాడు చేరకుంటారన్నారు. మువ్వా సింగారావు నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెబుతారన్నారు.

5.30 గంటలకు యద్దనపూడి చేరుకుంటారన్నారు. ఆగ్రామంలో మృతి చెందిన టెక్కెం నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తారన్నారు. అనంతరం మార్టూరు మీదుగా ఒంగోలు చేరుకుంటారని ఏలూరి తెలిపారు.

టీడీపీలో చేరిన పలువురు నేతలు



ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి సంఘీభావం తెలుపుతున్న అద్దంకి పట్టణంలోని 5వ వార్డు నేతలు

అద్దంకి, జనవరి 29: అద్దంకి పట్టణంలోని 5వ వార్డుకు చెందిన పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను సోమవారం చిలకలూరిపేటలో కలిసి టీడీపీలో చేరారు. మాజీ వార్డు మెంబర్ చిలుకూరి సంధ్యారాణి అనిల్ ఆధ్వర్యంలో మౌలాలి, మల్లికార్జున, అంజయ్య, మల్లేశ్వరరావు, హఫీజ్, బాషా తదితరులు ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి తమ సంఘీభావం తెలిపారు. వినుకొండలో ఇటీవల వైసీపీ అల్లరిమూకల దాడిలో గాయపడిన మాజీ మున్సిపల్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు పఠాన్ సమీమ్‌ఖాన్‌ను సోమవారం ఎమ్మెల్యే రవికుమార్ పరామర్శించారు.

కొణిదెన వైసీపీ బీసీ నేతల చేరిక

బల్లికురవ, జనవరి 29: వైసీపీ బీసీ సామాజిక వర్గానికి చెందిన కీలక నేత, కొణిదెన గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ, మాజీ సర్పంచ్ తన్నీరు ఏడుకొండలు తన అనుచరులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను చిలకలూరిపేటలో ఆయన స్వగృహంలో కలిసి సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వారితో మాట్లాడుతూ టీడీపీ విజయానికి సమిష్టిగా కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారందరికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. కొత్త, పాత నేతలందరూ కలిసి గ్రామాలలో టీడీపీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించుకోవాలన్నారు.

అలాగే, గొర్రెపాడు గ్రామానికి చెందిన వైసీపీ నేత మక్కెన స్వాములు ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి సంఘీభావం ప్రకటిం చారు. ఎమ్మెల్యేను కలిసిన కొణిదెన బీసీ నేతల్లో వల్లపు కోటేశ్వరరావు, తన్నీరు ఆంజనేయులు, నాగేశ్వరరావు, యనమాల లక్ష్మయ్య, కుంచపు నాగేశ్వరరావు, కొండయ్య, వేమవరపు శంకర్, గుంజి పిచ్చయ్య, చట్టి పోతురాజు, సత్తి భూసి తదితరులు ఉన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రవికుమార్

సంతమాగులూరు, జనవరి 29: మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో సోమవారం టీడీపీలో చేరారు. సంతమాగులూరు మండలంలో పలుగ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటికే ఎమ్మెల్యేను కలసి సంఘీభావం ప్రకటించారు. కాగా, మండలంలోని పత్తేపురంకు చెందిన చలపతి రావు దశదిన కర్మకు ఎమ్మెల్యే రవికుమార్ హాజరై నివాళులర్పించారు. అదే గ్రామానికి చెందిన అంబటి శ్రీనివాసరావు కుమారుడు చెన్నైలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా కుటుంబసభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన దారం పెద కామాన్నయ్య ఇటీవల మృతిచెందగా వారి ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. తంగేడుమల్లికి చెందిన పెళ్ళూరి నరసింహా రోడ్డు ప్రమాదంలోగా యపడగా వారి ఇంటికి వెళ్ళి పరామర్శించారు. మిన్నెకల్లుకు చెందిన చిరుమామిళ్ళ కోటేశ్వరమ్మకు శ్రవారం మృతి చెందగా వారి కుటుంబసభ్యులను పరిమర్శించారు. గ్రామానికి చెందిన కోట సాహెబ్ ఇటీవల మృతిచెందగా వారి ఇంటికి వెళ్ళి పరామర్శించారు.

వైసీపీ పతనం ఖాయం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య



సభలో మాట్లాడుతున్న కొండయ్య

చీరాల, జనవరి 29: వైసీపీ పతనమే రాష్ట్రాభివృద్ధికి మలుపు అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. వచ్చే ఎన్నికల తరువాత వైసీపీ జెండా కనుమరుగవటం ఖాయమని చెప్పారు. సిద్ధం పేరుతో మరోసారి ప్రజలను మోసగించేందుకు సీఎం జగన్ సిద్ధమయ్యాయని అన్నారు. అయితే, ప్రజలు టీడీపీని గెలిపించుకుని చంద్రబాబును మరలా ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. అందుకు ప్రజలు ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వైసీపీని బంగాళాఖాతంలో కలిపే సమయం ఆసన్నమైందన్నారు. సీఎం జగన్ నాలుగు సంవత్సరాల 9 నెలల కాలంలో ప్రజా వ్యతిరేక పాలన సాగించారన్నారు. దీంతో ప్రజలు విసిగిపోయారని చెప్పారు. టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం రావాల్సిన ఆవశ్యతను ప్రజలు గుర్తించారన్నారు.

బంగారు భవిష్యత్‌కు బాటలు వేద్దాం

చీరాల, జనవరి 29: టీడీపీని గెలిపించుకుందాం.. బంగారు భవిష్యత్‌కు బాటలు వేద్దాం.. అందుకనుగుణంగా పార్టీ శ్రేణులు నిర్విరామంగా పనిచేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. మండలంలోని తోటవారిపాలెం పోలేరమ్మ గుడి ప్రాంగణంలో సోమవారం రాత్రి స్థానిక నేత బూదాటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొండయ్య మాట్లాడుతూ వైసీపీ అరాచక, అప్రజాస్వామిక విధానాలను బంగాళాఖాతంలో కలపాలన్నారు. అందుకు పార్టీ శ్రేణులు భావసారూప్యం ఉన్న అందరిని కలుపుకుని ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు.

కార్యక్రమంలో నాయకులు గుద్దంటి చంద్రమౌళి, ఎం.గౌరీఅమర్‌నాథ్, గంజి పురుషోత్తమ్, గజవల్లి శ్రీనివాసరావు, శ్రీరాం రమేష్, వంకా హరికృష్ణ, డేగల వెంకటేశ్వర్లు, మల్లెల వేణు, కాటం రామకృష్ణ, తాడి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 29: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కూచిపూడి శరత్‌బాబు డిమాండ్ చేశారు. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు ఆరోగ్యపరమైన సమస్యలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు ఎన్‌జీవో సంఘం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలని, 11వ పీఆర్సీ అరియర్స్ చెల్లింపుతోపాటు హెల్త్ కార్డు ద్వారా అన్నిరకాల వ్యాధులకు వైద్యచికిత్సలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాకు అధ్యక్షత వహించిన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ అంకిరెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ అనంతరం ఏమి పనిచేయలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. హె ల్త్‌కార్డు ద్వారా కేవలం కన్ను, పన్ను రోగాలు మాత్రమే చూస్తున్నారని, అన్ని రకాల వ్యాధులు చూసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో ఎన్‌జీవో సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, కొత్తపల్లి మంజేష్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కంచర్ల సుబ్బారావు, నాయకులు రామమోహన్, డేవిడ్, ఐ. విజయసారథి, పి. సుబ్బారావు, ఎంవీ కృష్ణయ్య, పీఈవీ సుబ్బారావు ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన సీఐ

బల్లికురవ, జనవరి 29: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా సంతమాగులూరు సర్కిల్ సీఐ కె.నరసింహారావు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. మండలంలోని వల్లాపల్లి, అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, కొణిదెన మల్లాయపాలెం, వేమవరం, ఉప్పుమాగులూరు, కొప్పెరపాలెం గ్రామాలలో ఉన్న పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. బూత్‌ల వద్ద ఎలాంటి చర్యలు చేపట్టాలన్న దానిపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే, ఫ్యాక్షన్ గ్రామమైన వేమవరంలో ఎన్నికల రోజున పటిష్ట చర్యలు చేపడతామని చెప్పారు. అని గ్రామాలలో నిఘా పెంచాలని సీఐ పోలీస్ సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్ఐ వి.వేమన, ఏఎస్ఐ బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ కుళాయి అందించే పనులు వేగవంతంచేయాలి

బల్లికురవ, జనవరి 29: జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి అందించే పనులు వేగవంతంగా పూర్తికావాలని ఎంపీడీవో బ్రహ్మయ్య కోరారు. సోమవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జలజీవన్ మిషన్ పనులపై పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. బల్లికురవ మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో ఇంటింటికి కుళాయి కనెక్షన్ అందించేందుకు ప్రభుత్వం ద్వారా రూ.16 కోట్లు మంజురయ్యాయని చెప్పారు. వెంటనే పనులు పూర్తి చేయాలన్నారు. ప్రతిఇంటికి తాగునీరు అందిస్తే ప్రజలు ఆరోగ్య వంతులుగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవిబాబు, ఏఈలు హనుమంతరావు, ఖాశీం, ఈవోపీఆర్డీ సుమతి, తదితరులు పాల్గొన్నారు.

దంతాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

పేరాల(చీరాలటౌన్), జనవరి 29: దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డా.అపర్ణ పేర్కొన్నారు. పేరాల అంకినీడు వారి ఆధ్వర్యంలో సోమవారం ఏఆర్‌ఎం ఉన్నత పాఠశాలలో ఉచితం దంత సంరక్షణ శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా సుమారు 300 మందికి పరీక్షలు నిర్వహించి బ్రష్, పేస్ట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాల్మన్‌రాజు, లయన్స్‌క్లబ్ ఆఫ్ అంకినీడు అధ్యక్షుడు దొంతినేని శ్రీకాంత్, శ్రీనివాస్, ఉదయభాస్కర్, కృష్ణ, సరోజ, పవని భానుచంద్రమూర్తి, రమణారావు, సుందరరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కారు.. ఒకరికి గాయాలు

మార్టూరు, జనవరి 29: మార్టూరులోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదురు జాతీయ రహదారిపై సోమవారం పాల ట్యాంకర్‌ను వెనుకనుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఈప్రమాదంలో కారులోని ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో కారు నడుపుతున్న శ్రీకాంత్ అనే వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డారు. గుంటూరు నుంచి అద్దంకికి వెళుతున్న పాల ట్యాంకరును విజయవాడ నుండి ఒంగోలుకు వెళుతున్న కారు ఢీ కొన్నది. కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతింది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మార్టూరు, జనవరి 29: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో నితిన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగే సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేటి నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

చీరాల, జనవరి 29: స్థానిక ముంతావారిసెంటర్లోని ఎన్‌వీఎస్ అండ్ ఎస్‌జేఆర్ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం నుంచి చైతన్యభారతి సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభమవుతాయని సమితి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టరు సూర్యదేవర ఉమామోహన్, భాగి నారాయణ శాస్త్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు, నగరోత్సవంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పంగులూరు, జనవరి 29: ఎన్నికల సమయం దగ్గర పడుతున్నవేళ పార్టీ నిర్దేశించిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ సీనియర్ నాయకుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ కుక్కపల్లి ఏడుకొండలు అన్నారు. టీడీపీ క్లస్టర్ సమావేశాలు మండలంలోని ముప్పవరం గ్రామంలో సోమవారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఏడుకొండలు మాట్లాడుతూ బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం అన్ని గ్రామాలలో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వైసీపీ అరాచక పాలనలో ప్రజలకు జరుగుతున్న నష్టాలను వివరించాలన్నారు. బూత్ కమిటీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీడీపీ ఇన్‌చార్జ్ రమేష్, వరపర్ల సుబ్బారావు, జగన్మోహన్, అల్లంనేని స్వామి, అశోక్, మురకొండ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

జలజీవన సంఘాలను ఏర్పాటుచేయాలి

పంగులూరు, జనవరి 29: జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టే పనుల నిర్వహణకు గ్రామాలలో జలజీవన సంఘాలను త్వరితగతిన ఏర్పాటుచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ శివయ్య కోరారు. సోమవారం పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జల జీవన్‌మిషన్ జల కమిటీల ఏర్పాటుకు సంబంధించిన మార్గదర్శకాలపై పలు సూచనలు చేశారు. 11 మంది సభ్యులతో కూడిన కమిటీలో 9 మందిని డ్వాక్రా సంఘాల నుంచి ఎన్నుకోవాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శితో పాటు ఇంజనీరింగ్ అసిస్టెంట్ సభ్యులుగా ఉంటారని తెలిపారు. మండలంలో 25 పనులకు రూ.1498.89 లక్షల నిధులు మంజూరయినట్లు చెప్పారు. ఈ పనులకు సంబంధించి మెటీరియల్ మొత్తం ప్రభుత్వం సరఫరా చేస్తుందని తెలిపారు. కమ్యూనిటీ కాంట్రాక్ట్ కమిటీ నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రాంబాబు, కార్యాలయ సూపరింటెండెంట్ రమేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు వెలుగు ప్రతినిధి భాస్కరమ్మ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చీరాలటౌన్, జనవరి 29: ప్రతిఒక్కరూ విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చీరాల వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు పేర్కొన్నారు. సెల్‌ఫోన్‌లు పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదుచేసిన ఎనిమిదిమంది యజమానుల ఫోన్‌లను సాంకేతిక సాయంతో గుర్తించి సోమవారం అప్పగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు ఖరీదు కలిగిన ఫోన్‌లను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో వాటిని జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. ఎవరైనా వస్తువులను పోగొట్టుకొన్నట్లయితే సరైన పత్రాలతో స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై సుబ్బారావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

10న నవోదయ ప్రవేశపరీక్ష

ఒంగోలు(విద్య), జనవరి 29 :స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరంలో 9,11 తరగతుల్లో ప్రవేశానికి వచ్చేనెల 10న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే రామిరెడ్డి తెలిపారు. ప్రవేశపరీక్షకు సంబంధించి హాల్ టిక్కెట్లు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు ఆసర్వీసు సెంటర్ల ద్వారానే హాల్ టిక్కెట్లుపొందాలన్నారు. జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కార్యాలయంలో దరఖాస్తు చేసిన వారు ప్రిన్సిపాల్ కార్యాలయంలోనే హాల్ టిక్కెట్లు పొందాలన్నారు. ఈనెల 30నుంచి వచ్చేనెల 6 వరకు ప్రిన్సిపాల్ కార్యాలయంలో పనిదినాల్లో ఉదయం 10 నుం చి సాయంత్రం ఐదుగంటల వరకు దరఖాస్తు రశీదులు సమర్పించి అభ్యర్థులు హాల్ టిక్కెట్లు పొందవచ్చని ఆయన తెలిపారు. వివరాలకు 9481837230, 8638682701 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఏకే యూనివర్శిటీ డీన్‌కు అవార్డు


ఒంగోలు(విద్య), జనవరి 29 : స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీ సీడీసీ డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి జాతీయ సమైక్యతా అవార్డును అందుకున్నారు. విజయవాడలోని లయన్స్ ఇంటర్నేషనల్, ఎక్స్‌లే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 2024 సంవత్సరానికి జాతీయ సమైక్యతా అవార్డును వెంకటేశ్వరరెడ్డికి ప్రకటించారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, కొండ వెంకటప్పయ్య, ప్రకాశం జిల్లా జాతీయ ఉద్యమత్యాగమూర్తులు వంటి రచనలు చేసినందుకు వెంకటేశ్వరెడ్డిని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మాజీమంత్రి, ఎమ్మెల్సీ డాక్టర్ డొక్కా మాణిక్యవరప్రసాద్ చేతుల మీదుగా వెంకటేశ్వరరెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. ఇప్పటి వరకు 35కు పైగా జాతీయ, అంతర్జాతీయ వ్యాసాలను ప్రచురించడంతో పాటు ఏడు జాతీయ సదస్సులను నిర్వహించారు.

ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 29: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 50వేల ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి చొప్పర సిసింద్రిబాబు ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. నాలుగేళ్ళ నుంచి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా ఇప్పుడు ఎన్నికల సమయం సమీపిస్తుండటతో ప్రభుత్వం హడావుడి చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం టెట్ లేకుండా నేరుగా డీఎస్సీ నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



సోమశిలలో 26.270 టీఎంసీల నీరు



అనంతసాగరం : సోమశిల జలాశయంలో నీటిమట్టం పడిపోతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి 26.270 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,350, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

రేపటి నుంచి

నిజం గెలవాలి

- జిల్లాలో మూడు రోజులు నారా భువనేశ్వరి పర్యటన
- మృతుల కుటుంబాలకు పరామర్శ

నెల్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి జిల్లా పర్యటన ఖరారైంది. 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా బుధవారం నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో ఆమె పర్యటించనున్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన సమయంలో తీవ్ర మనోవేదనకు గురై మృతి చెందిన వారి కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించనున్నారు. 31వ తేదీన సాయంత్రం 5:35 గంటలకు ఉలవపాడు మండలం టెంకాయచెట్లపాలెం, సాయంత్రం 6:30 గంటలకు ఉలవపాడు మండలం ఆత్మకూరులో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. అదే రోజు రాత్రి కందుకూరులో బస చేస్తారు. మరుసటి రోజు ఫిబ్రవరి 1న ఉదయం 9 గంటలకు గుడ్లూరు, 10:45 గంటలకు గుడ్లూరు మండలం దర్కానిపాడు, 12:20 గంటలకు కొండాపురం మండలం కొమ్మి గ్రామాల్లో పర్యటన అనంతరం సాయంత్రం నెల్లూరుకు చేరుకుంటారు. 3:35 గంటలకు నగరంలోని 29వ డివిజన్, 4:10 గంటలకు 41వ డివిజన్‌లో పర్యటించి అనంతరం జొన్నవాడ కామాక్షమ్మను దర్శించుకుని, నెల్లూరులో బస చేస్తారు. ఫిబ్రవరి 2వ తేదీన ఉదయం 10:20 గంటలకు అల్లీపురం, 11:35 గంటలకు కలువాయి, 2:05 గంటలకు రాపూరు మండలం శానాయపాలెం గ్రామాల్లో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు.



లక్ష్యాల సాధనకు చర్యలు

బాధ్యతల స్వీకరించిన జేసీ ఆదర్శ్ రాజేంద్రన్



కలెక్టర్‌ను కలిసిన జేసీ రాజేంద్రన్

నెల్లూరు (హరనాథపురం) : జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న రీసర్వే, స్వామిత్వ, గృహ నిర్మాణ లక్ష్యాలను సాధించడానికి చర్యలు తీసుకొంటామని నూతన జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జాయింట్ కలెక్టర్‌గా రాజేంద్రన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజేంద్రన్ మాట్లాడుతూ జిల్లాలో అందరి సహకారంతో ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కేరళలోని క్యాలికట్‌కు చెందిన రాజేంద్రన్ 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. అంతకుముందు ఆయన కలెక్టర్ హరినారాయణన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రెవెన్యూ ఉద్యోగ సంఘం నాయకులు నూతన జేసీ రాజేంద్రన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'ఆసరా'లో అవస్థలు

అక్కచెల్లెమ్మలకు జగనన్న చిక్కులు



కలిగిరిలో ఎండలోనే నిలబడి ఉన్న మహిళలు

- చెక్కుల పంపిణీ పేరుతో పొదుపు మహిళలకు చుక్కలు
- సభకు రాకుంటే పథకాలు కట్ అంటూ హుకుం
- వచ్చిన వారికి తప్పని పాట్లు
- గంటల తరబడి ఉండలేక మధ్యలోనే జంప్
- స్కూళ్ల గేట్లు మూసి అడ్డుకునే యత్నం
- తిరగబడి ఇళ్లకు..
- మరోవైపు విద్యార్థుల చదువులకూ ఆటంకం

ఆసరా

చెక్కుల పంపిణీ పేరుతో పొదుపు మహిళలకు చుక్కలు చూపిస్తున్నారు. సభకు రావాల్సిందేనంటే పట్టుబట్టి పిలిపిస్తున్న సీసీలు, వీవోఏలు వారికి సదుపాయాలు కల్పించడంలో చేతులెత్తేస్తున్నారు. చివరకు షామియానాలు, కుర్చీలు కూడా సరిగ్గా ఏర్పాటు చేయకపోవడంతో ఎండలో గంటల తరబడి నిలబడలేక మధ్యలోనే వెళ్లిపోతున్నారు. అలా వెళుతున్నవారినీ గేట్లు మూసి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. కలిగిరి, మర్రిపాడు మండలాల్లో సోమవారం ఇదే తరహా ఘటనలు జరిగాయి. 'కుర్చీల్లేవు... కూడు లేదు, కాళ్లు పీకుతున్నాయి, మేము ఇంటికెళ్లా'లంటూ మహిళలు బలవంతంగా గేటునెట్టుకొని వెళ్లిపోయారు. - కలిగిరి/మర్రిపాడు

కనిగిరి హైస్కూల్లో ఆసరా చెక్కుల పంపిణీ సభ మధ్యాహ్నం మూడుగంటలకు ప్రారంభమైంది. ఈ సభ కోసం సంఘ బంధం కార్యాలయ సీసీలు, వీవోఏలు రెండ్రోజులుగా గ్రామాల్లోకి వెళ్లి పొదుపు మహిళలపై ఒత్తిడి తెచ్చారు. కలిగిరి సభకు హాజరుకాకుంటే రుణాల మంజూరు సమయంలో సంతకాలు పెట్టం, పథకాలు వర్తింపజేయమంటే సోమవారం మధ్యాహ్నం 1గంటకల్లా రావాలంటూ హుకూం జారీ చేశారు. దీంతో మహిళలు ఉదయం 11గంటల నుంచే సభా ప్రాంగణానికి చేరు కున్నారు. అయితే, స్కూలు ప్రాంగణంలో షామియానాలు సరిగ్గా ఏర్పాటు చేయక పోవడం, కుర్చీలు కూడా తక్కువగా ఉండటంతో వచ్చినవారంతా ఎండలోనే నిలబ డాల్సి వచ్చింది. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతుండగానే చాలా మంది మహిళలు నిలబడలేక తిరుగు ప్రయాణమయ్యారు. ఇది గమనిం చిన అధికారులు హైస్కూల్ గేటు మూసివేయడంతో కాసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. స్థానిక నేతల సూచనలతో వీఓఏలు గేటు వద్దకు పరుగులు తీసి మహిళలను వెనక్కు రావాలని బతిమాలడం కనిపిం చింది. 'కుర్చీల్లేవు... కూడు లేదు, కాళ్లు పీకుతున్నాయి, మేము ఇం టికెళ్లా'లంటూ బలవంతంగా గేటు నెట్టుక్కొని వెళ్లిపోయారు. మరో వైపు ఈ సభ కారణంగా మధ్యాహ్నం నుంచి తరగతులు జరగ కపోవడంతో విద్యార్థులు పాఠశాల ఆవరణలోనే ఉండిపోయారు.

మర్రిపాడులో..

స్థానిక హైస్కూల్ ఆవరణలో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వెలుగు సిబ్బంది పొదుపు మహిళలను భారీగా తరలించారు. అన్ని గ్రామాల నుంచి మధ్యాహ్నం 1 గంటకు వచ్చిన మహిళలకు అవసరమైన కుర్చీలు ఏర్పాటు చేయకపోగా, మంచినీరు, బిస్కెట్ ప్యాకెట్లతో సరి పెట్టారు. సాయంత్రం 3.40 గంటలకు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తీరి గ్గా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. కాసేపటికి ఎమ్మెల్యే మాట్లాడుతుండగానే వచ్చిన మహిళలు తిరుగుముఖం పట్టారు. ఎవరూ వెళ్లొద్దని మైకులలో అనౌన్స్ చేసినా ఫలితం లేకపోవడంతో పాఠశాల ప్రధాన గేటుకు వెలుగు సిబ్బంది తాళం వేసి మహిళలను అడ్డుకున్నారు. మరో వైపు పాఠశాల సమయం ముగియడంతో విద్యార్థులు గోడలు దూకి ఇళ్లకు వెళ్లారు.



మర్రిపాడులో నేలపై కూర్చొని..



కలిగిరి : గేటు మూయడంతో మహిళల వాగ్వాదం





మర్రిపాడు : మర్రిపాడు గేటుకు తాళం వేసి మహిళలను అడ్డుకుంటున్న వెలుగు సిబ్బంది, గోడ దూకి ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

నిధులున్నా నీరసం

- కందుకూరులో రూ.31 కోట్లతో అభివృద్ధి పనులు
- బిల్లులపై అనుమానంతో కాంట్రాక్టర్ల వెనుకడుగు
- పూర్తి చేయించడంలో అధికారుల నిర్లక్ష్యం
- అరకొర పనులతో పట్టణవాసుల అవస్థలు

కందుకూరు, జనవరి 29 : కందుకూరు పురపాలక సంఘంలో నిధులు మంజూరై ఉన్నా అభివృద్ధి పనులు జోరందుకోనంటున్నాయి. అధికారుల అలసత్వం.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ పరిధిలో సిమెంటు రోడ్లు, డ్రైన్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.26 కోట్లకు తోడు మున్సిపాలిటీ 15వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్‌తో కలిపి మరో రూ.5 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో పట్టణంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు, డ్రైన్ల నిర్మాణంతోపాటు గాజులకాలువను అండర్‌గ్రౌండ్ డ్రైనేజీగా అభివృద్ధి చేయడం, పార్కుల అభివృద్ధి వంటి పనులను ప్రతిపాదించారు. అయితే 2, 3 నెలల క్రితం చేసిన పనులు మినహా ప్రస్తుతం పనులు ప్రారంభించేందుకు ఎవరూ ఆసక్తి చూపకపోవటంతో మంజూరైన పనులలో మూడో వంతు కూడా పూర్తికాలేదు. చేసిన పనులను కూడా అరకొరగా చేసి వదిలేశారు. సిమెంటురోడ్లు నిర్మించిన చోట కనీసం సైడు బర్మ్‌లకు గ్రావెల్ కూడా తోలకుండా వదిలేశారు. వాహనాల రద్దీ అధికంగా ఉండే అనేకరోడ్లలో వాహనం ఎదురొస్తే మార్జిన్ దిగే అవకాశం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల స్థానికులే విరాళాలు వేసుకుని గ్రావెల్ తోలుకుంటున్న దుస్థితి ఉంది. వెంకటాద్రిపాలెంలో ఇదే జరిగింది. అయినా ఇవేమీ మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు పట్టడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక పార్కుల అభివృద్ధి పనుల్లో అయితే సగం వరకు పనులు చేసి వదిలేసిన పరిస్థితి కావటంతో ప్రజాధనం వృథాఅయ్యే అవకాశం కూడా ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

అధికారుల అత్యుత్సాహం

కాంట్రాక్టర్లు అసంపూర్తి నిర్మాణాలతో వదిలేసినా ఇంజనీరింగ్ అధికారులు ఇదేమని అడగకుండా బిల్లులు చేయటం విశేషం. అసంపూర్తి పనులను కూడా పూర్తయినట్లు ఎంబుక్‌లలో రికార్డుచేసి ప్రభుత్వానికి నివేదించారన్న విమర్శలు ఉన్నాయి. ఎలాగూ పనులు పూర్తయ్యాయని నివేదిక వెళ్లింది కదా డబ్బు చేతికొస్తే ఆ తర్వాత చూద్దాంలే అన్న నిర్లక్ష్యంగా కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్నారు. బిల్లులు పెండింగ్‌పై ఉన్నతాధికారులపై స్థానిక ప్రజాప్రతినిధి చేస్తున్న ఒత్తిడి కారణంగా ఇటీవల రూ.10 కోట్లు విడుదల కాగా వాటిని సంబంధిత కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు ఇంజనీరింగ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పనుల్లో నాణ్యత ఏదీ!?

మరోవైపు చేసిన పనులకు సరైన పర్యవేక్షణ లేక నాణ్యతాలోపాలు బయటపడుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమ ప్రాంతంలో మురుగు కాలువ నిర్మించబోతున్నారు, మా ప్రాంతంలో సిమెంటు రోడ్డు నిర్మాణం జరగబోతోంది మా కష్టాలు ఇక తీరబోతున్నాయని ఎదురుచూసిన ప్రజలకు అధికారుల బాధ్యతారాహిత్యం, కాంట్రాక్టర్ల స్వార్థం కారణంగా తీవ్ర నిరాశే మిగులుతోంది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు పనులు చేయకూడదన్న ఆలోచనతో అనేకమంది కాంట్రాక్టర్లు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు తగినచర్యలు చేపట్టి అభివృద్ధి పనులను వేగవంతం చేయించడంతో పాటు అసంపూర్తి పనులను తక్షణం పూర్తిచేయించాలని పట్టణవాసులు కోరుతున్నారు.



చాకలికుంట రోడ్డులో సైడుబర్మ్‌లకు గ్రావెల్ తోలకపోవటంతో తోలిన పాతగృహాల వ్యర్థాలు

నేడు సర్పంచుల నిరసన దీక్ష

నెల్లూరు (హరనాథపురం) : తమ 16 డిమాండ్ల సాధన కోసం మంగళవారం నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద నిరసన దీక్ష చేపడుతున్నట్లు పంచాయతీ రాజ్ చాంబర్ సర్పంచుల సంఘం ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కంద మూడి శివ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

పెళ్లి నమోదైనా

బాదుడే!

'ఇళ్లు కట్టి చూడు... పెళ్లి చేసి చూడు' అనే సామెత వాటి భారాన్ని తెలియ చేస్తుంది. పెళ్లిళ్లు భారం కావడంతో గతంలో వారంపాటు జరిగే ఈ తంతును నేడు కొన్ని గంటల్లోనే ముగిస్తున్నారు. అతితక్కువ ఖర్చుతో జరిగే వివాహ రిజిస్ట్రేషన్లు కూడా జగనన్న బాదుడు నుంచి తప్పించుకోలేకపోయాయి. ప్రజల అభీష్టం మేరకు హిందూ వివాహ చట్టంలో మార్పులు చేస్తున్నామంటూ డిజిటలైజేషన్ సాకుగా చూపి రిజిస్ట్రేషన్ ఫీజులను వైసీపీ ప్రభుత్వం అమాంతం పెంచే సింది. దీనిపై గతేడాది డిసెంబరు 22న జీవో నెం.609ని గుట్టుచప్పుడు కాకుండా విడుదల చేసింది. ఇది రిజిష్టర్ మ్యారేజీ చేసుకునేవారికి గుదిబండగా మారింది.

- వివాహ రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచేసిన ప్రభుత్వం
- మూడు నుంచి నాలుగు రెట్లు ఒకేసారి పెంపు

వివాహ రిజిస్ట్రేషన్‌కు ఆన్‌లైన్‌లో ముందుగా రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి. అనంతరం దరఖాస్తు పూరించి స్లాట్ బుక్ చేసుకోవాలి. ఈ స్లాట్ బుకింగ్‌కు రిజిస్ట్రేషన్‌శాఖ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేస్తే భారీగా పెరిగిన ఫీజులు వివరాలు వస్తున్నాయి. ఈ ఫీజులను చూసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకునేవారు భయపడుతున్నారు. హిందూ వివాహ చట్టానికి 1955, 1965 సంవత్సరాలలో స్వల్ప సవరణలు చేసినా వివాహ రిజిస్ట్రేషన్ ఫీజులను మాత్రం అప్పటి ప్రభుత్వాలు పెంచలేదు. అయితే జగన్ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖపై దృష్టి సారించి ఫీజుల పెంపును చేపట్టింది. సాధారణంగా హిందూ వివాహాలు ఆలయాలు, కల్యాణ మండపాలు, ఇళ్ల దగ్గర బంధువుల సమక్షంలోనూ జరుపుకోవటం ఆనవాయితీ. ఇలాంటి ఆడంబరాలు ఏమీ లేకుండా కొందరు రిజిస్ట్రార్ సమక్షంలో వివాహం చేసుకోవటం అనాదిగా వస్తున్నది. మరికొందరు బయట వివాహం చేసుకొని ఆ వివాహాన్ని చట్టబద్ధం చేసుకునేందుకు రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. విదేశాలకు వెళ్లి స్థిరపడాలనుకొనే వారు వివాహ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరిగా చేసుకోవాలి. ఈ క్రమంలో వీటిపైఫీజులు పెంచి ఖజానా నింపుకోవాలని ప్రభుత్వం పూనుకుంది.

రూ.200 చలానాతో...

వివాహ రిజిస్ట్రేషన్ దరఖాస్తుతోపాటు గతంలో రూ.200కు చలానా తీసేవారు. దంపతులు అందించే ధ్రువీకరణ పత్రాలు, రికార్డుల పరిశీలన కోసం రూ. 50 చెల్లించాల్సి వచ్చేది. పెళ్లి చేసుకుంటున్న కల్యాణ మండపం, ఆలయానికే రిజిస్ట్రార్ నేరుగా వివాహానికి వచ్చి రిజిస్టర్ చేయాలంటే రూ.1,100 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉండేది. ఇదంతా గతం. ప్రస్తుతం ఈ ఫీజులను ప్రభుత్వం మూడు నుంచి పది రేట్ల వరకు పెంచేసింది.

పెరిగిన ఫీజులు ఇలా...

చలానా ఫీజు రూ.200 ఉంటే ఇప్పుడు ఏకంగా రూ.500లకు పెంచారు. దంపతులు అందించే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు గతంలో రూ.10 ఉంటే ఇప్పుడు ఆ ఫీజును రూ.100కు పెంచారు. రికార్డుల తనిఖీకి రూ.10 ఉంటే రూ.100కు పెంచారు. వివాహం చేసుకుంటున్న కల్యాణ మండపానికి కానీ, ఆలయం వద్దకు కానీ రిజిస్ట్రార్ వస్తే ఫీజు రూ.1,100 చెల్లించాల్సి ఉండేది. ఈ ఫీజును నేడు రూ.5000 లకు పెంచారు. సెలవు రోజుల్లో రిజిస్ట్రేషన్ చేయించాలనుకుంటే రూ.5000 చెల్లించాలి. వివాహ రిజిస్ట్రేషన్ల ఫీజులు భారీగా పెంపుపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

- నెల్లూరు(హరనాథపురం)



పెరిగిన ఫీజులు అమలు చేస్తున్నాం..

వివాహ రిజిస్ట్రేషన్లకు పెరిగిన ఫీజులను అమలు చేస్తున్నాం.ఈ ఫీజులను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కాని, ఆన్‌లైన్‌లో కాని చెల్లించి వివాహ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.



- భానుమతి, సబ్‌రిజిస్ట్రార్, నెల్లూరు

పల్లెల్లో ఏరులై పారుతున్న మద్యం

● పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్టు షాపులు ● పట్టించుకోని యంత్రాంగం

ఉదయగిరి రూరల్, జనవరి 29: మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో గ్రామాల్లో మద్యం బెల్టు దుకాణాలు పుట్ట గొడుగుల్లా వెలుస్తున్నాయి. మద్యం ఏరులై పారుతోంది. సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు తదితర మండలాల్లోని అన్ని గ్రామాల్లో మద్యం విచ్చలవిడిగా దొరుకుతోంది. మద్యం విక్రయాలు చేస్తున్నారని అధికారులకు తెలిసినా పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎక్కువ విక్రయాలు జరగాలనే ప్రభుత్వ ఆదేశాలతోనే బెల్టుషాపుల నిర్వహణకు పరోక్షంగా కొందరు అధికారులు, సిబ్బంది ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సిబ్బంది చేతివాటం: మద్యం దుకాణాల్లో విధులు నిర్వహించే సిబ్బంది గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించే వారితో సత్సంబంధాలు ఏర్పరుచుకొని చేతివాటం ప్రదర్శిస్తున్నారు. బెల్టుషాపు నిర్వాహకులు సీసాకు రూ.10ల చొప్పున సిబ్బందికి ముట్టజెప్పుతుండడంతో వారడిగినంత మద్యం అందజేస్తున్నారు.

అధిక ధరకు విక్రయాలు

మద్యం బెల్టు షాపుల నిర్వాహకులు ఒక్కో సీసాపై రూ. 50 నుంచి రూ.80ల అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రధానంగా గండిపాళెం, వెంగళరావునగర్, శకునాలపల్లి, కృష్ణంపల్లి, ఉదయగిరి, అయ్యవారిపల్లి, చెరువుపల్లి, పోలంగారిపల్లి, నందిపాడు, నర్రవాడ, తిమ్మారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో జోరుగా మద్యం బెల్టు దుకాణాలు నడుస్తున్నాయి. ఉదయగిరి పట్టణంలో తెల్లవారుజాము 5 గంటల నుంచే మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు మద్యం బెల్టు దుకాణాలపై ప్రత్యేక నిఘా ఉంచి వాటిని అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఉదయగిరి పట్టణంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు(ఫైల్)

వైభవంగా వెంగమాంబ కల్యాణం



అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 29: నర్రవాడలో వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా సోమవారం కొత్తపేట గ్రామ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో వెంగమాంబ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం చేపట్టారు. గ్రామస్థులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీ, ఆలయ ఉప ప్రధాన అర్చకులు బెల్లంకొండ పెద్దభద్రయ్య, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 29: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో పొగాకు బ్యారన్ దగ్ధమైన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన మద్దిరెడ్డి కొండమ్మ, సుబ్బారెడ్డిలకు చెందిన బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ దశలో ఉంది. ఈ తరుణంలో ఒక్కసారిగా బ్యారన్‌లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఆరు క్వింటాళ్ల పొగాకు, 1100 కర్ర, ఇతరత్రా సామాగ్రి అగ్నికి అహుతి కావడంతో సుమారు రూ.2.50 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. ఉదయగిరి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదంతో తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకొంటున్నారు.

పాఠశాలలో అగ్నిప్రమాదం

ఉదయగిరి రూరల్, జనవరి 29: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని స్టోర్‌రూమ్‌లో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకొంది. గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వాహనం అందుబాటులో లేకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది తాజుద్దీన్, స్వరూప్‌బాబులు అక్కడికి చేరుకొని యువకుల సహాయంతో మంటలను అదుపు చేశారు.

కార్మికుల నిరసన

ఉదయగిరి, జనవరి 29: కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం ఎన్ఎంయూ కార్మికులు ఎర్ర బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. విశాఖలో ఎన్ఎంయూ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కాశీ విశ్వనాథ్, ప్రెసిడెంట్ నాగరాజు, నాయకులు సూర్య నారాయణ, రమణారెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

వరికుంటపాడు, జనవరి 29: పంచాయతీలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్ దిలీప్‌కుమార్ అన్నారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాలు, మురికి కాలువల సౌకర్యానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. త్వరలో జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ కొళాయి ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సమీర్, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే అభివృద్ధి : గొంగటి

వింజమూరు, జనవరి 29 : అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని టీడీపీ మండల అధ్యక్షుడు గొంగటి రఘునాధరెడ్డి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి సవాల్ విసిరారు. పట్టణంలో టీడీపీ కార్యాలయంలో సోమవారం గొంగటి రఘునాధరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ హయాంలో వాటర్ ప్లాంట్‌కు అన్ని సమకూరిస్తే మరమ్మతులు చేయించి పెయింటింగ్ వేసి ప్రారంభోత్సవం చేయడం వైసీపీకే చెల్లిందన్నారు. గ్రామంలో రోడ్లు టీడీపీ హయాంలోనే వేశామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు గూడా నర్సారెడ్డి, వెంకటేశ్వర్లు, కొండపల్లి వెంకటేశ్వర్లు, ఓంకారం వేణుగోపాల్, జయన్న, తిరుపతి ఆచారి, ఎమ్మెస్ నాయుడు, అరికొండ శ్రీనివాసులు, పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

ఉదయగిరి రూరల్, జనవరి 29: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినందుకు గాను గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వోల చేతుల మీదుగా అవార్డు పొందిన మండల వైద్యాధికారిణి శివకల్పనను సోమవారం గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సర్పంచ్ గొల్లపల్లి కల్పన, సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్‌నర్సులు సరోజరాణి, హెల్త్ అసిస్టెంట్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం ప్రవీణ్‌విజయ్ అవార్డు పొందడంతో సన్మానించారు. సోమవారం ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుకన్య, న్యాయవాదులు సందిరెడ్డి రామారావు, షరీఫ్‌లు ఆయనకు అభినందనలు తెలిపి సన్మానించారు.

విజేతలకు అభినందనలు

సంగం, జనవరి 29: నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్రా షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విన్నర్‌గా నిలిచిన గాంధీజన సంఘం ఉన్నత పాఠశాల విద్యార్థినులు బి ప్రియాంక, టి వెంకట శిరీషలను ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరెడ్డి సోమవారం అభినందించారు. వారిని ఉపాధ్యాయులు కూడా అభినందించారు.

పరీక్షలపై అవగాహన

అనంతసాగరం, జనవరి 29: మండలంలోని చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రత్యక్ష ప్రసారం ద్వారా పరీక్షపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు.

సంగం తహసీల్దారుపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్ హరినారాయణన్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

సంగం, జనవరి 29: సంగం గ్రామంలో సర్వే నెంబరు 273లోని ప్రభుత్వ భూమిలో వేసిన అక్రమ లేఅవుట్‌ను పట్టా భూమిగా ఎండార్స్‌మెంట్ ఇచ్చిన తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిట్టు రేణుకారెడ్డి జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. స్పందించిన కలెక్టర్ 273 సర్వే నెంబరుపై పూర్తిస్థాయిలో విచారణ చేసి తప్పు జరిగితే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సంగం గ్రామానికి చెందిన రైతులు కాకు మధుసూదన్ యాదవ్, ప్రసాదు, మస్తానయ్య ఉన్నారు.

సకాలంలో ఇంటి పన్నులు వసూలు చేయాలి

ఉదయగిరి, జనవరి 29: మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు ఇంటిపన్నుల వసూళ్లపై దృష్టిసారించాలని ఈవోపీఆర్డీ మల్లికార్జున కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. మండలంలో రూ.51,04,477 ఇంటి పన్నులు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.6,61,533 వసూలు చేయడం జరిగిందన్నారు. మేజర్ పంచాయతీ ఉదయగిరిలో రూ.34 లక్షలకు గాను రూ.2 లక్షలు వసూలైందని, మార్చి చివరి నాటికి పూర్తి చేయాలని ఆయన సూచించారు.

లబ్ధిదారుల నుంచి నగదు వసూళ్లు అన్యాయం

ఉదయగిరి రూరల్, జనవరి 29: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం లబ్ధిదారుల నుంచి అక్రమంగా నగదు వసూళ్లు చేయడం అన్యాయమని మండల బీజేపీ కన్వీనర్, గన్నేపల్లి సర్పంచ్ నెల్లూరు వెంకటస్వామినాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ విశ్వ కర్మ యోజన పథకానికి ఎంపికైన వారికి శిక్షణ ఇచ్చేందుకు ఉదయ గిరిలో అధికారికంగా బీసీ బాలుర వసతిగృహంలో కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. కానీ అనధికారికంగా కొందరు పట్టణంలోని మరో ప్రాంతంలో శిక్షణ కేంద్రం ఏర్పాటుచేసి లబ్ధిదారుల నుంచి అక్రమంగా నగదు వసూళ్లకు పాల్పడుతున్నారని, తాము కేంద్రం వద్దకెళ్లి అనుమతులు చూపించాలని కోరగా వారి వద్ద ఎలాంటి ఆధారాల్లేవన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులను అడగ్గా ఉదయగిరికి ఒక్క శిక్షణ కేంద్రం మాత్రమే మంజూరైందని తెలిపారు. దీంతో అనధికారికంగా నిర్వహిస్తున్న కేంద్రంపై చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ దృష్టికి తీసుకెళ్లగా ఆమె పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కేంద్రం వద్దకు వెళ్లి విచారణ చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సయ్యద్ షాజహాన్, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

జలసంఘంతో నీటి సమస్యల పరిష్కారం

అనంతసాగరం, జనవరి 29: నూతనంగా ఏర్పాటుచేసిన గ్రామ జలసంఘంతో నీటి సమస్యలు పరిష్కారం అవుతున్నట్లు అనంతసాగరం ఎంపీపీ సంపూర్ణమ్మ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జల సంఘం సభ్యులైన పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నీటి ఇబ్బందులను గుర్తించి జలజీవన్ మిషన్ ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ సుదర్శన్ తదితరులు ఉన్నారు.

నేతల నిర్వాకంతో పతనమవుతున్న వైసీపీ

● వరికుంటపాడు జడ్పీటీసీ ఆగ్రహం



మాట్లాడుతున్న జడ్పీటీసీ నాగేంద్ర

వరికుంటపాడు, జనవరి 29: మండలంలోని కొంతమంది నాయకుల ప్రవర్తనతో వైసీపీ నాశనమయ్యే రోజులు దగ్గర పడ్డాయని సాక్షాత్తూ అదే పార్టీకి చెందిన జడ్పీటీసీ సభ్యుడు రావిళ్ల నాగేంద్ర తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొలి నుంచి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన తనకు ఎలాంటి సమాచారం లేకుండానే తన సొంత పంచాయతీ రామాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం పనులను మంజూరు చేయడం ఎంతవరకు సమంజసమని వాపోయారు. అధిష్ఠానం జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దకపోతే అన్ని పంచాయతీల్లో వైసీపీ ఖాళీ అయ్యే పరిస్థితులు ఏర్పడతాయని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, మాజీ మండల వైసీపీ కన్వీనర్లు గంగవరపు పుల్లయ్య, గుంటుపల్లి నాగభూషణం, మానం మస్తానయ్య, కాశె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ భూ పంపిణీ : ఎమ్మెల్యే



ఆత్మకూరు : నియోజకవర్గంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అసైన్‌మెంట్ ద్వారా భూపంపిణీ జరిగే విధంగా రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఆయన అసిస్టెంట్ కలెక్టర్ సంజనా సిన్హా, ఆర్డీవో కె మధులతతో కలిసి నియోకవర్గంలోని అన్ని మండలాల తహశీల్దార్లు, వైసీపీ రెవెన్యూ సమన్వయ కమిటీ కన్వీనర్లుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూపంపిణీకి అర్హుల జాబితాను పరిశీలించి మంగళవారం సాయంత్రానికి ఆర్డీవోకు అందజేయాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా సంబరాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇందూరు వెంకటరమణారెడ్డి, ఆత్మకూరు సొసైటీ ఛైర్మన్ సానా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ప్రతిపక్షమంటే అలుసా..?



ఎంపీడీవో గదికి వినతిపత్రం అంటిస్తున్న సర్పంచి తనయుడు

వరికుంటపాడు, జనవరి 29: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడే ప్రతిపక్ష టీడీపీ సర్పంచ్‌లంటే అధికారులకు అలుసా అంటూ సోమవారం రామాపురం పంచాయతీ సర్పంచ్ తనయుడు అరికొండ వెంకటరత్నం అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పంచాయతీ సర్పంచ్ ప్రమేయం లేకుండానే ఎంపీడీవో కొంతమందికి తీర్మానాలను ఇస్తున్నారన్న సమాచారంతో తాను వినతిపత్రం ఇచ్చేందుకు కార్యాలయానికి వచ్చినప్పటికీ సరైన స్పందన లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పంచాయతీలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద మంజూరైన పనులకు అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ తీర్మానాలు ఇచ్చేందుకు పూనుకోవడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఎంపీడీవో నుంచి స్పందన లేకపోవడంతో కార్యాలయంలోని అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లగా వారు తీసుకోకపోవడంతో తీవ్ర అసహనానికి గురై ఎంపీడీవో కార్యాలయ గది గోడకు ఆ వినతిపత్రాన్ని అంటించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

11 మద్యం సీసాల స్వాధీనం

ఉదయగిరి, జనవరి 29: మండలంలోని తిరుమలాపురం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మద్దిశెట్టి వెంకటేశ్వర్లును సోమవారం తెల్లవారుజామున ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి అరెస్టు చేశారు. కిరాణా దుకాణంలో మద్యం విక్రయిస్తున్నాడని అందిన సమాచారం మేరకు సిబ్బంది దాడులు నిర్వహించగా 11 మద్యం సీసాలు దొరికాయని, దీంతో అరెస్టు చేశామని తెలిపారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఓట్ల తొలగింపునకు కుట్ర : ఇంటూరి



విలేకరులతో మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు

కందుకూరు, జనవరి 29: కందుకూరు నియోజకవర్గంలో టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించేందుకు వైసీపీ నేతలు కుట్ర చేస్తున్నారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కందుకూరు మండలంలోని పలుకూరు, పట్టణంలో చనిపోయిన వ్యక్తుల పేర్లతో ఫారం 7లు పెట్టించారని, తాజాగా లింగసముద్రం మండలం చినపవనిలో 49మంది టీడీపీ కార్యకర్తల ఓట్లు తొలగించేందుకు ప్రయత్నించారని ఆయన చెప్పారు. చినపవనికి సంబంధం లేని ఎమ్మెల్యే కార్యాలయంలో గతంలో పనిచేసిన ఓవ్యక్తితో ఫారం7లు పెట్టించి విద్యార్థులు, తాత్కాలిక వలసలు పోయిన వ్యక్తుల ఓట్లు తొలగించేందుకు ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. సమావేశంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, చిలకపాటి మధుబాబు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ,జి. మోషే, ముచ్చు శ్రీను, వడ్డెళ్ల రవిచంద్ర పాల్గొన్నారు.

అభివృద్ధిలో కావలి అట్టడుగు.. అవినీతిలో ముందడుగు : జనసేన



మాట్లాడుతున్న సిద్దూ

కావలి, జనవరి 29: కావలి నియోజకవర్గం అభివృద్ధిలో అట్టడుగున ఉండగా, అవినీతిలో మాత్రం ముందడుగులో ఉందని జనసేన ఎన్నికల ప్రచార కమిటీ సభ్యుడు సిద్దూ తెలిపారు. పదేళ్ల ఎమ్మెల్యేగా పనిచేసిన ప్రతాప్‌కుమార్ రెడ్డి 10 కి.మీ తుమ్మలపెంట రోడ్డును వేయలేక పోయారన్నారు. జనంలోకి జనసేనలో భాగంగా సోమవారం ఆయన కావలి రూరల్ మండలం శ్రీరాంపురంలో పర్యటించారు. అక్కడ జరిగిన సభలో సిద్దూ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం పవన్‌కల్యాణ్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో అవినీతి, అరాచకాలు పెరిగిపోయాయన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు తోట వెంకటశేషయ్య, తిరుపతి స్వామి, చంటి, లక్ష్మణ్, రామకృష్ణ, జయరామ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

● మీరు బాక్సింగ్ చేస్తే.. మేం ఫుట్‌బాల్ ఆడుతాం !

భీమిలిలో జగన్ నిర్వహించిన సిద్ధం బహిరంగసభలో పవన్, చంద్రబాబు ఫొటోలతో బాక్సింగ్ చేస్తున్నట్లు ఫ్లెక్సీలు పెట్టి శునకానందం పొందటం చూస్తే జగన్ పిచ్చి పరాకాష్టకు చేరినట్లు ఉందని జనసేన కావలి నియోజకవర్గ అధికార ప్రతినిధి రిషికేష్ తెలిపారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాము కూడా జగన్ బొమ్మలతో ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ ఆడినట్లు ఫ్లెక్సీలు వేసి వీధికొకటి పెట్టగలమన్నారు. అయితే జనసేన మాకు క్రమశిక్షణ నేర్పిందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన అధికారంలోకి రావటం ఖాయమన్నారు. సమావేశంలో జనసేన నాయకులు తిరుమలశెట్టి సుధీర్, బెల్లంకొండ మస్తాన్‌బాబు, కృష్ణయ్య, జానీ, సమీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నారా భువనేశ్వరి పర్యటన

● ఉలవపాడు, గుడ్లూరు, కొండాపురం మండలాల్లో 'నిజం గెలవాలి'

కందుకూరు, జనవరి 29 : 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి బుధ, గురువారాల్లో కందుకూరు నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన సమయంలో తీవ్ర మనోవేదనకు గురై మృతి చెందిన ఐదుగురు టీడీపీ కార్యకర్తల కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించనున్నారని పేర్కొన్నారు. 31న సాయంత్రం ఉలవపాడు మండలం ఆత్మకూరు, టెంకాయచెట్లపాలెం గ్రామాలలో పర్యటిస్తారని తెలిపారు. రాత్రికి కందుకూరులో బసచేసి ఫిబ్రవరి 1న ఉదయం గుడ్లూరు, దారకానిపాడు గ్రామాలలో కార్యకర్తల కుటుంబాలను భువనేశ్వరి పరామర్శిస్తారని తెలిపారు. భువనేశ్వరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

● 1న కొండాపురంలో..

కొండాపురం : చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఫిబ్రవరి 1న మండలంలో పర్యటిస్తారని మండల టీడీపీ కన్వీనర్ ఎం.ఓంకారం, క్లస్టర్ ఇన్‌చార్జి సీహెచ్.వెంకటాద్రి సోమవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా మరణించిన తాటిపర్తి సుధాకర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆ రోజు ఆమె కొమ్మి గ్రామానికి వస్తారని తెలిపారు. మండల టీడీపీ నాయకులు, తెలుగుమహిళలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

ఆడుదాం ఆంధ్రాలో అల్లూరుకు బహుమతులు



అల్లూరు : బహుమతులు పొందిన విద్యార్థినులతో ఎంపీడీవో జ్యోతి తదితరులు

అల్లూరు, జనవరి 29 : ఆడుదాం ఆంధ్రాలో అల్లూరు మండలానికి బహుమతులు వచ్చినట్లు ఎంపీడీవో జ్యోతి తెలిపారు. సోమవారం విజేతలను ఆమె తన కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఖోఖోలో బాలికల విభాగంలో ప్రథమ బహుమతిని, క్రికెట్, బాడ్మింటన్‌లో బాలుర విభాగంలో ద్వితీయ బహుమతులు, ఖోఖో కబడ్డీల్లో బాలికల విభాగంలో మూడవ బహుమతులు, కబడ్డీ బాలుర విభాగంలో ద్వితీయ బహుమతి, బ్యాడ్మింటన్ బాలికల విభాగంలో ద్వితీయ బహుమతిని సాధించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది నాగరాజు, పీడీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కావలి టౌన్ : క్రీడా విజేతలను అభినందిస్తున్న పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

● క్రీడా విజేతలకు అభినందనలు

కావలి టౌన్, జనవరి29: వీఎస్‌యూ అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన పీజీ కళాశాల క్రీడాకారులకు సోమవారం కళాశాలలో అభినందించారు. పీడీ మణికంఠ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు విజేతలను జ్ఞాపికలతో అభినందించారు. ఆయన మాట్లాడుతూ పీజీ కళాశాల విద్యార్థులు క్రీడాపోటీల్లో రాణించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పీడీ మణికంఠను ప్రత్యేకంగా అభినందించారు.

కావలి నృత్యకారిణులకు స్వర్ణనంది పురస్కారాలు



స్వర్ణనంది పురస్కారాలు అందుకున్న కావలి చిన్నారులు

కావలిటౌన్, జనవరి29: స్థానిక శ్రీవిఘ్నేశ్వర నృత్య కళానిలయానికి చెందిన నృత్యకారిణులకు స్వర్ణనంది పురస్కారాలు లభించాయి. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో ఆది, సోమవారాల్లో భారత్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో సంస్కృతి, సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కావలి చిన్నారుల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. నాట్యాచార్యులు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నాట్యాచారిణి ఎం శివాని శిష్య బృందం అక్షయ, నాఫియ, లాస్యప్రియ, సాయిశిరి హేమన్య, గ్రీష్మ, చైత్ర, జి గిరిణి, హర్షిణి, తుషార పాల్గొని ఉత్తమ నాట్య ప్రదర్శన చేశారని తెలిపారు. దీంతో వారు మాజీ మంత్రి, సినీ నటులు బాబుమోహన్ చేతుల మీదుగా స్వర్ణనంది పురస్కారాలు అందుకున్నారని ఆయన వివరించారు.

ఆసరా చెక్కుల పంపిణీ

కందుకూరు, జనవరి 29: కందుకూరు మున్సిపాలిటీ, రూరల్ మండలాల పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు నాల్గవ ఏడాది రుణమాఫీ కింద ఆసరా చెక్కుల పంపిణీని సోమవారం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని చెక్కులను అందజేశారు. అనంతరం ఉజ్వల్ పథకం కింద పేద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయశేఖర్, మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్, డీఆర్‌డీఏ- వెలుగు అధికారులు, ఎంపీపీ ఇంటూరి సుశీల, జడ్పీటీసీ, టి. అనసూయ తదితరులు పాల్గొన్నారు.

● ఆయుస్మాన్ భారత్ కార్డుల పంపిణీ

ఈ సందర్భంగా వికసిత భారత్ సంకల్పయాత్ర ప్రచారరథం కందుకూరులో పర్యటించనున్న నేపథ్యంలో బీజేపీ నాయకులు మన్నేపల్లి వరప్రసాదరావు, జొన్నాదుల సురేష్, జె. వైకుంఠం తదితరుల చేతుల మీదుగా ఆయుస్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

బిట్రగుంట : బోగోలు మండలం రామస్వామిపాలెంలోని రామలింగేశ్వరుడికి సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. వరహాలచల సాయిరామాచార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం విఘ్నేశ్వరపూజ, రామలింగేశ్వరుడికి పంచామృత, రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ వ్యవస్థాపకుడు రవిచంద్ర దంపతులకు అర్చకులు ఆశీర్వాదం ఇచ్చారు. ప్రవాస భారతీయులు బచ్చు కృష్ణకుమార్, సంధ్య దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అనంతరం వారు ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు.

చలో విజయవాడ కరపత్రాల ఆవిష్కరణ

ఉలవపాడు : చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సోమవారం పెద్దపట్టపుపాలెం హైస్కూల్‌లో భోజన విరామ సమయంలో కరపత్రాల ఆవిష్కరణ జరిగిందని బీటీఏ మండల అధ్యక్షుడు పున్నెపల్లి శ్రీనివాసులు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని , పైగా కాలయాపన చేస్తున్నందున బీటీఏ ఫిబ్రవరి 5న విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద చేపట్టనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ధన్యాసి మురళీమోహన్, నలీం భాష, సుదర్శి భాస్కర్, ఎద్దు శ్రీనివాసులు, దాసరి బాలయ్య, వెలిచర్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

లింగసముద్రం, జనవరి 29 : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్టేట్ రిసోర్స్ పర్సన్ కే వెంకయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సామాజిక తనిఖీ అధికారులైన డీఆర్‌పీలు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కూలీలను విచారించి, పనులను కూడా తనిఖీ చేస్తారని చెప్పారు. గ్రామసభలు నిర్వహించి, విచారణ నివేదికలను ప్రజలకు తెలియచేస్తారని తెలిపారు. డ్వామా అధికారి సమక్షంలో ఈ విచారణ నివేదికలను వివరిస్తామని ఆయన చెప్పారు.

రాజీవ్‌నగర్ పార్కును పట్టించుకోండి



కమిషనర్‌కి వినతిపత్రం ఇచ్చిన రాజీవ్‌నగర్ వాసులు

కావలి, జనవరి 29 : మద్యం, గంజాయి ప్రియులకు, అసాంఘిక కార్యకలాపాలకు పాతూరులోని రాజీవ్‌నగర్ పార్కు అడ్డాగా మారిందని ఆ ప్రాంతవాసులు వాపోయారు. సోమవారం వారు మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం మాట్లాడుతూ పార్కును పట్టించుకునేవారు లేక శిథిలావస్థకు చేరిందన్నారు. స్పందించిన కమిషనర్ పార్కు అభివృద్ధికి కృషిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాజీవ్‌నగర్ వాసులు కొల్లి శ్రీనివాసులు, తోట శరణ్, టీ. వినయ్, కోల కమలేష్, బాలు, కొల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడి అరెస్టు

లింగసముద్రం, జనవరి 29: లింగసముద్రంలో బాలికపై అత్యాచారయత్నం చేసిన నిందితుడు తమ్మినేని ఉమాశంకర్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ సంఘటనపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, సోమవారం మధ్యాహ్నం నిందితుడు ఉమాశంకర్‌రెడ్డిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై ఎం బాజీబాబు చెప్పారు.రిమాండ్ నిమిత్తం కోర్టులో ప్రవేశపెడతామని ఆయన తెలిపారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

లింగసముద్రం, జనవరి 29 : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు 4వ విడత ఆసరా చెక్కుల పంపిణీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో యు శేషుబాబు, వైఎస్ఆర్ క్రాంతిపథం ఏపీఎం కె సింహాద్రిరావు సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి హాజరౌతారని తెలిపారు.

అనివేటి మండపం నిర్మాణానికి విరాళం

కందుకూరు, జనవరి 29: కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న అనివేటి మండపం నిర్మాణం కోసం కంకణాల నారాయణ, అఖిల దంపతులు సోమవారం రూ. 25,116లు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావు, తల్లపనేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ కమిటీల ఎన్నిక

ఉలవపాడు : ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ మండల కమిటీల ఎన్నిక జరిగిందని మహాజన సోషలిస్టు పార్టీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రావినూతల ముత్తు మాదిగ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా రావినూతల సతీష్‌మాదిగ, పున్నెపల్లి పేరయ్య మాదిగలను ఎన్నుకోగా, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడిగా కేరేటి గోపాల్ మాదిగను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాల మాదిగ, కందుకూరు డివిజన్ ఎంఈఎఫ్ అధ్యక్షుడు జడ రాములు, శ్రీను, రాజేష్, ఏలియా, అశోక్, టోనీ, జగదీష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మారిన అధికారుల ఫోన్ నెంబర్లు

కందుకూరు : కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అధికారుల ఫోన్ నెంబర్లు మారినట్లు రెవెన్యూ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఫోన్‌నెంబర్లు వివరాలు... సబ్‌కలెక్టరు-87126 22671, సబ్‌కలెక్టరు కార్యాలయ ఏవో - 8712622672, కందుకూరు తహసీల్దార్-8712622673, గుడ్లూరు తహసీల్దార్ -8712622674, లింగసముద్రం తహసీల్దార్- 8712622 675,ఉలవపాడు తహసీల్దార్-8712622676, వలేటివారిపాలెం తహసీల్దార్ -8712622677, స్పెషల్ తహసీల్దార్- 8712622679 అని పేర్కొన్నారు.

దళితుల పక్షపాతి చంద్రబాబు

కందుకూరు : దళితుల పక్షపాతి చంద్రబాబు కాగా, దళితద్రోహి జగన్మోహనరెడ్డి అని ఈ నాలు గేళ్లలో నిరూపితమైందని టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 2014-19 మధ్యకాలంలో టీడీపీ అధికారంలో ఉండగా అప్పట్లో సీఎం చంద్రబాబు దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇన్నోవా కార్లు, ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లు, బ్యాంకు లింకేజీ పథకంతో 60 శాతం సబ్సిడీతో కూడిన రుణాలు ఇచ్చేవారని పేర్కొన్నారు. జగన్మోహనరెడ్డి 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి దగా చేశాడన్నారు.